Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు పసమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాశ్రమాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :238 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు శనివారం 20 డిసెంబర్ 2025 పేజీలు :12 వేల రూ5 /-


## సమస్యలతో...
# సర్పంచ్ లకు స్వాగతం

హైదరాబాద్, డిసెంబర్ 19:దీర్ఘకాలికంగా గ్రామాలలో సర్పంచ్ పాలకమండలి పరిపాలన లేకపోవడంతో గ్రామాలలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయి. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామాలలో గ్రామ సర్పంచులు పాలకమండలి సభ్యులు గ్రామాల అభివృద్ధిలో కీలక భాగస్వామ్యంగా ఉన్నారు. గత సర్పంచులు పాలకమండలి సభ్యులు పదవీకాలం ముగిసిన దగ్గర నుండి గ్రామాలలో సరి అయిన పరిపాలన లేకపోవడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్లు, అభివృద్ధి పథకాలకు ఇచ్చే నిధులు ఆగిపోవడంతో గ్రామాలలో అభివృద్ధి



కుంటుబడింది.గ్రామపంచాయతీలకు కొత్త సర్పంచులు రావడంతో వారికి గ్రామాలలో అనేక సమస్యలు తో పాటు అభివృద్ధి పనులు , కేంద్ర రాష్ట్ర సంక్షేమ పథకాలను అమలుపరచడంలో కీలకం కానున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం కూడా సర్పంచులు పాలక మండలి సభ్యులు లే గ్రామాల అభివృద్ధిలో కీలక భాగస్వామ్యం కానున్నారు.సర్పంచ్ పాలకమండలి ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధిలో రూపురేఖలు మారనున్నాయి.మండలంలో కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ లు పాలకమండలి సభ్యులకు గ్రామాలు స్వాగతం పలుకుతూనే, వివిధ సమస్యలు కూడా స్వాగతం పలుకుతున్నాయి. 31 గ్రామపంచాయతీలలో - మిగతా3లో

## రెండేళ్లలోనే తెలంగాణ
# రాష్ట్రానికి కొత్త దిశ

**మారుతున్న కాలానికి అనుగుణంగా పనితీరు మారాలి**
**డీపీఆర్వోల వర్క్‌షాపులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్:డిసెంబర్19 :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం, రెండేళ్ల పాలనలోనే తెలంగాణకు స్పష్టమైన కొత్త దిశను చూపించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు ఏ మార్పు కోరుకొని కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉంచారో, ఆ మార్పును కేవలం రెండేళ్లలోనే ప్రజల కళ్ల ముందే నిలబెట్టామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. తెలంగాణ సమాచార పౌర సంబంధాల - మిగతా3లో

## నియామకాల్లో
# పారదర్శకత ముఖ్యం

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

హైదరాబాద్, డిసెంబర్ 19: నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నియామకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషన్ చైర్మన్లకు స్పష్టం చేశారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత్ భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చుని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్



కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు.ఈ సదస్సుకు హాజరైన రాష్ట్రపతి ముర్ముకు రామోజీ ఫిలిం సిటీలో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట తెలంగాణకు చెందిన పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, యూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్, యూపీఎస్సీ కార్యదర్శి శశి రంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు శనివారం (20-12-2025)తో ముగియనుంది. ఈ సదస్సుకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరుకానున్నారు.

## రంగంలోకి
# దళపతి...

హైదరాబాద్, డిసెంబర్ 19 : గులాబీ బాస్ కేసీఆర్ చాలా రోజుల తర్వాత తెలంగాణ భవన్‌కు రాబోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తుంటి ఎముక గాయంతో కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకున్న గులాబీ దళపతి, లోక్ సభ ఎన్నికల ప్రచారం తర్వాత పూర్తిగా ఫార్మ్ హౌస్‌కే పరిమితం అయ్యారు. పార్టీ నేతలతో సమావేశాలు ఉన్నా ఫార్మ్ హౌస్‌కే నేతలను పిలిపించుకుని మాట్లాడుతున్నారు. కాళేశ్వరంపై ప్రభుత్వం నియమించిన కమిషన్ ముందుకు విచారణకు హాజరైన కేసీఆర్..ఆ తర్వాత రెండు, మూడు సార్లు వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ వచ్చారు.ఈ రెండేళ్లలో తెలంగాణ భవన్‌లో ఒకసారి కార్యవర్గ సమావేశం నిర్వహించగా, గత ఏప్రిల్ లో వరంగల్ లో జరిగిన పార్టీ సిల్వర్ జూబ్లీ సభలో పాల్గొన్నారు గులాబీ బాస్. ఆ తర్వాత ఇన్నాళ్లకు మరోసారి తెలంగాణ భవన్‌కు వస్తున్నారు కేసీఆర్. ఈ నెల 21న బీఆర్ఎస్ఎల్పీ సమావేశంతో పాటు పార్టీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. దీంతో రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే ఈసారి కేసీఆర్ పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగుతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.గడిచిన రెండేళ్లు ఒక లెక్క అయితే..రాబోయే మూడేళ్లు మరో లెక్క అని భావిస్తున్నారట గులాబీ బాస్. రాబోయే రెండేళ్లు పూర్తిగా ఎలక్షన్ ఇయర్స్‌గా పనిచేయాలని నేతలకు డైరెక్షన్స్ ఇవ్వనున్నారట. ముందు నుంచి ఈ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని చెప్తూ వచ్చిన కేసీఆర్..ఇప్పుడు రెండేళ్ల కాంగ్రెస్ పాలనా వైఫల్యాలపై సమర శంఖం పూరించేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారట.మరీ ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాల విషయంలో కేసీఆర్ చాలా సీరియస్‌గా ఉన్నారని తెలుస్తోంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలని కేంద్రానికి చెప్పడంపై కేసీఆర్ సీరియస్ ఉన్నారట. 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి



వచ్చి ఉంటే..ఇప్పటికి పాలమూరు ఎత్తిపోతల పూర్తయ్యేదని..మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు తాగు, సాగు నీరందేదని కేసీఆర్ చెబుతున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రయోజనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ.. రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే దీనిపై సమావేశంలో చర్చించి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించనున్నారని తెలుస్తోంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణం, గోదావరి, కృష్ణా జలాలపై పోరాడేందుకు..ఒక ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది.ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో కొంత నిరాశ ఏర్పడిందని కెసీఆర్ భావిస్తున్నారట. అయితే లేటెస్ట్‌గా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆశించిన దానికంటే మంచి ఫలితాలు రావడంతో బీఆర్ఎస్ - మిగతా3లో



## 24న గద్దెల
# ప్రతిష్ఠాపన...

వరంగల్ , డిసెంబర్ 19 :ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా మేడారానికి పేరు ఉంది. ఈ జాతర ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. ఈసారి జాతరకు దాదాపు 10 లక్షల మించి భక్తులు వస్తారని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే భక్తుల తగ్గట్టుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది. గత ప్రభుత్వాలు తాత్కాలికంగా అభివృద్ధి పనులు చేపడితే, ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా వందల కోట్ల ఖర్చుతో శాశ్వత నిర్మాణాలను ఏర్పాటు చేస్తోంది.మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతుంది. ఈ క్రమంలో ఈ జాతరను పురస్కరించుకొని శాశ్వతమైన - మిగతా3లో

## ప్లాన్ బీ దిశగా...
# కాంగ్రెస్ అడుగులు

హైదరాబాద్, డిసెంబర్ 19:ప్రభుత్వంలో ఉన్నాం..పైగా జూబ్లీహిల్స్ బైఎలక్షన్‌లో గెలిచాం. ఇదే మంచి మూమెంట్ అంటూ ఎట్టకేలకు అన్ని అడ్డంకులు దాటుకుని..పంచాయతీ పోల్స్ పెట్టింది కాంగ్రెస్ సర్కార్. మూడు విడతల్లో 12వేల 726 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ గట్టి నమ్మకం పెట్టుకుంది. కచ్చితంగా పంచాయతీల్లో వార్వన్సైడే అని డిసైడ్‌అయిపోయింది. 90 శాతానికి పైగా పంచాయతీల్లో పాగా వేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లింది.సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలంతా పంచాయతీ సమరంలోనే మునిగిపోయారు. మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ సానుభూతి పరులు గెలిస్తే కలిగే లాభాలను నేతలకు వివరించారు. సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటితే..ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా జనంలోకి తీసుకెళ్లడంతో పాటు వచ్చే జనరల్ ఎలక్షన్కు ఫైట్ చేయడం ఈజీ అవుతుందనే ఆలోచన చేశారు. అందుకే సీఎం రేవంత్ ఈ ఎలక్షన్ను సీరియస్గా తీసుకున్నారు. జిల్లాల్లోనూ సభలు నిర్వహించడం ద్వారా సర్పంచ్ ఎన్నికల హీట్ పెంచారు.రెండేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి..పంచాయతీల్లో గెలవాల్సిన అవసరాన్ని గుర్తు



చేస్తూ స్వయంగా సీయం రేవంతే ఉమ్మడి జిల్లాల్లో సభలు నిర్వహించారు. దీంతో నేతలు చాలా సీరియస్ గా తీసుకొని మొదట్లో ఏకగ్రీవం చేసేందుకు ప్లాన్ చేశారు. మొదటి విడత ఎన్నికల్లో 67 శాతం ఫలితాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఆ తర్వాత రెండు, మూడు విడుతల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ..మరింతగా - మిగతా3లో


వార్తాతరంగాలు
జాతీయ దిన పత్రిక
VAARTHATARANGALU DAILY
విలేఖరులు కావలేను
హైద్రాబాద్, మహబూబ్‌నగర్, కడప ఎడిషన్‌ల నుండి వెలువడుతున్న "వార్తాతరంగాలు" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలో నియోజక వర్గాల వారిగా రిపోర్టర్‌లు కావలెను.
ఆసక్తి గల వారు ఈ నెంబర్‌లను
94407 88196
79816 22474
సంప్రదించగలరు.
SURYODAYA PUBLICATIONS
MIG II B-13, F16,Opp:Sundaraiah Park Gate, Baghlingampally
Hydrabad-44,email:vtarangalu.222208@gmail.com

వార్తాతరంగాలు



# సంపాదకీయం

## బాక్సైట్ తవ్వకాలు కార్పోరేట్లకే..

దేశంలో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నా, అవసరాల రీత్యా దేశం లోకి దిగుమతి అవుతున్నది. ముఖ్యంగా చైనా, రష్యా, యుఎఇ, ఇతర దేశాల నుంచి బాక్సైట్ లేదా అల్యూమినా దిగుమతి జరుగుతున్నది. ఫలితంగా దేశ పరిశ్రమాధిపతులు తమ లాభాలు తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు. ఆ ఆందోళనలో భాగమే, దేశీయ పరిశ్రమలను కాపాడాలంటూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మినరల్ ఇండస్ట్రీస్ (ఫెమి) కేంద్ర ఆర్థిక శాఖను కోరింది. 2025- 26 ఆర్థిక సంవత్సరం అల్యూ మినియం డిమాండ్‌లో 55% దిగుమతులతోనే భర్తీ అయ్యే పరిస్థితి ఉన్నట్లు ఆర్థిక శాఖకు తెలిపింది. ప్రాథమిక అల్యూమినియంతోపాటు అల్యూమినియం డేన్ స్ట్రీమ్ ఉత్పత్తుల (షీట్లు, ఫాయిల్స్, రాడ్లు) దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 7.5% నుంచి 15% సుంకం విధించాలని ఆర్థిక శాఖను కోరింది. అల్యూమినియం సెకండరీ మాన్యుఫ్యాక్టర్స్ అసోషియేషన్ (ఎఎస్ ఎంఎ) మాత్రం ప్రైమరీ అల్యూమినాపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కోరింది. భారతదేశంలో బాక్సైట్ అపారంగా ఉంది. 3 వేల మిలియన్ టన్నుల నిల్వలతో, ప్రపంచంలోనే ఎక్కువ నిల్వలు ఉన్న దేశాల్లో 5వ స్థానంలో ఉంది. ఒడిశా, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, గుజరాత్ మొదలైన రాష్ట్రాల్లో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోనే 51% పైగా బాక్సైట్ ఉంది. అల్యూ మినియం ఉత్పత్తిలో బాక్సైట్ కీలకం. బాక్సైట్ నుంచి అల్యూమినా ముడి పదార్థం తయారు అవుతుంది. అల్యూమినా ద్వారా అల్యూమినియం తయారు చేస్తారు. భారత దేశంలో తయారయ్యే ఉత్పత్తిలో దాదాపు 40% అమెరికాకు ఎగుమతి జరుగుతున్నది. భారతదేశ అల్యూమినియం అమెరికాకు అగ్ర మార్కెట్ ఉంది. 2023లో భారత అల్యూమినియం మార్కెట్ విలువ 11.29 మిలియన్ల అమెరికా డాలర్లు. ఇది భారత జిడిపిలో 2% గా ఉంది. అల్యూమినియంకు ప్రపంచంలో మంచి డిమాండ్ ఉంది. దీన్ని విమానాల తయారీలోనూ, పరిశ్రమలు, ప్యాక్ జింగ్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్ వంటి వాటి తయారీలో వాడతారు. బాక్సైట్‌ను ప్రధానంగా ఆస్ట్రేలియా, చైనా, గినియా, బ్రెజిల్, భారత్ దేశాలతోపాటు ఇండోనేషియా, రష్యా, జమైకా, కజకిస్తాన్, వియత్నాం తదితర దేశాలు ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రపంచంలో ఆల్కోవా, రియో టెంట్, హైడ్రా, ఎస్ఎంబి విన్నింగ్ కన్సార్టియం, అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ చైనా, కంపెనీ డెస్ బాక్సైట్ గినియా, భారత్ అల్యూమినియం కంపెనీ, రామిన్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లు పెద్ద మైనింగ్ కంపెనీలు. భారతదేశంలో హిందూస్తాన్ అల్యూమినియం కంపెనీ, వేదాంత లిమిటెడ్, ఇండియా ఫాయిల్స్ లిమిటెడ్, సచేటా మెటల్స్, జిందాల్ అల్యూమినియం, నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, భారత్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, మద్రాస్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, ఇండియన్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, సెంచరీ ఎక్స్ ట్రూషన్స్ లిమిటెడ్ అల్యూమినియం కంపెనీలు ఉత్పత్తి కంపెనీలుగా ఉన్నాయి. అల్యూమినియం ధరలు బాగా పెరగడంతో ప్రపంచ కంపెనీలతో పాటు, భారత కంపెనీలకు పెద్ద ఎత్తున లాభాలు వస్తున్నాయి. ఆదిత్య బిర్లాకు చెందిన ఫ్లాగ్ షిప్ మెటల్ కంపెనీ ప్రపంచం లోనే అతిపెద్ద అల్యూమినియం కంపెనీల్లో ఒకటి. దీని ఆదాయం 28 బిలియన్ డాలర్లుగా ఉంది. కాఫర్, స్పెషాల్టీ అల్యూమినా లో కూడా ఈ కంపెనీ బలంగా ఉంది. పది దేశాల్లో 48 ఫ్యాక్టరీలు కలిగి ఉంది. గత మూడు సంవత్సరాల్లో దీని అమ్మకాలు 69 శాతానికిపెరిగి లాభాలు 4.1% ఉన్నాయి. వేదాంత అనుబంధ సంస్థ అయిన వేదాంత అల్యూమినియం భారత్ అతిపెద్ద, ప్రపంచంలో టాప్ అల్యూమినియం కంపెనీల్లో ఉంది. 2025లో భారత్ మొత్తం అల్యూమినియం ఉత్పత్తిలో సగం ఉత్పత్తి దీని నుంచే ఉంది. ఆ సంవత్సరం 2.42 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేసింది. గత మూడు సంవత్సరాల్లో అమ్మకాలు 4.8% పెరిగాయి. నాల్కో- ఇది నవరత్న హోదా కలిగిన ప్రభుత్వ కంపెనీ. బాక్సైట్ మైనింగ్, అల్యూమినా, అల్యూమినియంకి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. దీని బాక్సైట్ కెపాసిటీ సామర్థ్యం ఏడాదికి 68 లక్షల టన్నులుగా ఉంది. అల్యూమినా సామర్థ్యం 21 లక్షల టన్నులుగా ఉంది. 2025లో దీని నికర లాభం 158% పెరిగి రూ. 52,679 కోట్లకు చేరిందని, సంపద 1,67,876 కోట్లకు పెరిగింది. దేశంలో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నా, అవసరాల రీత్యా దేశం లోకి దిగుమతి అవుతున్నది. ముఖ్యంగా చైనా, రష్యా, యుఎఇ, ఇతర దేశాల నుంచి బాక్సైట్ లేదా అల్యూమినా దిగుమతి జరుగుతున్న ది. ఫలితంగా దేశ పరిశ్రమాధిపతులు తమ లాభాలు తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు. ఆ ఆందోళనలో భాగమే, దేశీయ పరిశ్రమలను కాపాడాలంటూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మినరల్ ఇండస్ట్రీస్ (ఫెమి) కేంద్ర ఆర్థిక శాఖను కోరింది. 2025- 26 ఆర్థిక సంవత్సరం అల్యూమినియం డిమాండ్‌లో 55% దిగుమతులతోనే భర్తీ అయ్యే పరిస్థితి ఉన్నట్లు ఆర్థిక శాఖకు తెలిపింది. ప్రాథమిక అల్యూమినియంతోపాటు అల్యూమినియం డేన్ స్ట్రీమ్ ఉత్పత్తుల (షీట్లు, ఫాయిల్స్, రాడ్లు) దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 7.5% నుంచి 15% సుంకం విధించాలని ఆర్థిక శాఖను కోరింది. అల్యూమినియం సెకండరీ మాన్యుఫ్యాక్టర్స్ అసోషియేషన్ (ఎఎస్ ఎంఎ) మాత్రం ప్రైమరీ అల్యూమినాపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కోరింది. దేశంలో అల్యూమినియం ధరల స్థిరీకరించడానికి, అధిక ఇన్‌పుట్ ఖర్చులతో ఇబ్బందిపడుతున్న దిగువ స్థాయి పరిశ్రమలకు అవసరమైన ఉపశమనం అందించడానికి ప్రైమరీ అల్యూమినాపై దిగుమతి సుంకాన్ని తగ్గించమని తెలిపింది. ఇది బడా పరిశ్రమలు, చిన్న పరిశ్రమల మధ్య ఉన్న వైరుధ్యాన్ని తెలియ చేస్తున్నది. బడా పరిశ్రమల వల్ల చిన్న పరిశ్రమలు నష్ట పోతున్న విషయాన్ని ఇది పరోక్షంగా తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో 600 మిలియన్ టన్నుల బాక్సైట్ ఉంది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం దేశం మొత్తం నిల్వల్లో ఇది 21%. ఇందులో విశాఖపట్నం తూర్పు కనుముల్లోనే ఎక్కువగా ఉంది. 2000 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ పాలనలో రాష్ట్రంలోని బాక్సైట్ వనరులను బయటకు తీసేందుకు ప్రణాళికలు రూపొందించింది. అప్పటి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజన ప్రజల భూహక్కులను, షెడ్యూల్డ్ ప్రాంతం లో రాజ్యాంగ రక్షణను నియంత్రించే చట్టాలకు సవరణలు చేయడానికి పూనుకుని, గిరిజనులు, గిరిజన సంఘాల తీవ్ర వ్యతిరేకత వల్ల ఆ ప్రయత్నాలను విరమించుకున్నారు. 2004లో అధికారంలోకి వచ్చిన ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం బాక్సైట్‌ను తవ్వే పనిని చేపట్టింది. 2005 లో జెఎస్‌డబ్లు హెచ్‌ఎల్‌తో, తదుపరి 2007లో రస్ ఆల్ కైమాతో ఒప్పందం కుదుర్చుకున్నది. 1997లో సుప్రీం కోర్టు సమతా తీర్పు ప్రకారం రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ప్రాంతంలో గనులు లేదా పరిశ్రమలకోసం ఏ ప్రైవేట్ కంపెనీ భూమిని స్వాధీనం చేసుకోకుండా లేదా లీజుకు ఇవ్వకుండా నిరోధించడం వల్ల రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మోస పూరితంగా తవ్వకాలను చేపట్టింది. ప్రభుత్వ సంస్థ అయిన ఆం.ప్ర ఖనిజాభివృద్ధి (ఎపిఎండిసి) సంస్థ బాక్సైట్ ని తవ్వుతుంది. దాన్ని ప్రభుత్వం రస్ ఆల్ కైమాకి సరఫరా చేస్తుంది. ఆ సంస్థకు 11 వందల ఎకరాలకు పైగా భూమిని కేటాయించింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గిరిజనులు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేశాయి. ఆ నేపథ్యంలో ఎన్నికలు రావడంతో బాక్సైట్ తవ్వకాలు ఆగిపోయింది. వైసిపి ప్రభుత్వం 2020 డిసెంబర్ లో జిఒ 89 విడుదల చేసి, బాక్సైట్ తవ్వకాలు చేసేందుకు ప్రయత్నించగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర నిరసనలు కొనసాగాయి. తెలంగాణ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల కన్నా చాలా తక్కువ బాక్సైట్ నిల్వలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో బాక్సైట్ అన్వేషణ కొనసాగుతున్నది. నేటి ఎపి కూటమి ప్రభుత్వం కూడా ఖనిజాల తవ్వకాలకు పారిశ్రామిక వేత్తలకు అనుమతులు ఇచ్చే ఆలోచన చేస్తున్నది. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ముఖ్యంగా ఒడిశా, గుజరాత్, జార?ండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బహుళ జాతి సంస్థలు కూడా బాక్సైట్ తవ్వకాలు చేపట్టగా, స్థానికుల వ్యతిరేకత, పర్యావరణ అనుమతులు లేకపోవడం వల్ల కొన్ని ప్రాజెక్టులు ఆగిపోయాయి. మోడీ ప్రభుత్వం అటవీ హక్కుల పరిరక్షణ చట్టానికి చేసిన సవరణలుద్వారా బహుళ జాతి సంస్థలు బాక్సైట్ తవ్వకాలకు అటవీ భూములు పొందే హక్కులు కల్పించింది.

# నేడు అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం

అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవాన్ని డిసెంబర్ 20న నిర్వహించబడుతున్నది ఇది ఐక్యరాజ్యసమితి మరియు దాని సభ్య దేశాల అంతర్జాతీయ వార్షిక ఐక్యత దినం. పేదరికాన్ని తగ్గించడానికి ప్రపంచ లక్ష్యాలు, కార్యక్రమాల గురించి సభ్య దేశాలకు అవగాహన కల్పించడం మరియు ప్రపంచవ్యాప్తంగా స్వతంత్ర దేశాల పేదరిక తగ్గింపు వ్యూహాలను రూపొందించడం భాగస్వామ్యం చేయడం ద్వారా సంఘీభావం యొక్క సార్వత్రిక విలువను గుర్తించడం దీని ప్రధాన లక్ష్యం . అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం ప్రపంచ సాలిడారిటీ ఫండ్ మరియు యునైటెడ్ నేషన్స్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా ప్రచారం చేయబడింది, ఇవి ప్రపంచవ్యాప్తంగా పేదరిక నిర్మూలన కోసం నిర్దేశించబడిన లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించాయి. ఒక వ్యక్తి విద్యకు సహకరించడం ద్వారా లేదా పేదలకు లేదా శారీరకంగా లేదా మానసికంగా వికలాంగులకు సహాయం చేయడం ద్వారా రోజులో పాల్గొనవచ్చు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ద్వారా పేదరికం మరియు ఇతర సామాజిక అడ్డంకులకు ప్రతిస్పందించడానికి ప్రభుత్వాలు ప్రోత్సహించబడతాయి . సభ్య దేశాలు మరియు యూఎన్




మధ్య విదేశీ సంబంధాలను నెలకొల్పడం ద్వారా ఆధునిక యుగంలో ఒక వ్యక్తి యొక్క పౌర మరియు రాజకీయ హక్కులను నిర్ణయించే యూఎన్ మిలీనియం డిక్లరేషన్ క్రింద అంతర్జాతీయ మానవ సాలిడారిటీ డే స్థాపించబడింది. దీనిని 2005 ప్రపంచ సమయంలో జనరల్ అసెంబ్లీ ప్రవేశపెట్టింది. సమ్మిట్ 1 అధికారికంగా డిసెంబర్ 22, 2005న 60/209 తీర్మానం ద్వారా స్థాపించబడింది, ఇది సంఘీభావాన్ని ప్రాథమిక మరియు సార్వత్రిక విలువ. ఐక్యరాజ్యసమితి ప్రకారం, అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం. భిన్నత్వంలో మన ఏకత్వాన్ని జరుపుకునే రోజు, అంతర్జాతీయ ఒప్పందాలకు తమ కట్టుబాట్లను గౌరవించాలని ప్రభుత్వాలకు గుర్తు చేసే రోజు, సంఘీభావం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఒక రోజు, పేదరిక నిర్మూలనతో సహా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంఘీభావాన్ని ప్రోత్సహించే మార్గాలపై చర్చను ప్రోత్సహించే రోజు, పేదరిక నిర్మూలన కోసం కొత్త కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ఒక రోజు. ఈ రోజున, పేదరిక నిర్మూలన కోసం యూఎన్ కొత్త కార్యక్రమాలను ప్రోత్సహిస్తుంది. అంతర్జాతీయ ఒప్పందాల పట్ల తమ కట్టుబాట్లను గౌరవించాలని ప్రభుత్వాలకు ఈ రోజు రిమైండర్గా పనిచేస్తుంది. సంఘీభావం యొక్క ప్రాముఖ్యతను ప్రచారం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా ఈవెంట్లు జరుగుతాయి. ఈ ఈవెంట్లలో ప్రెజెంటేషన్లు, సెమినార్లు, సమావేశాలు మరియు రౌండ్ టుల్ చర్చలు ఉంటాయి. ఈ సంఘటనలలో చాలా వరకు పేదరికాన్ని ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై కూడా దృష్టి పెడుతుంది.

# భారీగా వీసాల రిజెక్ట్...

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19:**అగ్రరాజ్యం అమెరికా వెళ్లాలి.. డాలర్లు సంపాదించాలి అనేది ఒకప్పుడు సంపన్నుల కల.. కానీ ఇప్పుడు మధ్య తరగతి వారు కూడా అమెరికా వెళు తున్నారు. అయితే డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక సీన్ మారిపోయింది. వీసా ఆంక్షలు, నిబంధనలతో అమెరికా వెళ్లేందుకు చాలా మంది వెనుకాడుతున్నారు. అయితే ట్రంప్ రాకముందు కూడా పరిస్థితి ఇలాగే ఉంది. 2024లో ప్రపంచ దేశాలకు చెందిన చాలా వీసాలు తిరస్కరణకు గురయ్యాయి. 2024లో అమెరికా బీ1/బీ2 వీసాలు (బిజినెస్, టూరిజం) తిరస్కార రేట్లు ప్రపంచవ్యాప్తంగా భిన్నంగా ఉన్నాయి. లైచెన్‌స్టీన్, మోనాకో వంటి దేశాల్లో 0%తోపాటు, భారత్ 16.32%తో మధ్యస్థ స్థాయిలో ఉంది. ఈ డేటా ఆర్థిక స్థితి, రాజకీయ సంబంధాలు, ఇమ్మిగ్రేషన్ రిస్క్‌లపై ఆధారపడి ఉంది.చాలా అధిక ఆదాయ దేశాలు తక్కువ తిరస్కారాలు ఎదుర్కొన్నాయి. ఇవి స్థిరమైన ఆర్థిక వ్యవస్థలు, తక్కువ ఇమ్మిగ్రేషన్ రిస్క్ కలిగి ఉన్నాయి. తక్కువ ఆదాయ దేశాల వీసాలు ఎక్కువగా తిరస్కరణకు గురయ్యాయి. లైచెన్‌స్టీన్, మొనాకో, నార్త్ కొరియా కు చెందిన ఒక్క వీసా కూడా




ఆమోదం పొందలేదు. యూఏఈ 1.46 శాతం, జపాన్ 5.76 శాతం, సౌదీ అరేబియా 7.89 శాతం వీసాలు తిరస్కరణకు గురయ్యాయి.భారత్ 16.32%తో 18వ స్థానంలో ఉంది. యూరప్ దేశాలు (ఫ్రాన్స్ 8.50%, జర్మనీ 10.02%) కంటే ఎక్కువ కానీ చైనా (25.37%), పాకిస్తాన్ (45.65%) కంటే మెరుగు. భారతీయుల్లో ఐటీ ప్రొఫెషనల్స్, విద్యార్థులు ఎక్కువగా అప్లై చేస్తున్నారు. డాక్యుమెంట్లు, ఆర్థిక నిరూపణలు బలంగా ఉంటే సక్సెస్ రేటు పెరుగుతుంది.సంఘర్షణలు, పేదరికం, ఇమ్మిగ్రేషన్ చరిత్ర కారణంగా కొన్ని దేశాల్లో 50% మించి తిరస్కారాలు జరిగాయి. ఇరాన్ 55.54 శాతం, కెనడా 56.35 శాతం, ఆఫ్ఘనిస్తాన్ 48.89 శాతం, నైజీరియా 46.51 శాతం, పాకిస్తాన్ 45.65 శాతం వీసాలు తిరస్కరణకు గురయ్యాయి. కెనడా వంటి అధిక ఆదాయ దేశం కూడా అధిక రేటు ఉండటం ఆశ్చర్యకరం హెచ్%-%1బీ వీసాలపై యూఎస్‌కు వెళ్లి బీ1/బీ2 అప్లై చేసే ట్రెండ్ కారణం.వీసా ఇస్తే అమెరికాలోనే స్థిరపడతారనే అనుమానం(భారత్, చైనా వంటి దేశాల్లో ఎక్కువ). ఉద్యోగం, ఆదాయం నిరూణ లేకపోవడం, అసంపూర్ణ పత్రాలు, పారికార్డులు, యుద్ధాలు, అస్థిరణ(ఆఫ్ఘన్, ఇరాన్) తదితర కారణాలతో అమెరికా వీసాలు తిరస్కరిస్తోంది. స్విట్జర్లాండ్, సింగపూర్ వంటి దేశాలు తక్కువ రేట్లు కలిగి ఉంటే, భారతీయులు బలమైన టైస్ (ఫ్యామిలీ, జాబ్) చూపించాలి.ఈ డేటా అమెరికా వీసా పాలసీల ప్రపంచ డైనమిక్స్‌ను తెలియజేస్తుంది. భారత్ మెరుగైన స్థానంలో ఉన్నప్పటికీ, మరింత చైతన్యం అవసరం.

# కేంద్ర జల్ శక్తి శాఖా మంత్రి సీ.ఆర్.పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ...

**న్యూఢిల్లీ:**రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదలపై కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చించారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో పాటిల్ను కలిసి పలు విజ్ఞప్తులు చేశారు. ప్రత్యేకించి విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, పెండింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్కు నీటి భద్రత అత్యంత కీలక అంశమని... రాష్ట్రంలో సాగునీటి-తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రాజెక్టులపై కేంద్ర%-%రాష్ట్ర సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఉందన్నారు.



**జల్ జీవన్ మిషన్**

2025-26 ఆర్థిక సంవత్సరానికి జల్ జీవన్ మిషన్ అమలు కోసం రాష్ట్రానికి అదనంగా రూ.1,000 కోట్లు కేటాయించాలని విన్నవించారు.జల్ జీవన్ మిషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.524.41 కోట్లు ఖర్చు చేశామని, అలాగే దీనికి సంబంధించిన కేంద్ర వాటా నిధులను కూడా విడుదల చేయాలని సీఎం కోరారు.

**పీఎంకేఎస్వై- ఆర్ఆర్ఆర్ పథకం:**

ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్వై-ఆర్ఆర్ఆర్ ) %-% పథకం కింద చెరువులు, కాలువల పునరుద్ధరణకు రాష్ట్రం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని పాటిల్ దృష్టికి సీఎం తీసుకువచ్చారు.ఈ పథకానికి సంబంధించి కేంద్రం వాటా నిధులు వెంటనే విడుదల చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి సామర్థ్యం గణనీయంగా పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

**పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ :**

పోలవరం జాతీయ ప్రాజెక్టులో వివిధ పనులకు సంబంధించి పెండింగులో ఉన్న అనుమతులు వెంటనే వచ్చేలా చూడాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. రెండో దశ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులపై త్వరలోనే పూర్తి నివేదిక కేంద్రానికి సమర్పిస్తామని చెప్పారు.వంశధార నది వివాద ట్రిబ్యునల్ వంశధార నది వివాదానికి సంబంధించి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుల అమలు ఇంకా పూర్తిగా జరగడం లేదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నేరడి బ్యారేజ్ నిర్మాణం శ్రీకాకుళం జిల్లాలోని కరువు ప్రాంతాల నీటి అవసరాలకు అత్యవసరమని తెలిపారు. దీనికి అనుమతులు మంజూరు చేయాలన్నారు.ఆంధ్రప్రదేశ్ హక్కులకు భంగం కలగకుండా, ట్రిబ్యునల్ నిర్ణయాల అమలుకు కేంద్రం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. ఈ అంశంపై తక్షణమే కేంద్ర జోక్యం చేసుకోవాలన్నారు.ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు అంశం :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించేలా కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచాలని భావిస్తోందని, దీనికి సంబంధించి భూసేకరణకు కూడా సిద్ధమైందని సీఎం అన్నారు.అయితే ఈ వివాదం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున కర్నాటక ప్రభుత్వం దీనిపై ముందుకు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం నిలువరించాలని పాటిల్ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

# సగం కాలిన శవంతో చేతబడి

**కరీంనగర్ డిసెంబర్ 19:**స్మార్ట్ కాలంలో నివసిస్తున్నాం. క్షణకాలంలో సముద్రాలు దాటి వెళ్ళిపోతున్నాం. ప్రపంచాన్ని ఒక్క క్లిక్ దూరంలో చూస్తున్నాం. వర్షం ఎప్పుడు కురుస్తుంది? చలి ఎప్పుడు విపరీతంగా ఉంటుంది? ఎండ ఎప్పుడు ఎక్కువగా ఉంటుంది? ఇలా ప్రతి అంశాన్ని జస్ట్ ఇట్టే తీసుకునే స్థాయిలో అభివృద్ధి సాధించాం. ఇన్ని రకాలుగా అభివృద్ధి చెందినప్పటికీ.. ఇంతటి స్థాయిలో గొప్పగా బతుకుతున్నప్పటికీ.. నేటికీ గ్రామీణ ప్రాంతాలలో మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు సోషల్ మీడియా అందుబాటులోకి రావడంతో ఆ మూఢనమ్మకాలు ప్రజల జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అటువంటి సంఘటన తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా మోతె గ్రామంలో చోటుచేసుకుంది.జగిత్యాల జిల్లా మోతే గ్రామంలో ఈనెల 12న సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెకు గ్రామంలో ఉన్న స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మరుసటి రోజు పక్షికి వేయడానికి (తెలంగాణలో ఒక రకమైన సంప్రదాయం) కుటుంబ సభ్యులు వెళ్లారు. స్మశానంలో చూసిన దృశ్యాన్ని చూసి ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. అక్కడి ఆనవాళ్లు వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం కాస్త దావనం లాగా వ్యాపించడంతో ఆ జిల్లా మొత్తం కలకలం రేగింది.స్మశానంలో ఆ యువతి మృతదేహం సగం మాత్రమే కాలింది. పైగా ఆ యువతి అస్థికలను కొంతమంది సేకరించారు. వాటి ద్వారా చేతబడి చేసినట్టు ఆమె కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో సగం కాలిన యువతి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఆందోళన నిర్వహించారు. కొంతమంది మంత్రాలు చేయడం వల్లే తమ కుమార్తె చనిపోయిందని.. ఇప్పటికైనా వారంతా మంత్రాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ప్రదర్శన చేశారు. దీనికి సంబంధించి వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది.

# ప్లాన్ బీ దిశగా కాంగ్రెస్ అడుగులు

- మొదటి పేజీ తరువాయి

పుంజుకోవడంతో కాంగ్రెస్ ఆలోచనలో పడింది.మొదటి విడతలో 67 శాతం గెలుపొందిన కాంగ్రెస్.. మూడు విడుతలు ముగిసే సరికి 52 శాతానికి పడిపోయింది. అనుకున్న దానికన్నా కాంగ్రెస్ వెనుకబడితే.. బీఆర్ఎస్ ఊహించినదానికన్నా పుంజుకోవడం చర్చనీయాంశంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మంచి ఫలితాలు వచ్చిన గ్రామీణ ప్రాంతంలో..బీఆర్ఎస్ మెల్లమెల్లగా పుంజుకుంటున్నట్లు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఇక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు వాయిదా వేసి.. ప్లాన్ బీ అమలు చేసే ఆలోచనలో పడ్డారట కాంగ్రెస్ పెద్దలు.పంచాయతీ ఎన్నికల్లో అనుకున్న విధంగా మంచి రిజల్ట్ వస్తే.. వెంటనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని అనుకున్నారట. కానీ 90 శాతం టార్గెట్ పెట్టుకుంటే 50 శాతానికే పరిమితం కావడంతో కాంగ్రెస్ పెద్దలు ఆలోచనలో పడ్డారట. ఇప్పుడున్న పరిస్థితుల్లో



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం కన్నా.. మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటున్నారట.ముఖ్యంగా వృద్ధులకు అందజేసే పెన్షన్ పెంపు, రైతు భరోసా నిధులను మరోసారి విడుదల చేసిన తర్వాత ఎన్నికలకు వెళ్తే బాగుంటుందనే ఆలోచన చేస్తున్నారట. ఈలోగా అర్బన్ ప్రాంతానికి సంబంధించిన మున్సిపల్ ఎన్నికలను పూర్తిచేయాలని ఆలోచనలో ఉందట. గ్రేటర్ హైదరాబాద్, మున్సిపల్ ఎన్నికల తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను మార్చి, ఏప్రిల్లో నిర్వహించాలని అనుకుంటుందట కాంగ్రెస్ సర్కార్.పంచాయతీ ఎన్నికల ఫలితాల ఎఫెక్ట్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై పడిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటమని చెప్తూ మీడియా సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్..ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎప్పుడు పెడుతారన్న దానిపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. అసెంబ్లీ సమావేశాలు పెట్టి..అన్ని పార్టీల ఒపీనియన్ తీసుకుని..ఎంపీటీసీ, జడ్పీటీసీతో పాటు మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్నదానిపై డెసిషన్ తీసుకుంటామని సీఎం చెప్పడం కొసమెరుపు.

# రంగంలోకి దళపతి...

- మొదటి పేజీ తరువాయి

నేతలు, క్యాడర్ కొంత జోష్ వచ్చింది. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసి ఎన్నికలపై కేసీఆర్ దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. 21న తెలంగాణ భవన్‌లో జరిగే విస్తృత స్థాయి సమావేశంలో వచ్చే ఎన్నికలపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నారట కేసీఆర్.అంతే కాకుండా పార్టీ ఫిరాయింపుల కేసులో దానం నాగేందర్, కడియం శ్రీహరిపై అనర్హత వేటు పడి ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు వస్తే గెలుపే లక్ష్యంగా పనిచేసేలా కేసీఆర్ వ్యూహాలకు పదును పెట్టనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు గులాబీ బాస్ కేసీఆర్ దిశానిర్దేశం చేయడం, ఆదేశాలు ఇవ్వడమే చూసిన నేతలు..ఇకపై కేసీఆర్‌లో స్పష్టమైన మార్పును



చూడబోతున్నారనే టాక్ వినిపిస్తోంది.ఈ నెల 21న తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో పార్టీ బలోపేతంపై అందరి అభిప్రాయాలను కేసీఆర్ తీసుకోనున్నారట. పార్టీ సంస్థాగత నిర్మాణంపై గత కొన్ని రోజులుగా కసరత్తు చేస్తున్న గులాబీ బాస్..కార్యవర్గ సమావేశంలో అందరితో చర్చించి ప్రణాళిక ప్రకటించబోతున్నారట. పార్టీని గ్రామ స్థాయి నుంచి ప్రక్షాళన చేయాలని డిసైడ్ అయిన కేసీఆర్..రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక నుంచి మండల స్థాయి వరకు అన్ని కమిటీల నియామకానికి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను ప్రకటించనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వెంటనే పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించేలా నేతలకు ఆదేశాలు జారీ చేయనున్నారట కేసీఆర్.

# హైదరాబాద్ vs బెంగళూరు..

హైదరాబాద్, డిసెంబర్ 19:ప్రపంచం మొత్తాన్ని ఇప్పుడు ఐటీరంగం శాసిస్తోంది.. ఉదయం లేచిన దగ్గర్నుంచి మొదలు పెడితే రాత్రి పడుకునే వరకు మనిషి జీవితంలో ప్రతి దశను ఐటి నిర్దేశిస్తుంది.. తినే తిండి నుంచి తాగే నీటి వరకు.. వేసుకునే బట్టల నుంచి చదువుకునే చదువు వరకు.. చేసే ఉద్యోగం నుంచి ఉండే నివాసం వరకు.. ఇలా ప్రతి అంశాన్ని ఐటి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం చేస్తోంది. అందువల్లే ఐటీ రంగంలో విరివిగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. అనేక కంపెనీలు ఐటీ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.ప్రపంచ ఐటీ రంగాన్ని అమెరికాలోని సిలికాన్ వ్యాలీ నిర్దేశించేది. కాలానుగుణంగా ప్రపంచంలోని అనేక ప్రాంతాలు ఐటి కేంద్రాలుగా ఏర్పడ్డాయి. మనదేశంలో బెంగళూరు, హైదరాబాద్, పూణే, నోయిడా వంటి ప్రాంతాలలో ఐటీ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇందులో బెంగళూరు, హైదరాబాద్ ఊహించని విధంగా అభివృద్ధి చెందుతున్నాయి. బెంగళూరు అయితే ఏకంగా భారతదేశ ఐటీ రాజధానిగా మారిపోయింది. హైదరాబాద్ కూడా అదే స్థాయిలో అభివృద్ధి చెందుతోంది. ఇప్పటివరకు బాగానే ఉన్నప్పటికీ.. ఇప్పుడు హైదరాబాద్ వర్సెస్ బెంగళూరు అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.. దీనికి సంబంధించి చర్చ కూడా మొదలైంది.బెంగళూరు నగరం ఐటి ఎగుమతులు, స్టార్టప్ రంగాలలో దూసుకుపోతోంది. ఇక్కడ అమెజాన్ నుంచి మొదలు పెడితే టిసిఎస్ వరకు కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఐటీ పరిశ్రమ అభివృద్ధికి విపరీతంగా సహకారం అందిస్తోంది.. బెంగళూరు నగరంలో భారీగా ఐటీ కంపెనీలు ఉన్నప్పటికీ.. జీతాలు కూడా అదే స్థాయిలో లభిస్తున్నప్పటికీ.. ఖర్చు కూడా అదేవిధంగా ఉంటున్నది. భారతదేశపు సిలికాన్ వ్యాలీగా బెంగళూరు నగరం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పెద్ద సంఖ్యలో




ఐటీ కంపెనీలు ఉన్నాయి. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు కూడా ఉన్నాయి. ఇక స్టార్టప్ ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐటీ పరిశ్రమ ఏ స్థాయిలో అయితే అభివృద్ధి చెందిందో.. మిగతా రంగాలు కూడా అదే స్థాయిలో ఇక్కడ ఉన్నాయి. దీంతో జీవన వ్యయం పెరిగిపోయింది. ఐటీ పరిశ్రమలు ఉన్న ప్రాంతాలలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రెంట్ దాదాపు 50 నుంచి 70 వేల వరకు ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు ఇక్కడ ట్రాఫిక్ అత్యంత దారుణంగా ఉంటుంది.. సాయంత్రం, ఉదయం పూట ప్రయాణాలు సాగించాలంటే నరకం చూడాల్సి ఉంటుంది. ఇక్కడ రెంటు మాత్రమే కాదు, ఇళ్ళు కొనుగోలు చేయాలంటే కూడా భారీగా ఖర్చుపెట్టాలి.బెంగళూరు నగరంలో వైట్ ఫీల్డ్, ఎలక్ట్రానిక్ సిటీ, ఓ ఆర్ ఆర్ దూర ప్రాంతాలుగా ఉన్నాయి. ఇక్కడికి పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ కూడా సరిగా ఉండదు. దీనికి తోడు ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇక్కడ మెరుగుపడేందుకు చాలా సమయం పడుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ జామ్ సామాన్యులకే కాదు, సెలబ్రిటీలకు కూడా చుక్కలు చూపిస్తోంది.హైదరాబాద్ నగరంలో ఐటీ మాత్రమే కాకుండా ఫార్మా రంగాలు కూడా విపరీతంగా అభివృద్ధి చెందుతున్నాయి. బెంగళూరు నగరంతో పోల్చి చూస్తే ఇక్కడ జీవన వ్యయం చాలా తక్కువ. జీతభత్యాలు కూడా చాలా ఎక్కువ. పైగా ఇక్కడ జిసిసిలకు హైదరాబాద్ బలమైన కేంద్రంగా మారుతోంది. స్టార్టప్ లకు కూడా గమ్యస్థానంగా రూపాంతరం చెందుతోంది. మౌలిక సదుపాయాలు కూడా బెంగళూరు నగరంతో పోల్చి చూస్తే చాలా ఎక్కువగా ఉన్నాయి.హైదరాబాద్ నగరంలో రోడ్లు విస్తారంగా ఉంటాయి. రియల్ ఎస్టేట్ కూడా తక్కువ స్థాయిలోనే ఉంటాయి. గచ్చిబౌలి, హెచ్ఐటిఈసి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి కేంద్రీకృత జోన్ ల పరిధిలో ఉన్నాయి. పైగా బెంగళూరు నగరంతో పోసి చూస్తే 20 నుంచి 30% వరకు తక్కువ ధరలోనే నివాస గృహాలను సొంతం చేసుకోవడానికి సాధ్యమవుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. కెరియర్ పరంగా చూసుకుంటే ఐటి ఉద్యోగులకు బెంగళూరు ఫస్ట్ ఛాయిస్. స్టార్ట్ అప్, నిచ్ డొమైన్ లు ఉన్న ఐటీ ఉద్యోగులకు మాత్రం హైదరాబాద్ నగరం ఒక మైనస్ పాయింట్ అని చెప్పుకోవచ్చు.ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్యలో హైదరాబాదులో బంజారా హిల్స్ నుంచి మొదలు పెడితే గచ్చిబౌలి వరకు భూముల ధరలలో 8 శాతం వరకు పెరుగుదల నమోదు చేశాయి. ఇక బెంగళూరు ప్రాంతాలలో భూముల ధరలు సగటున 13వేల నుంచి 15 వేల వరకు పెరిగాయి. బయటి ప్రాంతాలలో 9000 నుంచి పదివేల పరిధిలో ఉన్నాయి. అద్దెల ప్రకారం చూసుకుంటే బెంగళూరులో రెంటల్ రిటర్న్స్ మూడు నుంచి నాలుగు శాతం వరకు పెరిగితే.. హైదరాబాద్ నగరంలో అది మూడు నుంచి 3.5 శాతం వరకు ఉంది.

# యమపాశాలుగా టిప్పర్లు

**ఖమ్మం, డిసెంబర్ 19:**మణుగూరు, భద్రాద్రి పవర్ ప్లాంట్ ప్రధాన రహదారి పై బొగ్గులారీలు వస్తున్నాయంటే ప్రజలు హడలిపోతున్నారు. లారీల దూకుడు రోజు రోజుకు పెరిగిపోతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందో అనే ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మణుగూరులో అంతర్గతంగా బొగ్గును సరఫరా చేసే లారీల దూకుడుకు తోడు మణుగూరు ఓసీ, ఓసీ-2 నుంచి బొగ్గును బీటీపీఎస్కు బొగ్గు తరలించే టిప్పర్ల అతి వేగం మిగతా వాహనదారులకు ప్రాణ సంకటంగా మారుతోంది.బొగ్గు టిప్పర్లతో ప్రాణహాని ఉండడమే కాక పర్యావరణం దెబ్బతింటోందనే ఫిర్యాదులు వెల్లువెత్తు తున్నాయి. మణుగూరు టూ ఏటూరు నాగారం ప్రధాన రహదారి అంటేనే వాహన శోధకులతోపాటు, కార్మిక, కార్మికేతర కుటుంబాలు జంకుతున్నాయి. ఓ వైపు గుంతలు.. మరోవైపు వాహనాల రద్దీ. దీనికి తోడు బొగ్గు తరలించే టిప్పర్ల లారీ అతివేగం, డ్రైవర్ల ఇష్టారాజ్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మణుగూరు నుంచి బీటీపీఎస్కు వెళ్లే లారీలు ట్రిప్పుల లెక్కన నడుస్తుండటం తో ఈ లారీలను నడిపే డ్రైవర్లు వేగానికి అడ్డూఅదుపు లేకుండాపోతోంది. మరో వైపు మణుగూరు నుండి బీటీపీఎస్ వెళ్లే ప్రధాన రహదారి నిత్యం ప్రమాదాలకు నెలవుగా మారింది. బొగ్గు లారీల ద్వారా కింద పడే బొగ్గు పెళ్లలు నుజ్జుగా మారి విపరీతమైన దుమ్ము ధూళికీ తోడు లారీల వెనక ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు కంటి నిండా బొగ్గు చూర పడడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. లారీలపై టార్పాలిన్లు కట్టడం లేదు. పైగా బొగ్గును కూడా లారీ బాడీకి సమాంతరంగా కాకుండా హెచ్చుగా పోయడం వల్ల మూలమలుపుల్లో బొగ్గు పెల్లలు రహదారిపై పడడంతో తరచూ ప్రమాదాలు జరుగున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మణుగూరు, బిటిపిఎస్ ఈ మార్గంలో రెండు నిమిషాలకో టిప్పర్ చొప్పున బొగ్గు తీసుకుని పరుగులు తీస్తుంటాయి. సీరియల్ పోతుందని.. రోజుకు ఒక్కో టిప్పర్ నాలుగు నుంచి ఐదు ట్రిప్పులు వేయాల్సి రావడం, గంటలోపు గమ్యాన్ని చేరుకోవాలనే ఆతృతతో డ్రైవర్లు వేగంగా నడుపుతుండడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ మార్గంలో బొగ్గు టిప్పర్లు ఢీకొని అనేక మంది మృతి చెందగా,మరికొందరు తీవ్రగాయాలతో మంచానికే పరిమితమయ్యారు.బొగ్గు తరలించే సమయాన టిప్పర్ల నుంచి బొగ్గు పెళ్లలు రోడ్డుపై పడకుండా పట్టాలను కప్పాల్సి ఉంటుంది. కానీ త్వరగా వెళ్లాలనే ఆత్రుతతో పట్టాలను కప్పక బొగ్గు పెళ్లలు రోడ్డు పై పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అంతేకాక బొగ్గు దుమ్ము ఎగిసిపడు తుండడంతో వెనక వచ్చే ద్విచక్ర వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. బొగ్గు రవాణా టెండర్లలో విధిగా పట్టాలు పూర్తిగా కప్పాలనే నిబంధన ఉన్నా డ్రైవర్లు పెద్దగా పట్టించుకోవడం లేదు. అంతేకాక నల్లటి దుమ్ము లేస్తుండడంతో శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశముందని తెలిసి కూడా పట్టించుకోకపోవడం గమ నార్హం.కొందరు టిప్పర్ చోదకులు పరిమితిని మించి బొగ్గు లోడును తీసుకెళు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లారీల వేగాన్ని, అధికలోడ్ను నియంత్రించి, సామర్థ్యాన్ని పరిశీలించాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకుండా మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. భద్రాద్రి పవర్ ప్లాంట్కు బొగ్గు రవాణా చేసే లారీల డ్రైవర్లకు ఒక్కరికి కూడా లైసెన్స్ లేదని.. మద్యానికి అలవాటుపడి వాహనాలు తోలుతుంటే రవాణాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటే కొంతమేరైనా ప్రమాదాలను నివారించ వచ్చునని, ఆ దిశగా ఆ శాఖ అధికారులు ఇప్పటికైనా బొగ్గు లారీలపై చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా రు.

# సమస్యలతో.. సర్పంచ్ లకు స్వాగతం

- మొదటి పేజీ తరువాయి



గత సర్పంచులు పాలక మండలి సభ్యులు పదవీకాలం ముగిసిన తర్వాత, దీర్ఘకాలికంగా గ్రామాలలో పరిపాలన లేక అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించడం, డ్రైనేజీ కాలువలలో కూడికలు తీయించడం , పారిశుధ్య పనులను చేయించడం , విద్యుదీకరణ పనులు, స్వచ్ఛమైన త్రాగు నీటి సౌకర్యం గ్రామాలలో ప్రజలందరికీ కల్పించడం, రైతులకు పంటలు పండించేందుకు సాగునీరు అందించడం, యువతకు, నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాలను అందించడం, కొన్ని గ్రామాలలో సరియైన రోడ్లు వసతి లేకపోవడం,గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడం, బస్ షెల్టర్ నిర్మించడం, విద్య, వైద్యం, గృహం వసతి పేదలందరికీ అందుబాటులోకి తీసుకురావడం, కొన్ని గ్రామాలలో కోతుల బెడద వంటి సమస్యలు సర్పంచులకు దర్శనమిస్తున్నాయి. కొత్తగా పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచులు పాలక మండల సభ్యులు స్థానిక రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామ ప్రజలందరినీ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ గ్రామాల ప్రజలు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ తమ పదవీకాలంలో గ్రామాలు రూపురేఖలు , మార్చాలని గ్రామ ప్రజలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకుపోవాలని వారిని మనస్ఫూర్తిగా అభినందించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షిద్దాం.

# మార్పు మంచిదేనా...

- మొదటి పేజీ తరువాయి



పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి రాజభోగాలు అనుభవించిన కవిత.. అధికారం పోగానే చాలా మారిపోయారు. పదేళ్లు కవిత ఒంటిపై ఆకర్షణీయంగా మెరిసే దుస్తులు, ఆభరణాలు మాత్రమే కనిపించేవి. మ్యాచింగ్ డ్రెస్సులు, ఆభరణాలు ఉండేవి. ఇది కుటుంబ దోపిడీకి నిదర్శనంగా ప్రజల్లో ముద్ర పడిందిపదేళ్లు అలకరణలు, లగ్జరీ కార్లు, బంగ్లాలతో దొరసానిలా కనిపించిన కవిత ఇప్పుడు చేనేత దుస్తులు ధరిస్తున్నారు. చేతులకు మట్టి గాజులు వేసుకుంటున్నారు. గ్రామీణ సంస్కృతి ప్రతిబింబించే ఆభరణాలు ధరిస్తున్నారు. ఒక చానల్ ఇంటర్వ్యూలో చెప్పిన రూ.25 లక్షల వాచ్ ప్రజల దృష్టిలో బలంగా నాటుకుపోయింది. బీఆర్ఎస్ నుంచి బయటపడిన ఆమె ఇప్పుడు తెలంగాణ జాగృతి అభియానంతో ప్రజల్లోకి దూకారు. అయితే, ప్రజలు ఆమెను మాజీ ముఖ్యమంత్రి కుమార్తె, ఆల్కహాల్ కేసుల్లో పేర్కొన్న వ్యక్తిగా, కుటుంబ దోపిడీగా చూస్తున్నారు.తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత దుస్తులు, జుట్టు శైలిని పోలిన మార్పు కవితలో కనిపిస్తోందని విమర్శకులు చెబుతున్నారు. జయలలిత విడిపోయాక ఆమె బంధువులు కూడా ఇదే శైలి ప్రయత్నించి విఫలమయ్యారు. ప్రజలు ఆమెను పట్టించుకోలేదు. తాజాగా కవిత పరిస్థితి కూడా జయలలిత కోడలు పరిస్థితే అవుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పుడు కవిత డ్రెస్సింగ్ స్టైల్, హెయిర్ స్టైల్‌లో మార్పు జనాల మధ్యలో ఏడుపు ఇవన్నీ ప్రజలు ఎలా స్వీకరిస్తారో.. అధికారంలో ఉన్న పదేళ్లు కట్టిన చీర కట్టని కవిత చేనేత రంగాన్ని ప్రోత్సహించని కవిత అధికారం పోగానే ఇప్పుడు చేనేత మంత్రం వల్లిస్తున్నారు. ఇదంతా ప్రజలను మళ్లీ మోసం చేయడానికే అని, అధికార దాహంతోనే అని పేర్కొంటున్నారు.

# 24న గద్దెల ప్రతిష్టాపన...

- మొదటి పేజీ తరువాయి

పనులను ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది.. ఆలయ విస్తరణ పనులను ముమ్మరంగా చేపడుతోంది. గద్దల ముందు రాతి స్తంభాలతో ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేశారు.. ఇందుకోసం ఎనిమిది భారీ స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రతి రాతి స్తంభం మీద ఆదివాసీల చరిత్రను తెలిపే విధంగా బొమ్మలను రూపొందించారు. ప్రస్తుతం ఒకే వరుసలో గద్దెల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.. మరి కొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తికా బోతున్నాయి.. ఈనెల 24న పూజారుడు గోవిందరాజులు, పగిడిద్దరాజుల గద్దెలను ప్రతిష్టాపన చేస్తానని తెలుస్తోంది.మేడారం ఆలయ అభివృద్ధి పనులను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ పనులకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చి శంకుస్థాపన చేశారు. దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక శాసనసభ సభ్యురాలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఎప్పటికప్పుడు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూస్తున్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి శిల్పులు, కార్మికులు, ఇంజనీర్లు శ్రమిస్తున్నారు. తద్వారా మేడారానికి సరికొత్త రూపు వచ్చే విధంగా చమటోడ్చుతున్నారు.మేడారం.. ఆదివాసీలకు ఇలవేల్పు అయిన సమ్మక్క సారలమ్మకు ప్రధాన ఆలయం. ఇది ఆసియాలోనే గిరిజనులు జరుపుకునే అతిపెద్ద జాతర. ఈ జాతరకు లక్షలలో భక్తులు వస్తారని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పిస్తోంది. వందల సంఖ్యల పోలీసులను.. అంతే స్థాయిలో ఆర్టీసీ బస్సులను.. ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సిబ్బందిని భక్తుల సేవలో తరించడానికి సర్కార్ నియమించనుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మేడారం జాతర వస్తుంది. అయితే ఇప్పుడు సోషల్ మీడియా వినియోగం.. మీడియా విస్తృతి పెరిగిన తర్వాత మేడారం జాతర ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉందని ఇక్కడి భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రెండేళ్లలోనే తెలంగాణ రాష్ట్రానికి కొత్త దిశ

- మొదటి పేజీ తరువాయి

శాఖ, మీడియా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని మీడియా అకాడమీలో జిల్లా ప్రజా సంబంధాల అధికారులతో శుక్రవారం నిర్వహించిన పునశ్చరణ తరగతులకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మేం అధికారం చేపట్టినప్పుడు తెలంగాణ అన్ని రంగాల్లో తీవ్రమైన సంక్షోభంలో ఉంది. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆ సంక్షోభం నుంచి బయటపడి, అభివృద్ధి?సంక్షేమాలను పరుగులు పెట్టిస్తున్నాం" అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదవాడికి అండగా నిలిచామని తెలిపారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వంటి ప్రతి రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెడుతున్నాయని అన్నారు. అయితే, ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో ప్రజల్లోకి చేరడం లేదని అన్నారు. ప్రజలకూ ప్రభుత్వానికీ వారధిగా ఉండాల్సిన ప్రజా సంబంధాల అధికారుల పాత్ర మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుత మీడియా మార్పులకు అనుగుణంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియా సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వేగంగా విస్తరిస్తున్న సోషల్ మీడియాను ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి శక్తివంతమైన సాధనంగా వినియోగించాలని అన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి విజయవంతంగా అమలవుతున్న ప్రభుత్వ పథకాలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటిని ప్రజలకు చేరేలా సృజనాత్మక ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు సమర్థవంతమైన డీపీఆర్‌వోల ను నియమించాలని, ఇతర విభాగాలలో ఉన్నవారి డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సమాచార శాఖ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు.

వార్తాతరంగాలు
శనివారం 20 డిసెంబర్ 2025

# నీట్-పీజీ 2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ను విడుదల...




దేశవ్యాప్తంగా నీట్ పీజీ–2025 అడ్మిషన్లకు సంబంధించిన ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ), స్టేట్ కోటా కౌన్సెలింగ్ షెడ్యూల్ను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) విడుదల చేసింది. ఈ షెడ్యూల్ను అన్ని రాష్ట్ర వైద్య విద్య శాఖలు, కౌన్సెలింగ్ సంస్థలు, మెడికల్ కాలేజీలు తప్పనిసరిగా పాటించాలని ఎన్ఎంసీ ఆదేశించింది. మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎంసీసీ) విడుదల చేసిన షెడ్యూల్ను ఏ రాష్ట్రం కూడా మార్చకూడదని కోరింది. అలా చేస్తే ఏఐక్యూ–స్టేట్ కౌన్సెలింగ్ల మధ్య సమన్వయ లోపం వల్ల విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉన్నట్లు ఎన్ఎంసీ స్పష్టం చేసింది. కాగా... తెలంగాణలో నీట్–పీజీ కౌన్సిలింగ్ ప్రక్రియ ఆలస్యం అయిన నేపథ్యంలో ఫేజ్–1 కౌన్సెలింగ్లో సీట్లు పొందిన అభ్యర్థులకు రిపోర్టింగ్ గడువును కాళోజీ యూనివర్సిటీ పొడిగించిన సంగతి తెలిసిందే. చివరి తేదీని ఈ నెల 18 నుంచి ఈ నెల 21 వరకు పొడిగిస్తున్నట్లు కేఎన్ఆర్యూహెచ్ఎస్ స్పష్టం చేసింది.అన్ని సెలవులు కూడా వర్కింగ్ డేస్గానే : కౌన్సెలింగ్ సమయం తక్కువగా ఉన్నందున శనివారాలు, ఆదివారాలు, గెజిటెడ్ సెలవులు కూడా వర్కింగ్ డేస్గా పరిగణించి కౌన్సెలింగ్ పనులు కొనసాగించాలని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. రాష్ట్రాలు– ఎంసీసీతో డేటా పంచుకోవాలని ఎన్ఎంసీ సూచించింది. ఏఐక్యూ, స్టేట్ కౌన్సెలింగ్లలో ఒకే సీటుపై డబుల్ అలాట్మెంట్ కాకుండా ఉండేందుకు, రాష్ట్రాల డీఎంఈలు జాయిన్ అయిన విద్యార్థుల డేటాను ఎంసీసీకి రౌండ్ల వారీగా సమర్పించాలని ఎన్ఎంసీ కోరింది. సంబంధిత కాలేజీలు, అధికారులు, విద్యార్థులు ఈ షెడ్యూల్ను కచ్చితంగా పాటించాలని సూచించింది.

**ఎన్ఎంసీ విడుదల చేసిన కౌన్సెలింగ్ కీలక తేదీలు:**

1 వ దశ కౌన్సెలింగ్: అక్టోబర్ 17– నవంబర్ 22, 2025
1వ దశ జాయినింగ్ చివరి తేదీ: డిసెంబర్ 1, 2025
2వ రౌండ్ కౌన్సెలింగ్: డిసెంబర్ 5– డిసెంబర్ 12, 2025
3వ రౌండ్: డిసెంబర్ 26, 2025 – జనవరి 2, 2026
స్ట్రే వెకెన్సీ రౌండ్: జనవరి 15 – జనవరి 21, 2026
అన్ని రౌండ్ల జాయినింగ్ చివరి తేదీ: జనవరి 31, 2026
డిసెంబర్ 22, 2025 నుంచి అకాడెమిక్ సెషన్ ప్రారంభం

# పొలిటికల్ లీడర్స్ ను లైట్ గా తీసుకున్న మెస్సీ...



**న్యూఢిల్లీ, డిసెంబర్ 19:**మనదేశంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఏదైనా చేయగలరు. ఎవరినైనా తమ వద్దకు తీసుకు రాగలరు. వారితో ఎలాంటి పనైనా చేయగలరు. చేయించగలరు. ముకేశ్ అంబానీ తన కుమారుడి పెళ్లి కోసం హాలీవుడ్ సింగర్లను సైతం ముంబై తీసుకొచ్చారు. వారితో పాటలు పాడించారు. డాన్సులు కూడా వేయించారు. ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి మన దేశంలో చాలా జరిగాయి.. జరుగుతూనే ఉన్నాయి.గోట్ టూర్ ఆఫ్ ఇండియా లో భాగంగా అర్జెంటీనా ఫుట్బాల్ ఆటగాడు మెస్సి మనదేశంలోకి వచ్చాడు. కోల్ కతా, హైదరాబాద్, ముంబై నగరాలలో పర్యటించాడు. కోల్ కతా ప్రాంతంలో నిర్వహించిన మెస్సి టూర్ నవ్వుల పాలైంది.. సరైన నిర్వహణ ఏర్పాట్లు లేకపోవడంతో ప్రేక్షకులు మైదానంలో బీభత్సం సృష్టించారు. మెస్సి ని చూడలేకపోయామనే బాధతో రణరంగం సృష్టించారు.వాస్తవానికి కోల్కతా ఘటనను దృష్టిలో పెట్టుకున్న హైదరాబాద్ పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా మెస్సి టూర్ సాగే విధంగా భద్రత కల్పించారు. మెస్సీ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా ఫుట్బాల్ ఆడారు. ఆయనను సత్కరించారు. తన మనవడితో ఫోటోలు కూడా దిగే అవకాశాన్ని పొందారు. హైదరాబాద్ మాత్రమే కాదు ముంబై నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో కూడా మెస్సి తో ఫోటోలు దిగడానికి రాజకీయ నాయకులు పోటీపడ్డారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మెస్సి రాకను చూసి పరవశించిపోయారు.గోట్ టూర్ ఆఫ్ ఇండియాలో మెస్సీ అనేక రకాలుగా సందడి చేశాడు. ఫుట్బాల్ ఆడాడు. అయితే అతడు భారతదేశంలో పర్యటించిన దృశ్యాలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నాడు ఈ అర్జెంటీనా ఆటగాడు. ఈ వీడియోలో రేవంత్ రెడ్డి లేడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అంతకంటే లేడు. ఆ వీడియోలో కొంతమంది చిన్నారులు ఉన్నారు. ఆ చిన్నారుల తర్వాత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ ఉన్నాడు. ముంబైలో పర్యటించినప్పుడు సచిన్ టెండూల్కర్ ద్వారా ఒక జెర్సీని మెస్సి పొందాడు. సచిన్ తో కొంతసేపు మాట్లాడాడు. అతడితో అనేక విషయాలను పంచుకున్నాడు..వాస్తవానికి మెస్సీ టూర్ కోసం రాజకీయ నాయకులు ఎంతో గొప్పగా ఏర్పాట్లు చేశారు. పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్పాన్సర్లను వెతికి మరి రకరకాల ప్రయత్నాలు చేశారు. విపక్షాల నుంచి మాటల దాడి ఎదురైనప్పటికీ పకడ్బందీగా తిప్పి కొట్టారు.. కానీ మెస్సీ మాత్రం రాజకీయ నాయకులను ఏమాత్రం పట్టించుకోలేదు. ఆ సందర్భంలో పలకరించాడు అంతే. తనకు తప్పదు కాబట్టి కొద్దిసేపు మైదానం నటించాడు. కానీ అతని మనసులో ఉన్నది ముమ్మాటికి క్రీడా స్ఫూర్తి. అందువల్లే సచిన్ ఉన్న దృశ్యాలకు సంబంధించిన వీడియో మాత్రమే అతడు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు.. డబ్బున్న శ్రీమంతుడు గుర్తుపెట్టుకోవాల్సింది ఒకటే.. వారు తాత్కాలిక ఆధిపత్యాన్ని మాత్రమే సాధించగలరు.. డబ్బులు వెదజల్లి కొంతసేపు ఆ సౌఖ్యాన్ని అనుభవించగలరు. కానీ నిజమైన స్ఫూర్తిని ఎప్పటికీ కొనుగోలు చేయలేరని మెస్సి ఈ వీడియో ద్వారా నిరూపించాడు.

## సీఎంను కలిసిన ఆటా ప్రతినిధులు

**19వ మహాసభలకు సీఎంను ఆహ్వానించిన ఆటా ప్రతినిధులు**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అమెరికా తెలుగు అసోసియేషన్(ఆటా) ప్రెసిడెంట్ జయంత్ చల్లా, ఎలెక్ట్ ప్రెసిడెంట్ సతీష్ రామసహాయం రెడ్డి, ఇతర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వచ్చే ఏడాది జూలై 31న జరగనున్న 19వ ఆటా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎం తో అమెరికాలో ఉన్న తెలుగు ప్రవాసుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఆటా మహాసభలకు రావాలని కోరారు. అలాగే 19వ మహాసభల లక్ష్యాలు, కార్యక్రమాల రూపురేఖలను ముఖ్యమంత్రికి వివరించారు. యువత భాగస్వామ్యం, వ్యాపార అవకాశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణలుగా ఉంటాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆటా ప్రతినిధులతో మాట్లాడుతూ, తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఆటా కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ప్రవాస భారతీయులు, ముఖ్యంగా తెలుగు వాసులు రాష్ట్ర అభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. విద్య, ఐటీ, పెట్టుబడులు, సాంస్కృతిక మార్పిడిలో ఆటా వేదికగా నిలుస్తోందని అన్నారు. అలాగే ఈ మహాసభలు తెలుగు ఐక్యతను ప్రపంచస్థాయిలో చాటేలా నిర్వహించేందుకు తమ సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బోర్డ్ ఆఫ్ ట్రస్టీ, కో–చైర్ నరసింహ ద్యాసాని, సాయి సుధిని, ట్రెజరర్ శ్రీకాంత్ గుడిపాటి, ఇతర ప్రతినిధులు శ్రీధర్ బాణాల, కాశీ కొత్త, రామకృష్ణ అలా, సుధీర్ దామిడి, శ్రీధర్ తిరిపతి, పరమేష్ భీంరెడ్డి, రాజు కక్కెర్ల, రఘువీర్ మర్రిపెద్ది, వినోద్ కోడూరు, కిషోర్ గూడూరు, నర్సిరెడ్డి గడ్డికోపుల, విష్ణు మాధవరం, హరీష్ బత్తిని, సుమ ముప్పాల, వేణు నక్షత్రం, లక్ష్ చేపూరి, అనంత్ పజ్జూర్, అరవింద్ ముప్పిడి, తిరుమల్ మునుకుంట్ల, మీడియా సలహాదారు ఈశ్వర్ బండా తదితరులు వున్నారు.

## ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా.. చెక్ పెట్టిన పోలీసులు



**హైదరాబాద్, డిసెంబర్:**రాష్ట్రంలో గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయిని అమ్ముతున్నా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట గంజాయి సరఫరా జరుగుతూ పట్టుబడటం పోలీసులకు సవాల్‌గా మారింది. తాజాగా రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు.. గంజాయి సరఫరా చేస్తున్న సోహెల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి 17 కేజీల గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి తెచ్చి ఐటీ ఉద్యోగులకు నిందితుడు సోహెల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. సోహెల్‌తో పాటు గంజాయి వినియోగించిన ఐదు మంది కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పబ్లిక్ సర్వీస్ కమిషన్ల అంశంలో అంబేద్కర్‌ది కీలకపాత్ర: ద్రౌపది ముర్ము



**హైదరాబాద్, డిసెంబరు19 :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భాగ్యనగరంలో ఇవాళ(శుక్రవారం) పర్యటిస్తున్నారు. పలు కార్యక్రమాల్లో రాష్ట్రపతి పాల్గొంటున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి పర్యటన షెడ్యూల్ బిజీ బిజీగా ఉంది. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు తెలంగాణ మంత్రి సీతక్క. రాష్ట్రపతి నిలయం నుంచి రామోజీ ఫిలిం సిటీకి వెళ్లారు. అక్కడ నిర్వహిస్తున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము, మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ పర్యటనలో ముర్ము వెంట మంత్రి సీతక్క ఉండనున్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్రపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. నియామకాల అంశంలో సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయని తెలిపారు. 1950 తర్వాత **UPSC** , పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఏర్పాటు అయ్యాయని గుర్తుచేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ల అంశంలో అంబేద్కర్ కీలకపాత్ర పోషించారని చెప్పుకొచ్చారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరమని తెలిపారు. నియామకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిన్నారెడ్డిపై ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



**వనపర్తి :** పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆరోపణలు సంచలనంగా మారుతున్నాయి. పార్టీలో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చిన్నారెడ్డి పై కాంగ్రెస్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చిన్నారెడ్డి వెన్నుపోటు రాజకీయాల వల్లే జిల్లాలో పార్టీకి నష్టం జరిగిందని శుక్రవారం మీడియా సమావేశంలో ఆరోపించారు. చిన్నారెడ్డితో పాటు మరికొందరి నాయకులపై ఏఐసీసీ, పీసీసీ , క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన 51 గ్రామపంచాయతీ స్థానాలలో 15 నుంచి 20 స్థానాలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వల్లే గెలుచుకుందని పేర్కొన్నారు. ఈ విషయమై ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని వివరించారు. ఎమ్మెల్యే గా తనపై , నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవిపై కోపం ఉంటే ప్రత్యక్షంగా చూసుకోవాలని పరోక్షంగా చిన్నారెడ్డిని ఉదాహరిస్తూ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులమని చెప్పుకుంటూ పార్టీకి ద్రోహం చేస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు.

## పంచాయతీ ఎన్నికలపై.. రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు



తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి. తాజాగా ఎన్నికల ఫలితాలు, ట్రెండ్స్ పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు నిర్మల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. గత ఎన్నికలతో పోల్చితో ఈసారి బీజేపీ గణనీయమైన పురోగతి సాధించిందని అన్నారు. గతంలో ప్రాతినిధ్యం లేని జిల్లాల్లో కూడా ఈసారి బీజేపీకి మంచి ఓటింగ్ పడింది. కేంద్రం తీసుకువస్తున్న పథకాలు ప్రజల్లోకి వెళుతున్నాయి. ఈ క్రమంలోనే రోజు రోజుకీ బీజేపీపై ప్రజలకు విశ్వాసం పెరిగిపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం నిధులతో జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులను తమ స్వలాభం కోసం ఖర్చు చేయకుండా చూడాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ విజయాల గురించి గొప్పలు చెప్పుకుంటున్నాయి. చాలా చోట్ల అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయని విమర్శించారు. కానీ బీఆర్ఎస్ – కాంగ్రెస్ పార్టీ వేర్వేరు కాదు.. రెండో ఒక్కటే. మహాత్మా గాంధీ అంటే బీజేపీకి ఎంతో గౌరవం, రామరాజ గ్రామస్వరాజ్యం కోసమే ఉపాధి హామీ పథకం పేరు మార్చడం జరిగిందని అన్నారు. ఉపాధి హామీ పథకం ఇంతకు ముందు 100 రోజులు ఉంటే దాన్ని కేంద్ర ప్రభుత్వం 120 రోజులకు పెంచింది.. దీని వల్ల ఎంతో మంది నిరుపేదలకు లాభం చేకూరుతుందని తెలిపారు.

## కొత్తగూడెంలో చాలా కంపేనీలు మూటపడ్డాయి



**కొత్తగూడెం:**జాగృతి నేత కవిత మణుగూరు లో పర్యటించారు. కవిత మాట్లాడుతూ జనంబాటలో భాగంగా 13 జిల్లాల పర్యటన పూర్తి చేసుకున్నాం. కొత్తగూడెం లో రెండు రోజుల పాటు ప్రజల సమస్యలు తెలుసుకోనున్నాం. కొత్తగూడెం లో పుట్టిన వారికి హైదరాబాద్ రావాల్సిన అవసరం లేదని మేము అనుకునే వాళ్లం. అన్ని కంపెనీలు, ఉద్యోగాలు వాళ్లకు ఉంటాయని గతంలో అనుకున్నాం. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. చాలా కంపెనీలు మూత పడ్డాయని అన్నారు.పెద్ద కంపెనీలు కొత్తగా ఉద్యోగులను తీసుకోవటం లేదు. స్థానికులకు అవకాశాలు రావటం లేదు. ఇండస్ట్రీయల్ కారిడార్ లో కొత్త కంపెనీలు రావటం లేదు. కొత్తగూడెంలో ఉన్న 12 లక్షల మంది ప్రజల అభివృద్ధి కోసం మంచి కార్యాచరణ చేపడతాం. అందులో భాగంగానే రెండు రోజులు ప్రజల సమస్యలను తెలుసుకోవటం జరుగుతుంది. హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీలత తో ఇప్పుడు మనం ఉన్నాం. సింగరేణి కార్మికుల సమస్యలపై హెచ్ఎంఎస్, జాగృతి కలిసి పోరాటం చేస్తున్నాయి. హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ను ముట్టడిస్తేనే మెడికల్ బోర్డు పెట్టారు. కానీ ఆ మెడికల్ బోర్డు కార్మికులను మోసం చేసే విధంగా ఉంది. సింగరేణికి పుట్టినిల్లు అయిన కొత్తగూడెంకు రావటం నా అదృష్టం. కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం జాగృతి డెడికేటెడ్ గా పనిచేస్తుందని అన్నారు.

## ఇంత బతుకు బతికి ఏ పార్టీనో చెప్పుకునే దమ్ము లేదు...

**కేటీఆర్ ఫైర్**




**సిరిసిల్ల, డిసెంబర్ 19:** పది మంది ఎమ్మెల్యేలతో ఎన్నికలకు వెళ్లే దమ్ముందా? అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. 66 శాతం జనం నీతోనే ఉంటే.. ఉప ఎన్నికలకు సిద్ధం కావాలని సీఎం రేవంత్‌కు ఆయన స్పష్టం చేశారు. పది మంది ఎమ్మెల్యేలు చెబుతున్నా.. అసెంబ్లీ స్పీకర్‌కు వినపడడం లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిరిసిల్లలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లుగా నూతనంగా ఎన్నికైన వారిని కేటీఆర్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. కడియం శ్రీహరి ఓపెన్‌గా చెప్పినా స్పీకర్‌కు కనపడలేదన్నారు. మాజీ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డిది కూడా ఓ బతుకేనా అంటూ మండిపడ్డారు.స్పీకర్ ముందు ఎమ్మెల్యేలు అబద్ధం చెప్పారని చెప్పారు. స్పీకర్ కూడా అబద్ధాలు చెబుతారా? అంటూ కేటీఆర్ సందేహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, స్పీకర్‌ను చూస్తే జాలేస్తుందంటూ ఆయన వ్యంగ్యంగా అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఆడోళ్లా? మగోళ్లో తెలియడం లేదన్నారు. ఇంత బతుకు బతికి ఏ పార్టీనో చెప్పుకునే దమ్ము లేదంటూ రాజకీయ కండువాలు మార్చిన ఎమ్మెల్యేలపై నిరసన వ్యక్తం చేశారు. పదవి కోసం.. చూరు పట్టుకుని గబ్బిలం లాగా వేలాడినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఇటీవల మూడు దశల్లో పంచాయతీ సర్పంచ్‌ల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలుచుకుంది. ఇక సిరిసిల్ల నియోజకవర్గంలో మొత్తం 117 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. వాటిలో 60 స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంది.

## కృష్ణా జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న వైసీపీ నేత అరెస్టు...

**గుడివాడ:**క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న కొడాలి నాని అనుచరుడు కూనసాని వినోద్ ను పోలీసులు అరెస్టు చేసారు. కూనసాని వినోద్ గుడివాడలో కొంతకాలంగా ఆన్లైన్లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వినోద్ ను గుడివాడ వన్ టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్‌అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.50 వేలు నగదు, సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

# మానవసేవయే మాధవసేవ..

**తన సొంత కర్చులతో గణేష్ భయ్యా అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్న ఆరిఫ్ భాయి..**

**ఆరిఫ్ భాయ్ అందించిన ఈ మానవీయ ఉదాహరణ నేటి సమాజానికి ఒక ప్రేరణ..**

**గంగా జమున తహజీబ్ కు నిదర్శనం**







సికింద్రాబాద్‌లో మానవత్వం సజీవంగా ఉందని నిరూపితమైంది పేద కార్మికుడు గణేష్ భయ్యాకు గౌరవప్రదమైన చివరి అంతిమ క్రియలు లభించాయి వర్ధమాన్ జిల్లా, కమర్ హెడ్ గ్రామానికి చెందిన గణేష్ భయ్యా అనే నిరుపేద కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గణేష్ భయ్యా జీవనోపాధి కోసం సికింద్రాబాద్‌లో కూలీగా పనిచేస్తున్నాడు, ఈ సమయంలో, అతను పక్షవాతంతో తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యాడు దాని కారణంగా అతని పరిస్థితి చాలా విషమంగా మారింది అతని కుటుంబం స్థానిక ఆసుపత్రిలో చికిత్స కోసం భర్తీ చేయగా, కుటుంబ ఆర్థిక పరిస్థితి చాలా దయనీయ స్థితిలో ఉండి మెరుగైన వైద్యం చేయడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో వైద్యులు చేతులెత్తేశారు, మెరుగైన చికిత్స కోసం ఏర్పాట్లు చేయలేక పోవడంతో చికిత్స పొందుతూ బీద కార్మికుడు గణేష్ భయ్యా మరణించాడు అతని కుటుంబం వారి సొంత గ్రామానికి అంబులెన్స్ లో మృతదేహం తీసుకొని వెళ్ళడానికి అంబులెన్స్ ఖర్చులు కట్టలేని అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆ కుటుంబానికి ఒక ముస్లిం వ్యక్తి కిషన్ బాగ్ కు చెందిన మొహమ్మద్ ఆరిఫ్ భాయ్ నేనున్నానని బాధితుడి కుటుంబానికి సహాయం చేయడానికి ఆపన్న హస్తముతో ముందుకు వచ్చారు తన వ్యక్తిగత ఖర్చుతో గణేష్ భయ్యా అంత్యక్రియలు హిందూ ఆచార సంప్రదాయాలతో గౌరవప్రదంగా నిర్వహించి మానవత్వం, సోదరభావానికి ఉదాహరణగా నిలిచాడు. గణేష్ భయ్యా కుమార్తె మీరా భయ్యా తన తండ్రిని దహన సంస్కారం చేసేటప్పుడు భావోద్వేగ దృశ్యం కనిపించింది ఈ సమయంలో ఆరిఫ్ భయ్యా అంత్యక్రియలు పూర్తయ్యే వరకు బాధిత కుటుంబానికి అండగా నిలిచాడు అన్ని విధాలుగా సహాయం చేసాడు ఈ మానవతా పని అభినందనీయమని స్థానికులు కొనియాడారు, సిస్టమ్ వనరులు మద్దతు ఇవ్వకపోతే మానవత్వం యొక్క సోదరభావం అతిపెద్ద మద్దతు అవుతుంది రుజువైంది, ఆరిఫ్ భాయ్ అందించిన ఈ మానవీయ ఉదాహరణ నేటి సమాజానికి ఒక ప్రేరణ లాంటిదని గంగా – జమున తహజీబ్ కు ఇది నిదర్శనమని ప్రజలు చెప్పుకోవడం విశేషం

# పెండింగ్ లో ఉన్న.. లెప్రసి సర్వే డబ్బులు వెంటనే విడుదలచేయాలి

**ఆసుపత్రులలో ఆశాలకు విశ్రాంతి గదులు నిర్మించాలి డిమాండ్**

**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 17 (స్కై న్యూస్):** ఆశా వర్కర్లకు పెండింగ్ లో ఉన్న లెప్రసి సర్వే డబ్బులు వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఆశాలకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ డిమాండ్ చేశారు.బుధవారం జిల్లా కేంద్రంలోని %ఇవీనూ% కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న లేప్రసి సర్వే డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, %ఇవీనూ% సంధ్యా కిరణ్మయి గారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం లెప్రసీ సర్వే కార్యక్రమం చేపట్టిందని అన్నారు.జోగులాంబ గద్వాల జిల్లాలో కూడా జిల్లాలోని ఆశా కార్యకర్తల చేత 15రోజులపాటు సర్వే చేయించారని తెలిపారు.సర్వే చేసినందుకుగాను ప్రభుత్వం రోజుకు ఒక ఆశా కార్యకర్తకు 70 రూపాయలు చొప్పున చెల్లిస్తామని చెప్పిందని అన్నారు. కానీ సర్వే పూర్తయి సంవత్సరం గడిచినప్పటికీ ఇప్పటివరకు డబ్బులు విడుదల చేయలేదని




అన్నారు.ఈ విధంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని 608 మంది ఆశా కార్యకర్తలకు ఒక్కొక్కరికి రోజుకు 70 రూపాయలు చొప్పున 15 రోజులకు గాను 1050 రూపాయలు పెండింగ్లో ఉన్నాయని అన్నారు.అసలే ఫిక్స్ డ్ వేతనాలు లేక అదనపు పని భారాలతో ఇబ్బంది పడుతున్న ఆశా కార్యకర్తలను, ప్రభుత్వం పని చేయించుకుని పారితోషకాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని అన్నారు. కావున తక్షణమే ఆశా కార్యకర్తలకు పెండింగ్లో ఉన్న లెప్రసి సర్వే నగదును వెంటనే వారికి ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లావ్యాప్తంగా ఉన్న ఆశా కార్యకర్తలు గర్భిణీ స్త్రీలను డెలివరీ కేసులు తీసుకొచ్చిన సందర్భంగా ఆశా కార్యకర్తలకు ప్రత్యేకంగా విశ్రాంతి గదులు కేటాయించలేదని తెలిపారు.విశ్రాంతి గదులు లేకపోవడం కొన్ని సందర్భాలలో డెలివరీల కోసం వచ్చిన ఆశా కార్యకర్తలు రెండు నుండి మూడు రోజుల వరకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఉండవలసి వస్తుందని, ఆ సందర్భంగా ఆశా కార్యకర్తలు వసతి కోసం తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశాలకు ప్రత్యేక విశ్రాంతి గదిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వాలంటరీ అండ్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ (సిఐటీయు అనుబంధం) జిల్లా అధ్యక్షురాలు పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు కాంతమ్మ,పద్మ పాల్గొన్నారు.

## సాసనూల్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా...



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 19(స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ తాలూకా ఎర్రవల్లి మండలం సాసనూల్ గ్రామ సర్పంచ్ గా ఎంపికైన రేణుక బిసన్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సహాయ సహకారాలతో గ్రామాభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రేణుక భర్త బిసన్న సర్పంచ్ మెజార్టీ 115 ఓట్లతో గెలవడం జరిగింది. సర్పంచ్ గా గెలిచిన సందర్భంగా శాంతినగర్ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ నందు అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే వారికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియపరిచారు.

## ఆమనగల్ మున్సిపల్ లో కొనసాగుతున్న ఇందిరమ్మండ్ల పంపిణీ కార్యక్రమం



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 19:-** రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో 15వ,5 వ వార్డు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ పత్రాలను 15 వార్డులో ఇద్దరు లబ్ధిదారులకు పసునూరి అలివేలు భర్త పసునూరి వెంకటాచారి ఓర్సు నరసమ్మ భర్త ఓర్సు లక్ష్మయ్య లకు అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అవ్వారి శివలింగం ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎండి గౌస్ పులి కంటి మైసయ్య మాజీ వార్డు మెంబర్ మల్లేష్ నాయక్ రేవంత్ మిత్రమండలి రాష్ట్ర నాయకులు గుండ్రాతి కుమార్ గౌడ్ పసునూరి శివాచారి నరేష్ 15వ వార్డు ఇంచార్జ్ సుభాష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# వైభవంగా ధనుర్మాస ప్రత్యేక పూజలు





**నాగర్ కర్నూల్ డిసెంబర్ 19( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో గల శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో ధనుర్మాసం పురస్కరించుకొని గత నాలుగు రోజులుగా ప్రతిరోజు విశేషంగా శాస్త్రోక్తంగా గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు ,తిరుప్పావై సేవా కాలం, పాశుర పఠనం, మహా మంగళహారతి, వివిధ నక్షత్ర హారతులు, కుంకుమార్చన,పుష్పార్చన వేదమూర్తులైన బ్రాహ్మణులచే నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు మాడభూషి అజయ్ కుమార్ శర్మ తెలిపారు. ఈనెల 30న ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం, వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజలు, జనవరి 11న కుడారై ప్రసాద ఉత్సవం, జనవరి 13న మంగళవారం నాడు గోదాదేవి కళ్యాణోత్సవం జనవరి 14న ధనుర్మాస పూజలు ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ ప్రత్యేక పూజలు భక్తులు పాల్గొని,అమ్మవారి కృప పొందాలన్నారు.ఈదనుర్మాస వ్రతం ఎంతో పుణ్యఫలితం ఉంటుందని అన్నారు. ప్రత్యేక పూజలు పాల్గొన్న భక్తులకు ప్రత్యేకంగా అమ్మవారి కుంకుమ, పుష్పాలు, తీర్థప్రసాదాలు వేద ఆశీర్వచనం అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రాంత భక్తులు ధనుర్మాస వ్రత అవకాశాన్ని అధిక సంఖ్యలో వినియోగించు కోవాలని ఆయన కోరారు. వివరాలకు 9441740951లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయి కీర్తన భక్తులు మహిళలు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చేనేత రుణమాఫీ ప్రక్రియ వేగవంతం చేయాలి

**మేడం రామకృష్ణ తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 19(స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలో చేనేత కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశం లో మ్యాడం రామకృష్ణ గారు మాట్లాడుతూ గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ప్రకటించిన చేనేత రుణమాఫీ నీ తక్షణమే చేయాలని అట్టి ప్రక్రియకు సంబంధించిన పనులు వేగవంతం చేసి తక్షణమే చేనేత రుణమాఫీ అయ్యేటట్లు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ డిమాండ్ చేయడం జరిగింది చేనేత కార్మికులకు రుణమాఫీ ప్రకటించి ఏడాదిన్నర గడుస్తున్న ఇప్పటివరకు రుణమాఫీ ప్రక్రియ నత్తనడక నడవడం చాలా బాధాకరమని చేనేత కార్మికులకు బ్యాంకు అధికారుల నుండి రుణ వసూళ్ల కొరకు చాలా ఒత్తిడి చేస్తూన సందర్భంగా చేనేత కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని కాబట్టి చేనేత జౌళి శాఖ అధికారులు తక్షణమే ఈ యొక్క రుణమాఫీ ప్రక్రియ వేగవంతం చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని అన్నారు అదే విధంగా గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేతన్న భరోసా సంక్షేమ పథకం కూడా తక్షణమే కార్మికుల కు లబ్ధి చేకూరే విధంగా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి కార్మికులని ఆర్థికంగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా చేనేత త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన అమౌంట్ కూడా ప్రతి నెల నెల వచ్చే విధంగా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు ఇట్టి కార్యక్రమంలో జడ్పీ మాజీ కో ఆప్షన్ నెంబర్ ఎండి నిషాక్ చేనేత కార్మిక సంఘం నాయకులు పోతు వీరేష్ వీరన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## దురహంకార నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి...



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 19( స్కై న్యూస్)** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మారుస్తూ జిరాంజీ పేరు పెట్టడం దారుణమని వెంటనే దూరహంకార నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని యధావిధిగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి పొదిల రామయ్య డిమాండ్ చేశారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హక్కును కాలరాసే విధంగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పార్లమెంటులో ఏకపక్షంగా బిల్లు తీసుకురావడం దౌర్భాగ్యకరమని మండిపడ్డారు. ఏకపక్ష నిర్ణయం తీసుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు వలసలను నివారించేందుకు గ్రామీణ ప్రాంతాలలోనే కూలీలకు పని కల్పించేందుకు20 25 లో కమ్యూనిస్టుల పోరాటంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని చట్టబద్ధమైన ఉపాధి హక్కు పని అడిగితే పని ఇవ్వవలసిందే బాధ్యతను ప్రభుత్వంపై ఉందన్నారు. పార్లమెంటులో ఎలాంటి చర్చ లేకుండా సాంప్రదాయాలకు భిన్నంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు మహాత్మా గాంధీని చంపిన గాడ్సే వారసులు మహాత్మా గాంధీ పేరును తొలగించారని ఆయన ఆరోపించారు. పేరు మార్చడం కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ రోజువారి వేతనాన్ని 600 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మధు నాయకులు వెంకటేష్ మల్లికార్జున్ బంగారయ్య ఖజా నరసింహ యాదయ్య లక్ష్మయ్య కృష్ణయ్య బాలస్వామి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## ఉమ్మడి జిల్లా టోర్నీకి క్రికెట్ జట్టు ఎంపిక



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 19( స్కై న్యూస్):** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట కోసం క్రికెట్ క్రీడాకారులను ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్ సీ ఏ) మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా జట్టు ఎంపిక ను గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డున గల క్రికెట్ మైదానంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 4 లీగ్ మ్యాచ్ చొప్పున నిర్వహించి ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. జిల్లాస్థాయి క్రీడా పోటీలకు 16 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఏం రామ్ చరణ్, యన్,గగన్, జే,జస్వంత్,వివేక్, అర్షద్ అహ్మద్, ఎన్ సాత్విక్ రెడ్డి, ఎం క్యాతేశ్వర్, పి, సుబ్రత్ కౌశిక్, ఆర్ చరణ్,మహమ్మద్ ముజ్తబా, పి అభిరామ్, అంజి, ఎన్,జస్వంత్, మహమ్మద్ షాహిద్ ఆఫ్రిది, బి సంజయ్, శామ్యూల్ జోసెఫ్ లు ఎంపికయ్యారు. ఈ సెలక్షన్ ప్రక్రియలో మహమ్మద్ మన్నాన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 19 (స్కై న్యూస్):** పేద ప్రజలకు అండగా రాజ్ కుమార్ ఫౌండేషన్ నిలుస్తున్నదని కర్నూల్ పోలీసు బెటాలియన్ స్పెషల్ డిఎస్పి మహబూబ్ బాషా తెలిపారు.జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో రాజ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజ్ కుమార్ జన్మదిన సందర్భంగా కంప్యూటర్తో ఉచిత కంటి వైద్య పరీక్షలు శిబిరానికి ముఖ్యఅతిథిగా డి.ఎస్.పి పాల్గొని ప్రారంభించారు. రాజ్ కుమార్ ఫౌండేషన్ పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నదని ప్రశంసించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు రత్నకుమారి మాట్లాడుతూ తెలిపారు. తమ తమ్ముడు రాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా దాతల సహాయ సహకారాలతో కంప్యూటర్తో రుచిత కంటి పరీక్షలు నిర్వహించి 20 మందికి కంటి అద్దాలు అందజేయడం జరిగిందన్నారు. అలాగే జంతువులు ఒంటరి మహిళలకు 40 మందికి, ఇద్దరు పాస్టర్లకు దుస్తులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న 120 మందికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగస్వామి నాయక్, ఐ స్పెషలిస్ట్ జయప్రకాష్, కర్నూల్ లైన్స్ క్లబ్ చైర్మన్ రాయపాటి శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు ఆధునిక ల్యాబ్ సేవల సౌకర్యానికి కృషి...

**అత్యవసర ఆధునిక బెడ్ల సౌకర్యాన్ని పెంచుతాం**

**ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్**



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 19( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రస్తుత జనాభాకు అనుగుణంగా, అవసరమైన ఆధునిక ల్యాబ్ సేవల సౌకర్యం, రోగులకు మెరుగైన చికిత్సకు ఆధునిక అత్యవసర బెడ్ ల సంఖ్యను పెంచుటకు నిర్ణయించామని ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. శుక్రవారం నాడు బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పాతలజీ డిపార్ట్మెంట్ విభాగాది పతులతో అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగినది, ఈఆసుపత్రి లో వున్న ల్యాబ్ సౌకర్యాలు సేవలు ప్రస్తుత పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి అన్నింటిని ఒకేచోటికి మార్చి అదునీకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు.అదేవిదంగా ఐ. సి. యూ బెడ్స్ కూడ పెంచాలని, వాటిని ఆదునీకరించాలని పై విషయాలపై ఒక సమగ్ర నివేదిక తయారు చేసి త్వరలో స్థానిక ప్రజా ప్రతినిధులను,గౌరవ శాసన సభ్యులను మరియు గౌరవ జిల్లా కలెక్టర్ గారిని కలిసి వివరించాలని నిర్ణయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఫైహేదా,డాక్టర్ శిరీష, డాక్టర్ గణేశ్, డాక్టర్ శ్రీకాంత్,సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్ ,ఆర్ఎంఓ డాక్టర్ రోహిత్,వైద్యులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారనే సత్వర న్యాయం జరుగుతుంది జిల్లా ఎస్పీ: డాక్టర్ వినీత్

**జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి**

**కొట్టుకుంటే ఒకరే గెలుస్తారు, రాజీ పడితే ఇద్దరూ గెలుస్తారు**

**రాజీ మార్గమే - రాజ మార్గం**



నారాయణపేట డిసెంబర్ 19 (స్కైన్యూస్) వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయి ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే అప్పుడే సమసిపోతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ -21వ తేది వరకు కోస్గి కోర్టు, నారాయణపేట జిల్లా కోర్టులలో "జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా కక్షిదారులకు పోలీసులు అందుబాటులో ఉంటారని ఈ నెల 21వ తేదీ ఆదివారం రోజు జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, చిన్న చిన్న దొంగతనాల కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో మరియు ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని, న్యాయస్థానం ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

# దేవుని ఆత్మతో సత్యముతో ఆరాధించుడి: రెవ చార్లెస్





దేవరకద్ర, మక్తల్ డిసెంబర్ 19 (స్కై న్యూస్): సెమీ క్రిస్టమస్ వేడుకలలో శుక్రవారం గద్వాల మిస్ప పాస్టర్ రేవ చార్లెస్ బైబిల్ లోని సూక్తులను వివరిస్తూ శాంతి ప్రేమ కరుణ త్యాగం వంటి మానవీయ విలువకులకు ప్రతీక అని అన్నారు. మక్తల్ మండల కేంద్రంలోని ఎంబి షారోన్ చర్చ్ పాస్టర్ రేవ ఈ, బేబీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని 150 మంది పాస్టర్ పాస్టర్ అమ్మలకు దుస్తుల పంపిణీ చేసి, శాల్వాలతో ఘనంగా సన్మానించి, పార్శికోత్సవం అందజేశారు. అంతకుముందు వివిధ సంఘ దైవజనుల తో పాటు స్తుతి కీర్తనలు పాడారు. పాస్టర్స్ రేవ, ఎస్ బి,జోసఫ్, రేవ, జాన్సన్ , ఈ బేబీప్రసాద్, చార్లెస్ క్రిస్టమస్ కేక్ ని కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రిస్టమస్ పండుగ ప్రపంచ యావత్తు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. షమీ క్రిస్టమస్ వేడుకలలో పాల్గొన్న వారందరికీ మధ్యాహ్నం విందును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల చైర్మన్లు, కార్యదర్శులు, కోశాధికారులు సంఘస్తులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేయాలి...

**ఆదర్శంగా నిలవాలి**



నారాయణపేట డిసెంబర్ 19: (స్కైన్యూస్) పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసి బిజెపి సర్పంచులు అందరికీ ఆదర్శంగా నిలవాలని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ సూచించారు. ఉట్కూర్ మండలం బిజ్వార్ గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన కోల్లంపల్లి అంజయ్యను,వార్డు సభ్యులు చెన్నారెడ్డి, రాఘవేంద్ర, గుడిసె చిన్న రాజు లను సీనియర్ బీజేపీ నాయకులు నాగు రావు నామాజీ ,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాగురావు నామాజీమాట్లాడుతుఅం7దరూ కలిసి పని చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల నుంచి నిధులు తీసు కొని వచ్చి బిజ్వార్ ను అభి వృద్ధి చేయాలని అన్నారు. తమ వంతుగా ఈ అభివృద్ధి కోసం పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.బీజేపీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజప్ప,ఆంజనేయులు గౌడ్,హెచ్.నర్సింహా,అశోక్ గౌడ్,తిరుపతి,పత్తి ఆంజనేయులు,వెంకటప్ప,తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేశంపేట నూతన సర్పంచ్ వార్డు సభ్యులకు సన్మానించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 19 :- రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రంలో నుండి నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ బొజ్జల శ్రీశైలం వార్డు సభ్యులను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన కార్యాలయంలో సన్మానించారు ఈ సందర్భంగా కేశంపేట సర్పంచ్ వార్డు సభ్యులు తమ గ్రామ అభివృద్ధి కొరకు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కోరారు ఈ సందర్భంగా ఎమ్మెల్సి నవీన్ రెడ్డి మాట్లాడుతు కేశంపేట గ్రామ అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తానని నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ వార్డు సభ్యులకు భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో పోమాల్ పల్లి సర్పంచ్ భూపాల్ రెడ్డి, వార్డు మెంబెర్స్, మంచు కృష్ణయ్య,దశరథ్,సతీష్,ప్రవీణ్ రెడ్డి,నాగేష్ రామచంద్ర నాగేష్ విజయ్ శీను మహేష్,రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రాయన గూడ పెరి అర్బన్ జోన్ లో ఆర్ఎంసి అక్రమ ప్లాంట్ నిర్మాణం

**పట్టించుకోని అధికారులు**

**జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పొల్యూష్యన్ కంట్రోల్ బోర్డుకు..**

**నందిగామ తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన చల్లా కీర్తి రెడ్డి**

**వ్యవసాయ భూములు, ప్రజల ఆరోగ్యాలనుఅభ్యర్థన కాపాడాలని అభ్యర్థన**







రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 18:- రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలం చాంద్రాయణగుడ గ్రామ శివారులో 'పెరి అర్బన్ జోన్' పరిధిలో నిబంధనలకు వ్యతిరేకంగా ఆర్ఎంసి ప్లాంటును ఏర్పాటు చేస్తుండడం పై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు పట్టణ కేంద్రానికి మరియు గ్రామీణ ప్రాంతాలకు మధ్యలో ఉండే పరివర్తన ప్రాంతంలో ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా నిర్మిస్తున్న ఓ ఆర్ఎంసి ప్లాంట్ నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు పెరి అర్బన్ జోన్ పరిధిలోకి వచ్చే ఇలాంటి ముఖ్యమైన ప్రాంతాల్లో అసలు ఆర్ఎంసి ప్లాంట్ ఎలా ఏర్పాటు చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు చంద్రయన గూడలో చల్లా కీర్తి రెడ్డి శుక్రవారం మీడియా ముందు ఆర్ఎంసి ప్లాంట్ అక్రమ నిర్మాణంపై పలు వివరాలు అందించారు చంద్రాయన గూడ గ్రామ శివారులోని సర్వే నంబర్ 1431/ఎఎ లో సుమారు 6 ఎకరాల 26 గుంటల భూమి వ్యవసాయ క్షేత్రం తమది ఉందని చంద్రాయన గూడ గ్రామానికి ఆనుకొని ఉన్న ఈ క్షేత్రం వెనకాలే పెరి అర్బన్ జోన్ లో గుట్టు చప్పుడు కాకుండా ఆర్ఎంసి ప్లాంటును సుదర్శన్ రెడ్డి సర్వే నంబర్ 1435 అనే వ్యక్తి స్థలం లీజుకు ఇచ్చారని ఇది పూర్తిగా వ్యవసాయ భూములకు ఎంతమాత్రం క్షేమం కాదని తెలిపారు ముఖ్యంగా చాంద్రాయణ గుడా గ్రామంతో పాటు పక్కనే పురవిదా వెంచర్ ఉందని భవిష్యత్తులో ఈ ప్లాంట్ ద్వారా అనేక వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు ఈ ప్లాంట్ ఏర్పాటు అయితే గ్రామ ప్రజలతో పాటు తమ వ్యవసాయ క్షేత్రంలో కూడా పంటలకు విఘాతం కలుగుతుందని, వ్యవసాయ ప్రయోజనాలు దెబ్బతింటాయని అదేవిధంగా దుమ్ము ధూళి వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం జరుగుతుందని బాధితులు పేర్కొంటున్నారు రంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారికి, అదేవిధంగా నందిగామ మండల తహసిల్దార్ కు ఆర్ఎంసి ప్లాంట్ నిలుపుదల కోసం ఈనెల 16వ తేదీన ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగు చూసిందిపెరి అర్బన్ జోన్ లో ఉన్న భూములలో నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఆదేశాలు భేఖాతారు చేస్తూ ఆర్ఎంసి ప్లాంటును అక్రమంగా నిర్మిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని చల్లా కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు ఈ ప్లాంట్ వల్ల భవిష్యత్తులో అనేక వాతావరణ కాలుష్యాలు ఏర్పడి వ్యవసాయ ప్రయోజనాలు దెబ్బ తినడమే కాకుండా దుమ్ము ధూళితో పాటు భూగర్భ జలాలు కూడా దెబ్బతింటాయని ఆమె మీడియా ముందు వాపోయారు అదేవిధంగా ప్రజలు నివసిస్తున్న నివాసాల మధ్య ఇలాంటి ఆర్ఎంసి ప్లాంటులు ఏర్పాటు సురక్షితం కాదని ఆమె తెలిపారు ఈ ప్లాంట్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి ఇక్కడి నుండి ప్లాంటును ఎత్తివేయాలని లేకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు ఈ సందర్భంగా బాధితుల తరపు న్యాయవాది జంగయ్య యాదవ్ మాట్లాడుతూ పెరి అర్బన్ జోన్ లో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్న ఆర్ఎంసి ప్లాంటును వెంటనే ఎత్తివేయాలని లేకపోతే దీనిపై న్యాయపరంగా చట్ట పరంగా చర్యలు వెదురుపాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు కొందరు వ్యక్తులు ఆయన భూమిని ఇతరులకు లీజుగా ఇచ్చారని సదరు భూమిలో అక్రమంగా ఆర్ఎంసి ప్లాంట్ నిర్మాణం అవుతుందని ఇది చట్ట వ్యతిరేకమని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని ఆయన తెలిపారు సంబంధిత అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు పెరి అర్బన్ జోన్ లో చేంజ్ ల్యాండ్ యూస్ (సి.ఎల్.యు) ఉండాలని కానీ ఎలాంటి అనుమతులు పరిమితులు లేకుండానే అక్రమంగా ప్లాంట్ నిర్మిస్తున్నారని ఇది నిషిద్ధమని బాధితుల ఫిర్యాదులు పట్టించుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి వారితో పాటు అధికారులపై కూడా ఉన్నతాధికారుల ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు ఈ విషయాన్ని అధికారులతో పాటు నియోజక వర్గ ప్రజాప్రతినిధి కూడా ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు

# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసిన పుల్చర్ల కుంట తండా సర్పంచ్ విస్లావత్ రాజు నాయక్

రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 19:- రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండల గిరిజన పులిచెర్ల కుంట తాండ గ్రామ పంచాయతీల ఎన్నికల్లో భారీ మెజారిటీతో సర్పంచ్ గా గెలిచిన విస్లావత్ రాజు నాయక్ ఫరూక్ నగర్ మండల పరిధిలోని అన్ని గిరిజన తండాల్లో మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు రాజు నాయక్ సాధించారు పుల్చర్ల తాండ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు పోటీల్లో నిలిచారు ఇందులో తాజా మాజీ సర్పంచ్ ఇండిపెండెంట్ అభ్యర్థి కాంగ్రెస్ నుంచి రాజు నాయక్ పోటీల్లో నిలవగా గ్రామ ప్రజలు విస్లావత్ రాజు నాయక్ కు పట్టం కట్టారు గ్రామంలో మొత్తం 522 ఓట్లు పోలయ్యాయి అందులో మెజార్టీ ఓట్లు రాజు నాయక్ కు 403 పోలయ్యాయి మాజీ సర్పంచ్ కి కేవలం 100 ఓట్లు వచ్చాయి. ఇంకో ఇండిపెండెంట్ అభ్యర్థికి కేవలం 6 ఓట్లు వచ్చాయి ఈ సందర్భంగా సర్పంచ్ వి రాజు నాయక్ మాట్లాడుతూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరన్న అడుగుజాడల్లో నడుస్తూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నూతన సర్పంచ్ రాజు నాయక్ తెలిపారు గెలుపు అనంతరం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు అనంతరం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తదితరుల ఆశీస్సులు తీసుకున్నారు ఈ సందర్భంగా సర్పంచ్ రాజు నాయక్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన ఏ పిలుపునైనా దిగ్విజయం చేసి శంకరన్న చేత శభాష్ అనిపించుకున్నట్లు గుర్తు చేశారు ఇదిలా ఉండగా రాజు శ్రమను గుర్తించి సర్పంచ్ అభ్యర్థిగా ఎమ్మెల్యే అవకాశాన్ని కల్పించారు గ్రామంలో నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలిచారు దీంతో ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో రాజు నాయక్ కు మద్దతు ఇచ్చి సర్పంచ్ గా గెలిపించారు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచిస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



నూతన సర్పంచిని సత్కరించి అభినందించారు రాజు నాయక్ భారీ మెటీతో గెలిపించినందుకు తండా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అక్రమ డబ్బులు వసూళ్ల బాగోతం బట్టబయలు

**సీఎం రిలీఫ్ ఫండ్ కోసం 10000 డిమాండ్ చేసిన చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంత శ్రీదేవి యాదవ్**

**చర్లపల్లి డివిజన్లో 120గజాల గృహ నిర్మాణానికి స్థలానికి 70 వైలు ఇచ్చానని బాధితుడు తెలిపాడు**

**కార్పొరేటర్ అభివృద్ధి పనుల కార్యాచరణ తక్కువ ఫోటోలకు ఫోజులు ఎక్కువ అన్న కుషాయిగూడ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి**

**కార్పొరేటర్ బొంతు శ్రీదేవి వసూళ్లకు ఎక్కువ అభివృద్ధి పనులకు తక్కువ అన్నట్లు వ్యవహరిస్తుందని కుషాయిగూడ వాసుల ఆందోళన**

**డివిజన్లో నిర్మాణాల దగ్గర వసూల్ రాణి గా అవతారం ఎత్తిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 19 :కుషాయిగూడ డివిజన్ ఏర్పాటు కాకుండా చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుట్రలు కుతంత్రాలు చేసిందని కుషాయిగూడ జిహెచ్ఎంసి 16వ డివిజన్ ను కుషాయిగూడ డివిజన్ గా ఏర్పాటు దాదాపు ఖరారైయిందన్న విషయం తెలిసి కుషాయిగూడ కాలనీల ప్రజలు కుషాయిగూడ బస్టాండ్ ప్రాంగణంలో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.జిహెచ్ఎంసి డివిజన్ ల పునర్విభజన ప్రకటన వెలువడిన రోజు నుంచి కుషాయిగూడ కాలనీల కుటుంబాలు చేసిన ఆందోళనతో డివిజన్ ఏర్పాటు దాదాపు ఖరారైన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ దోచుకుంటున్నది చాలదన్నట్టుగా కుషాయిగూడ డివిజన్ ఏర్పాటు కాకుండా చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుట్రలు కుతంత్రాలు చేశారని ఆరోపించారు.డివిజన్ పరిధిలోని కాలనీలలో 80 గజాల స్థలంలో ఇల్లు కట్టుకుంటున్న వదలడం లేదని గుడిలో అర్చకత్వం నిర్వహించే పురోహితులను సైతం వదలకుండా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి లక్షల రూపాయలు కప్పం రూపంలో వసూలు చేశారని గుర్తు చేశారు. లక్ష్మీనరసింహ కాలనీలో ఇల్లు కట్టుకుంటున్న పేద యాదవ కుటుంబం నుంచి కూడా దాదాపు రూ. 70 వేలు వసూలు చేశారన్నారు. వేలాది మంది పేద మధ్యతరగతి వ్యాపారాలు నిర్వహించుకునే కుటుంబాలకు అన్నం పెట్టి అక్కున












చేర్చుకున్న కుషాయిగూడ ప్రాంతం చరిత్రను పదేళ్లుగా రాజకీయం చేస్తూ కార్పొరేటర్ శ్రీదేవి కోట్లాది రూపాయలు దోచుకు తిన్నారని ఆరోపించారు.ఇకనైనా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుట్రలు, కుతంత్రాలు చేయడం మానేయకపోతే రేపటి నుంచి కుషాయిగూడ కాలనీలలో చాయిపే చర్చ కార్యక్రమంతో ముందుకు సాగుతూ ఆమె అవినీతి బండారాన్ని సాక్షాధారాలతో బయటపెడతామన్నారు.చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి మాట్లాడుతూ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఓవైపు కుషాయిగూడ డివిజన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మరోవైపు జనాలను తప్పుదోవ పట్టించేలా కల్లబొల్లి మాటలతో దిగజారుడు ప్రకటనలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలను కోవడం దుర్మార్గమన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, చల్లా ప్రభాకర్, యావపురం విశ్వనాథం, తాళ్ల ఆనంద్ గౌడ్, వెంకటేశ్వర్లు, పంజాల శ్రీనివాస్ గౌడ్ పాండాల శివకుమార్ గౌడ్, చల్లా వెంకటేష్, పిట్టల రాజు, జనార్ధన్, మణికిరణ్, కుషాయిగూడ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నాగార్జున నగర్ అధ్యక్షులు యావపురం రవి, సారా అనిల్ ముదిరాజ్, వైష్ణవి ఎన్ క్లేవ్ అధ్యక్షులు గంప కృష్ణ, సాయి నగర్ అధ్యక్షులు సారా వినోద్ ముదిరాజ్,వాసుదేవ్, ఎస్ ఏ. రహీం, సురేష్ గుప్తా, రాంజీ, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ముస్లిం భాయ్ భాయ్

**మొగలిగిద్ద మాజీ వార్డు సభ్యుడు ఎం డి. తబ్రేజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్న వితరణ భిక్ష కార్యక్రమం**

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 19:-** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ గర్ మండలంలోని మొగలిగిద్ద గ్రామంలో మాజీ వార్డు సభ్యుడు యువ నాయకుడు తబ్రేజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్న వితరణ భిక్ష కార్యక్రమం నిర్వహించారు హిందూ ముస్లిం క్రిస్టియన్ మతం ఏదైనా తన మతాన్ని తల్లిలా భావించాలి అదేవిధంగా పరమతాన్ని ప్రాణ నేస్తం లా గౌరవించాలి జాతిపిత మహాత్మా గాంధీ చెప్పిన ఈ మాటలను అక్షర సత్యాలుగా మారుస్తూ అయ్యప్ప స్వాములకు అన్న వితరణ కార్యక్రమాన్ని చేపడుతూ ముస్లిం యువకులు కొత్త మార్గంలో పయనిస్తున్నారు అదే మార్గంలో ఫరూక్ నగర్ మండలం మొగలిగిద్ద గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు యువ నాయకులు తబ్రేజ్ ఒక అడుగు ముందుకు వేశాడు గ్రామంలో అయ్యప్ప స్వాములకు అన్న వితరణ బిక్ష కార్యక్రమాన్ని చేపట్టి పరమతం పట్ల తనకున్న గౌరవాన్ని చాటాడు ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న






ఆయన మాట్లాడుతూ మతం ఏదైనా దైవం ఒక్కటేనని ఏ దైవం అయినా మనుషులంతా ఒక్కటిగా కలిసి ఉండాలని కోరుకుంటుందని అన్నారు ప్రతి ఒక్కరు తన మతాన్ని ఆచరిస్తూ పరమతాన్ని గౌరవిస్తూ ముందుకు సాగితే ఎలాంటి వివాదాలు ఉండవని స్పష్టం చేశారు మతాలకు అతీతంగా ఇతను చేసిన సేవా కార్యక్రమాలు గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్నాయి అయ్యప్ప స్వాములతో పాటు గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నార

# వెంకటేశ్వర స్వామి ఆలయ భూములపై ఆర్టిఐ దరఖాస్తు

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి మొదటి నుండి దేవాదాయ శాఖ పరిధిలో ఎన్ని ఎకరాల భూమి కలిగి ఉందని? ఇప్పటివరకు ఏమైనా కబ్జాకు గురైందా? కబ్జాకు గురైతే ఎన్ని ఎకరాలు కబ్జాకు గురైంది ? దాంతోపాటు 2010వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు దేవుడు ఆలయానికి సంబంధించి వెండి ఆభరణాలతో పాటు ఎన్ని విరాళాలు వచ్చాయి? ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులు ఖర్చు చేశారు?తదితర సమాచారం కొరకై షాద్ నగర్ పట్టణానికి చెందిన మిద్దెల సత్యనారాయణ ఆర్.టి.ఐ చట్ట ప్రకారం ఆలయ ఈఓ కు దరఖాస్తు చేశారు.



# అంగన్వాడీ కేంద్రం పిల్లల అభివృద్ధి వర్క్ షాప్

**హైదరాబాద్ (స్కై న్యూస్) డిసెంబర్ 19 :** అంగన్వాడి కేంద్రంలో పిల్లల అంగన్వాడి కేంద్రంలో సమగ్ర అభివృద్ధి అంశాలపై అవగాహన ఎల్బీనగర్ నియోజకవర్గం ఈరోజు అరుంధతి కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (పీ%ఉ%జీ ) ఆధ్వర్యంలో మదర్స్ వర్క్షాప్ మరియు పిల్లల అభివృద్ధిలకు సంబంధించిన మెటీరియల్ పంపిణి చెయ్యటం జరిగింది, మరియు సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మెటీరియల్ అంగన్వాడీలో ఇవ్వడం జరిగింది. న్యూట్రిషన్ పై తల్లాలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రథమ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లలిత మేడం మాట్లాడుతూ చిన్నపిల్లల సమగ్ర అభివృద్ధి ప్రధాన అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ వర్క్షాప్‌లో ముఖ్యంగా సమగ్ర అభివృద్ధి



లోని కృత్యాలు తల్లులతో చేయించి ఇంట్లో తమ పిల్లతో చేయించాలి అని చెప్పటం జరిగింది, ఈ కార్యక్రమంనికి సీడీపీఓ పావని మేడం ముఖ్య అతిధిగా హాజరు అయ్యారు, కార్యక్రమం లు చెయ్యటం ద్వారా తల్లులకు కూడా అంగన్వాడీ సెంటర్స్ లో జరిగే కార్యక్రమలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఐసిడిఎస్ సీడీపీఓ పావనిగారు, సూపెర్వైసోర్ అనురాధ ,డాక్టర్ శ్వేత కోఆర్డినేటర్ లలిత ,మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి, అంగన్వాడీ టీచర్స్, తల్లులు, ఆశా వర్కర్లు, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రోగ్రాం సిబ్బంది,తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లులు ఈ వర్క్షాప్ ద్వారా చాలా ఉపయోగకరమైన సమాచారం తెలుసుకున్నామని తెలిపారు.

# ఆంజనేయ స్వామి దేవాలయంలో పోటెత్తిన భక్తులు

**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 19 (స్కై న్యూస్):** గద్వాల పట్టణంలోని నది అగ్రహారం రోడ్డులో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు పోటెత్తారు. దేవాలయంలో ఉదయం నుండి భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి ముక్కులు తీర్చుకున్నారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చాగాపురం రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్కు గుడ్ బాయ్, బి ఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆల సమక్షంలో 100 మంది చేరిక

**చిన్న చింతకుంట డిసెంబర్ 19 (స్కై న్యూస్):** చిన్న చింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలోకి అన్న సాగర్ గ్రామంలో శుక్రవారం భారీగా చేరికలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోహెబ్ ఉరహమాన్ ,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వలియొద్దీన్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన వార్డ్ మెంబర్లు2 వ వార్డ్ మెంబర్ అలివేలు రాములు,3 వ వార్డ్ మెంబర్ శారద కురుమూర్తి,4 వ వార్డ్ మెంబర్ పారిజాత నాగరాజు,8 వ వార్డ్ మెంబర్ మహేందర్,10 వ వార్డ్ మెంబర్ గోవర్ధన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటన్న వీరితో పాటు దాదాపు 100 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ లో పాత కొత్త అని తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు.





# ప్రజలను మెప్పించేవిధంగా మన పాలన సాగాలి







**నిస్వార్థమైన సేవ, పారదర్శక పాలన అందించాలి**

**సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండా**

**ఒంటరి పోరులో అనూహ్య విజయాలు**

**వచ్చేవి ఏ ఎన్నికలైనా సిపిఐదే పై చేయి**

**స్థానిక నాయకుల తీరుతోనే పొత్తు చెడింది**

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**

కొత్తగూడెం డిసెంబర్ 19 (స్కై న్యూస్ ) : గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ అజేయ శక్తిగా నిలిచిందని, అవాకులు చెవాకులు పేలిన వారి నోళ్లు ఒక్క సారిగా మూతపడ్డాయని, గెలిచిన సిపిఐ సర్పంచ్లు, వార్డు సభ్యులు నిస్వార్ధంగా, పారదర్శకంగా ప్రజారంజక పాలన అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. నూతనంగా గెలుపొందిన సర్పంచ్లు, వార్డుసభ్యుల అభినందన సభ శుక్రవారం స్థానిక కొత్తగూడెం క్లబ్ లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ గెలిచిన సిపిఐ అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయితీల్లోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండాగా ఉండాలని సూచించారు. పోటా పోటీగా ఒంటరి పోరుకు దిగిన సిపిఐ జిల్లా వ్యాప్తంగా 47 సర్పంచ్స్థానాలను మంచి మెజార్టీతో గెలుచుకుందని, అదే విధంగా 57 ఉపసర్పంచ్ పదవులు దక్కించుకోగా, 432 వార్డుల్లో ఎర్రజెండా రెపరెపలాడుతోందన్నారు. మేజర్ గ్రామ పంచాయితీలను సైతం సిపిఐ ఖాతాలో వద్దాయని తెలిపారు. తాము కాకలు తీరిని రాజకీయ పండితులం అని చెప్పుకునే వారి ప్రాంతాల్లో కూడా సిపిఐ దూసుకుపోయిందని, కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ కంటే సిపిఐకి అత్యధిక ఓట్లు పోలయ్యాయని చెప్పారు. ముగిసిన ఎన్నికల్లో సిపిఐకి కాంగ్రెస్ పార్టీ కనీసం మద్దతు తెలపలేదని, కానీ సిపిఐ స్నేహధర్మాన్ని పాటిస్తూ గతంలో కాంగ్రెస్ సర్పంచ్లు ఉన్న స్థానాల్లో తాము పోటికి నిలుపలేదని చెప్పారు. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగితూ దిగజారుడు రాజకీయాలు చేశారని, విలువలతో కూడుకున్న రాజకీయాలు, క్రమశిక్షణతో ఉన్న తాము తప్పిదాలకు తావివ్వలేదని చెప్పారు. కొందరు సిపిఐది ఏముందిలే, గత అసెంబ్లీ ఎన్నికల్లో తామే గెలిపించాం, వాళ్లకు అంత సీన్ లేదంటూ అవాకులు చెవాకులు పేలారని, కానీ దిమ్మదిరిగే ఫలితాలు సొంత కావడంతో ఇప్పుడు వారు ఎక్కడున్నారో కూడా అంతు చిక్కడం లేదని యద్దేవా చేశారు. ఇప్పటికైనా మాటలు జారడం మానుకుని స్నేహ బంధాన్ని నిలుపుకుంటే మంచిదని హితవు పలికారు. త్వరలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరగబోతున్నాయని, ఆ తర్వాత మున్సిపాలిటీ, కార్పోరేషన్ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా సిపిఐ దే పై చేయని, ఆ నాటి రాజకీయ పరిస్థితులు, ఆయా పార్టీల రాష్ట్ర పెద్దల నిర్ణయాల మేరకు కార్యచరణ ఉంటుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా మాట్లాడుతూ గెలిచిన అభ్యర్థులు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని, ఓటమి పాలైన వారు కృంగిపోకుండా రానున్న ఎన్నికల్లో సత్తా చాటేందుకు మనోధైర్యాన్ని కూడగట్టుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం గెలుపొందిన సర్పంచులు ఉపసర్పంచులతో పాటు వార్డు సభ్యులకు మెమొంటోలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గసభ్యులు సలిగంటి శ్రీనివాస్, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గారాసి వెంకటేశ్వర్లు, వి.పూర్ణచందర్ రావు, మున్నా లక్ష్మికుమారి, కే సారయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, రేసు ఎల్లయ్య, ఎస్ డి సలీం, చంద్ర నరేంద్ర కుమార్, వాసిరెడ్డి మురళి, మువ్వా వెంకటేశ్వరరావు, బంధం నాగయ్య, ఉప్పుశెట్టి రాహుల్, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల వ్యవహారంలో ఫిల్టర్ తొలగించాము అనేది పచ్చి అబద్ధం

**దుష్ప్రషాలు ప్రచారాలు మానుకోవాలి..**

**సంగెం గ్రామంలో వాటర్ ఫిల్టర్ వివాదంపై క్లారిటీ ఇచ్చిన యెన్నం రఘుపతి రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 19 :-** రంగారెడ్డి జిల్లాలోని సంగెం గ్రామంలో వాటర్ ఫిల్టర్ వివాదంపై క్లారిటీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు యెన్నం రఘుపతి రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనవసరంగా తమపై దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని, ఏదైనా పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాత బయటకి తెలిపితే బాగుంటుంది కానీ ఏదీ లేకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం అవివేకమని సంగెం గ్రామ కాంగ్రెస్ నాయకులు యెన్నం రఘుపతి రెడ్డి మండిపడ్డారు కేశంపేట మండలం సంగెం గ్రామంలో రాజుకున్న వాటర్ ఫిల్టర్ వివాదంపై ఆయన స్పందించారు ఎలాంటి లాభపేక్ష లేకుండా నెలకు 20 వేల రూపాయల స్వంత ఖర్చుతో గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వృధాగా ఉన్న పంచాయతీకి చెందిన భవనంలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు రెండు సంవత్సరాలుగా నిరంతరాయంగా వాటర్ ఫిల్టర్ నడుపుతూ గ్రామస్తులకు నిరంధిస్తూ సేవ చేసామన్నారు. ఎన్నికలకు ముందు బోరు మోటర్లు కాలిపోవడంతో 30 వేల రూపాయల ఖర్చు చేసి వాటిని రిపేర్ చేయించి ఫిల్టర్ ప్రారంభించామన్నార అయితే వేస్ట్ వాటర్ పైప్లైన్ నిండి పోవడంతో గ్రామస్తులు వడ్ల ధాన్యాన్ని సీసీ రోడ్లపై ఎండబెడుతుండటంతో అవి పాడు కాకుండా ఉండటానికి వాటర్ ఫిల్టర్ నీటి సరఫరా ఆగిందన్నారు తిరిగి పైప్ లైన్ పనులు చేయించి ఫిల్టర్ ను గ్రామస్తులకు అందుబాటులోనికి తేవాలని చూసిన క్రమంలో ఎంపీడీఓ అధికారికి ఎవరో ఫిర్యాదు చేశారని, ఫిల్టర్ అక్కడ నుండి తీసివేస్తే కొత్తగా ఏర్పాటు చేస్తారని పంచాయితీ కార్యదర్శి ద్వారా తమకు సమాచారం అందడంతో అక్కడ నుండి వాటర్ ఫిల్టర్ తొలగించడం జరిగిందన్నారు ఇది ఏది తెలుసు కోకుండా సంగెం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి గెలవక పోవడంతోనే వాటర్ ఫిల్టర్ తీసివేశారని కొందరు ప్రచారం చేసి పైశాచిక ఆనందాన్ని పొందారన్నారు మాకు గ్రామస్తులంతా ఒక్కటే సేవ చేశామే కానీ దుర్మార్గం చేయలేదు అధికారుల ఆదేశాల మేరకే వాటర్ ఫిల్టర్ తీసివేశామనే విషయం గ్రహించాలని అనవసరంగా తమపై కొందరు బురద చల్లాలనీ చూస్తే సహించమని ఘాటుగా స్పందించారు.

# పెన్షన్ అదాలత్, ట్రైపార్టైట్ & ప్రయాస్ మీటింగ్

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంచార్జ్ జిఎం ఎం.వి. నరసింహారావు**

**సింగరేణి డిసెంబర్19(స్కై న్యూస్ ):** శుక్రవారం )న కొత్తగూడెం ఏరియాలోని మాజీ ఉద్యోగుల పెన్షన్ సీఎంపిఎఫ్ సమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెం ఏరియా ఇంచార్జ్ జిఎం అధ్యక్షతన అధ్యక్షతన సీఎంపిఎఫ్ వారి ఆధ్వర్యంలో ఆర్.సి.ఓ.ఏ క్లబ్, రుద్రంపూర్ నందు పెన్షన్ అదాలత్, ట్రైపార్టైట్ ఒ ప్రయాస్ మీటింగ్ సమావేశం నిర్వహించారు ముందుగా కొత్తగూడెం ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ ఎం.వి. నరసింహారావు రీజినల్ కమిషనర్ సీఎంపిఎఫ్ శ్రీమతి ఏం కనకమ్మ కే. వంశీధర్ ని పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికినారు తదనంతరం కొత్తగూడెం ఏరియాలోని మాజీ ఉద్యోగుల పెన్షన్ సీఎం పిఎఫ్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా కమిషనర్ సీఎంపిఎఫ్ మాట్లాడుతూ పెన్షన్ తీసుకుంటున్న మాజీ ఉద్యోగులు వారి యొక్క బ్యాంక్ అకౌంట్ ను ఫార్మర్ సర్వేయర్ గా మార్చుకొని వారి యొక్క నామిని మాజీ ఉద్యోగి భార్య ఆధార్ కార్డు ను సీఎంపిఎఫ్ ఆఫీస్ లో సమర్పించి మాజీ ఉద్యోగి మరణాంతరం విడో పెన్షన్ కు ఎలాంటి జాప్యం జరగకుండా పెన్షన్ పొందుటకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. అలాగే కొత్తగూడెం ఏరియాలో పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు సీఎంపిఎఫ్ క్లెయిమ్ సెటిల్మెంట్ చేసే సంబంధిత సిబ్బందితో ప్రాయాస్ అనే కార్యక్రమం పై మీటింగ్ నిర్వహించి సి-కేర్ పోర్టల్ ద్వారా క్లైమ్ సెటిల్మెంట్ కు సంబంధించి వివిధ విషయాలను క్షుణ్ణంగా చర్చించి సీఎంపిఎఫ్ క్లెయిమ్స్ సెటిల్మెంట్ కొరకు సి-కేర్ పోర్టల్ లో





సంబంధిత సింగరేణి సిబ్బంది అప్లోడ్ చేస్తున్నప్పుడు ఉత్పన్నమవుతున్న సమస్యలను ఈ కార్యక్రమంలో నివృత్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఎంపిఎఫ్ కమిషనర్స్ మాట్లాడుతూ ప్రాయాస్ మీటింగ్ రెగ్యులర్ గా సింగరేణి పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు సంబంధిత సీఎంపిఎఫ్ సెటిల్మెంట్ చేసే సిబ్బందితో క్లెయిమ్స్ సెటిల్మెంట్ లను త్వరితగతిన పూర్తిచేయడం కొరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు అలాగే సీఎంపిఎఫ్ క్లెయిమ్ త్వరితగతిన సీ-కేర్ పోర్టల్ ద్వారా జీరో పెండెన్సీ తో సిఎంపీఎఫ్ క్లెయిమ్స్ ను సెటిల్మెంట్ చేస్తున్న కొత్తగూడెం ఏరియా మేనేజ్మెంట్ ను అభినందించారు. సీ-కేర్ పోర్టల్ ద్వారా ఈ యొక్క కార్యక్రమానికి హాజరైన మాజీ ఉద్యోగుల అప్లికేషన్లను తీసుకొని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలియజేయడం జరిగింది, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తామని మాజీ ఉద్యోగులు హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిఎం ఎం.వి. నరసింహారావు తో పాటు సీఎంపీఎఫ్ కమిషనర్స్ కే. వంశీధర్,ఎం.కనకమ్మ, అసిస్టెంట్ కమిషనర్ పి. చిరంజీవి, కొత్తగూడెం ఏరియా ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె. గట్టయ్య, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఎజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, ఎజిఎం( ఫైనాన్స్) ఈ.భీబస్తా, డివై పిఎం జి. హరీష్, సీనియర్ పిఓలు ఎం. మురళి, మతిన్, కే.శ్రీనివాసరావు, మేనేజ్మెంట్ ట్రైనీ (పర్సనల్) షాకీల్, శ్వేత, ఆంథోనీ సబ్బాస్టిన్ విక్టర్, కొత్తగూడెం ఏరియాలోని మైన్స్ అండ్ డిపార్ట్మెంట్ లోని సంబంధిత పెన్షన్ సెటిల్మెంట్ సిబ్బంది మాజీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ పార్లమెంట్ గ్రామాలలో భారీగా పుంజుకున్న బీజేపీ

## ఇద్దరు ఎమ్మెల్యేల సోం తూర్లలో బీజేపీ ఘన విజయం

## సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ లో సైతం పలు గ్రామాలు బీజేపీ కైవసం.

**మహబూబ్ నగర్, డిసెంబర్ 19(స్కైన్యూస్):**గతంతో పోల్చితే భారీగా బీజేపీ గ్రాఫ్ గ్రాఫ్ పెరిగింది. ప్రతి గ్రామానికి విస్తరించిన పార్టీ విస్తరించింది. పదేళ్లు బి ఆర్ ఎస్ , రెండేళ్ల కాంగ్రెస్ పార్టీల పాలనను కాదని బీజేపీ కి ప్రజలు మద్దతు ఇచ్చారు. ఉమ్మడి పాలమూరులో గతంతో పోల్చితే బీజేపీ గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలు భారీగా పెరిగాయి. ఇరవై పైగా స్థానాలలో స్వల్ప ఓట్ల తేడాతో.. రెండో స్థానంలో నిలవగా. పలు చోట్ల బీజేపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. ప్రజలు బీజేపీని ప్రత్యామ్నాయ శక్తిగా భావిస్తున్నారని బీజేపీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అనేక గ్రామ పంచాయితీలలో బీజేపీ విజయం సాధించడం అందులోనూ జడ్చర్ల, నారాయణపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల సొంత



గ్రామాల్లో బీజేపీకి ప్రజలు పట్టం కట్టారు. సీఎం సొంత నియోజకవర్గంలో సైతం బీజేపీ పలు గ్రామాల్లో గెలుపొందడం జరిగింది. ప్రజలు బీజేపీ ని ప్రత్యామ్నాయంగా స్వాగతిస్తున్నారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ నేతల తాయిలాలకు, డబ్బు ప్రలోభాలకు తలొగ్గకుండా స్వచ్ఛందంగా బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు పోలైన ఓట్ల శాతం రికార్డు స్థాయిలో పెరిగింది. రాబోయే మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల గెలుపే టార్గెట్ గా బీజేపీ ప్రణాళిక సిద్ధం చేసుకుంటుంది.

# రక్తదానం మహాదానం..


**మానవత్వం సజంగా సజీవంగా ఉందని మరోసారి నిరూపితమైంది.. యువ సత్తా లక్ష్మణ్ సహకారంతో రక్త దానం చేసి ఆపద లో ఉన్న మన్నన్ పేషంట్ కు ఆదుకున్న రామ్ దాస్**

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 19:-** రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ కు చెందిన యువ సత్తా లక్ష్మణ్ కుమార్ సహకారంతో ఫరూఖ్ నగర్ కు చెందిన మన్నన్ అనే బాలిక అనే రోగికి రక్త దానం చేసి ఆపద లో ఆదుకున్న రామ్ దాస్ స్వామి, హైదరాబాద్ కు చెందిన మన్నన్ అనే బాలిక హార్ట్ సర్జరీ కోసం బి నెగిటివ్ రక్తం దొరకక ఇబ్బంది పడుతుంటే ఫరూఖ్ నగర్ కు చెందిన అహ్మద్ యువ సత్తా లక్ష్మణ్ కుమార్ కు తెలియ జేయడంతో వేంటనే స్పందించిన ఆయన కోడి చర్ల ఉప సర్పంచ్ రామ్ దాస్ స్వామి ని హుటాహుటిన రాత్రి రాత్రే తీసుకుని హైదరాబాద్ స్టార్ హాస్పిటల్ కు చేరుకొని రక్త దానం చేయించడం జరిగింది. హైదరాబాదులో మానవత్వం సజంగా సజీవంగా ఉందని మరోసారి నిరూపితమైంది యువసప్త లక్ష్మణ్ కుమార్, ఉపసర్పంచ్ రాందాస్ రక్తదానం చేసి సహాయం అందించిన ఈ మానవీయ ఉదాహరణ నేటి సమాజానికి ఒక ప్రేరణ లాంటిది రక్తదానం అందించి బాలిక ప్రాణం కాపాడిన యువ సత్తా లక్ష్మణ్ కుమార్, రాందాస్ కు మన్నన్ బాలిక కుటుంబం వారిని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు



# అసమాన్యుడు పొట్టి శ్రీరాములు

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు విషయం ప్రస్తావనకు వస్తే, అమరజీవిగా ప్రాచుర్యం పొందిన పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష గుర్తుకు రాక మానదు. 1952 డిసెంబర్ 19న భారత తొలి ప్రధాని పండిట్ నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు గురించి పార్లమెంట్ లో ప్రకటన చేశారు. ఈ విషయం గురించి మననం చేసు కోవాలంటే పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి తెలుసుకోవాల్సిన అవసరం అనివార్యం. మహాత్మా గాంధీ వ్యక్తిత్వానికి ప్రభావితులై, ఉద్యోగం వదిలి దాదాపు రెండు దశాబ్దాలు శ్రీరాములు సన్నిహితంగా మెదిలి, జాతిపిత అహింస సిద్ధాంతాన్ని విశ్వసించి, పలుమార్లు ఆచరించి.. విజయం సాధించారు. వివిధ రాష్ట్రాల్లో సత్యాగ్రహ ఉద్యమాలు చేస్తూ జైలుకెళ్లిన శ్రీరాములు బీహారు వంటి రాష్ట్రాల్లో కూడా సేవలు చేశారు. అనంతరం నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. "ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది". స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. ఆ లేఖకు శ్రీరాములు స్పందిస్తూ, ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు" అని పేర్కొన్నారు. 1952




అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. "మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి" అని పేర్కొన్నారు.దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు.. "ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించబడింది. ఆయన దీక్షను చేపట్టాక, విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు...1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం. 2) భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం. శ్రీరాములు ఒక సందర్భంలో.. "నేను చచ్చిపోవాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు" అన్నారని (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952)లో పేర్కొన బడింది. ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. "ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు". ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. మద్రాసు లేకుండా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 11 జిల్లాలు, బళ్ళారి జిల్లాలోని 3 తాలూకాలు ఇందులో భాగంగా ఉంటాయని ప్రకటించారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలతో పాటు, బళ్ళారి జిల్లాలోని రాయదుర్గం, ఆదోని, ఆలూరు తాలుకాలను కలుపుకుని 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. బళ్ళారి జిల్లాలోని బళ్ళారి తాలూకాను ఎల్.ఎస్ మిశ్రా సంఘం నివేదిక ననుసరించి మైసూరు రాష్ట్రంలో కలిపేసారు. 1937 నాటి శ్రీబాగ్ ఒడంబడిక ననుసరించి కొత్త రాష్ట్రానికి కర్నూలు ముఖ్యపట్టణం అయింది. టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రి అయ్యారు. సి.ఎం. త్రివేది గవర్నరు అయ్యారు. నెహ్రూ చేతుల మీదుగా జరిగిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో ఆంధ్రుల చిరకాల స్వప్నం ఫలించింది.

# ఈనెల 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం

**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 19(స్కై న్యూస్):**ప్రపంచ శాంతి, సహకారం, ఐకృత కొరకు సంకల్పంతో ఈనెల 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా రాత్రి 8 గంటలకు ఎవరి ఇళ్లలో వారు ధ్యానం చేయడానికి హార్ట్ ఫుల్ నెస్ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ధ్యాన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు హార్ట్ఫుల్ రామచంద్రమిషన్ జోగులాంబ గద్వాల జిల్లా నిర్వాహకులు చంద్రశేఖర్ తెలిపారు. దాజి ఆధ్వర్యంలో హైదరాబాద్ సమీపంలోని కన్హ శాంతివనం కేంద్రంగా 265 దేశాలలో ధ్యాన కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. ఉత్తరప్రదేశ్లో 1945లో ప్రారంభమైన ధ్యాన కేంద్రాలు ప్రతి ఒక్కరు ధ్యానం చేయడానికి ఉచితంగా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేయించుకొని ఒకేసారి ధ్యానం చేయడానికి వీలు కలుగుతుందని తెలిపారు. మానసిక ఆరోగ్యం, ఐకృత, శాంతి కొరకు ప్రతి ఒక్కరు ధ్యానం చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు తదితరులు ఉన్నారు.




# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరును మర్యాదపూర్వకంగా కలిసిన కేశంపేట సర్పంచ్ బోజ్జం శ్రీశైలం వార్డు సభ్యులు

**కేశంపేట గ్రామపంచాయతీ అభివృద్ధి నా బాధ్యత**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 19:-** రంగారెడ్డి జిల్లా కేసంపేట్ మండలంలో ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ బొజ్జం శ్రీశైలం తదితర వార్డు సభ్యులు శుక్రవారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ సర్పంచ్ శ్రీశైలం తదితర వార్డు సభ్యులను అభినందించి వారిని శాలువాలతో సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ కేశంపేట గ్రామపంచాయతీ అభివృద్ధి బాధ్యత తనదని గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పంచాయతీ ద్వారా చేపట్టేందుకు నిధులను తగినంతగా కేటాయిస్తామని స్పష్టం చేశారు గ్రామాల్లో ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని ఆ తర్వాత అందరూ కలిసికట్టుగా పనిచేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు గ్రామాల్లో ఐకృత ద్వారానే అనేక అభివృద్ధిని సాధించవచ్చు అని ఆయన సూచించారు గెలిచిన ప్రజాప్రతినిధులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా గ్రామ స్వరాజ్యాన్ని కాపాడేందుకు గ్రామపంచాయతీలను పటిష్టం చేసేందుకు కృషి చేస్తుందని స్పష్టం చేశారు



# భారతీయ గ్రంథాలు కీర్తి సంకేతాలు

"అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంత మైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళ యితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సరస్వతి) పండుగ పేరుతో శరన్నవరా త్రులలో నిర్వ హించే ఆచారం కొనసాగుతున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషే యాలని భావించే వేదాలు మొదలుకుని, 2300ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి', పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్య శాస్త్రం', హాలుని 'గాధా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. గ్రంథానికి మృతి లేదు. అక్షర రూపం దిద్దుకున్న ఆలోచన, రాసిన వసువును బట్టి ఎంతకాలం మన గలుగుతుందో నిర్ణయ మవుతుంది. తాళపత్ర, బూర్జపత్ర, తామ్రపత్ర, చర్మపత్ర రూపాలలో ఉన్నవి శిథిలా లైతే, తిరిగి ప్రతి లేఖనాలవుతాయి. మనిషి అజ్ఞానంతోనో , తెలియకో, విలువ స్వార్థపరుడై విధ్వంసం చేస్తే తప్ప, తామ్ర, శిలా రూపాలకు చావే లేదు కదా. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన ఆరిస్టాటిల్, మన దేశ తత్వ సాహిత్యాన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికుల సందర్శనలకు హేతువులైనాయి, చైనా, టిబెట్, ఆఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాజ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శ్రౌతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరి ణామ క్రమంలో ముఖ్య ఘట్టం. వేదా లు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం, గ్రంథ రూపం సంతరించుకున్నాక, ప్రపం చంలో ఏ జాతీ, ఏ దేశం, భారత దేశానికి సాటి రావని, సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృ తిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాల యాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన.ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహుకష్టంతో కూడుకునేది. గురువుకు ప్రాధాన్యత ఉండడం వల్లే గురు: బ్రహ్మ, గురుర్విష్ణు అన్న సూక్తి పుట్టుకొచ్చింది. దానిని ప్రసుతం గ్రంథానికి వర్తింప చేయవచ్చు. గ్రంథాలయం అందుబాటు వల్ల దూరవిద్యా విధానం కూడా అమలు లోనికి వచ్చింది. ముద్రణా యంత్రా ల ఆధునీకరణ జరిగింది. మరీ ముఖ్యంగా డిజిటలైజేషన్ వల్ల ముద్రణ నాణ్యమైన, అందమైన ముద్రణలతో పాటుగా నేడు "ఈ గ్రంథాలు" ఉపయోగ పడుతున్నాయి. అయినా ముద్రిత గ్రంథ ఉపయోగం ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనా త్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మి కాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటేమిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథం లోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారా లు. ముద్రణ వల్ల గ్రంథానికి విలువ ఏర్పడింది కనుక, డిమాండును బట్టి, వ్యాపారాత్మకత కారణంగా అధిక ధరల ప్రపంచం ఏర్పడుతున్నది. తొలి హైదరాబాద్ బుక్ ఫెయిర్ 1985లో హైదరాబాద్ లోని అశోక్ నగర్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. అనంతరం నిజాం కాలేజీ గ్రౌండ్స్, పబ్లిక్ గార్డెన్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కేశవ్ మెమోరియల్ హైస్కూల్ గ్రౌండ్స్ తదితర ప్రాంతాల్లో బుక్ ఫెయిర్లు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ కళా భారతి (ఎన్టీఆర్ గ్రౌండ్స్)లో పుస్తక ప్రదర్శన నిరంతరం కొనసాగుతోంది. ప్రతి ఏటా హైదరాబాద్? వాసులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే హైదరాబాద్ బుక్?ఫెయిర్ ఈ నెల 19 నుంచి అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఇందిరా పార్క్? సమీపంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి 29 వరకు 38వ జాతీయ పుస్తక ప్రదర్శన జరగుతున్నది. 19న సాయంత్రం 5 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభమవుతుందని బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షు డు కవి యాకూబ్ తెలిపారు. పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కు కావాల్సిన పుస్తకాలు, రచయితలకూ, వారు అక్కడే ఉండి పుస్తకాలు అమ్ముకునే సదుపాయం గల ప్రత్యేక స్టాల్, రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు, శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో సైతం బుక్ ఫెయిర్ నిర్వ హిస్తున్నారు. 300కు పైగా స్టాళ్లు, విభిన్న భాషల పుస్తకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక సమీక్షలు ఉంటాయి. బహు భాషలు, రచయితలు, గ్రంథాలు, ముద్రాపకులు, ఒక్కచోట చేరితే అదొక విజ్ఞాన విశ్వమే కదా. అందుకే చాలామందికి ప్రీతిపాత్రం గ్రంథాల జాతరా. దేవున్ని జారతలో కొలిచినట్లే, గ్రంథాలను పరమ పవిత్రంగా భావించే సంస్కృతి భారతీయు లది. కొనే వారు, చదివే వారు, సంరం భాన్ని కన్నుల పండువ గా తిలకించే వారు, కౌటుంబిక, స్నేహ, ప్రేమికుల, విద్యా ర్థుల, రచయితల, కవుల, సాహితీ కారుల బృందాలు ఒక్క చోట కలిసి పండుగ చేసుకునే భాగ్యనగర పుస్తక మేళాకు వెళ్ళిన వారికి మరచిపోలేని అనుభూ తులను మిగులుస్తుంది

# టెట్ పరీక్ష వాయిదా వేయాలి...

**బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు**

**నారాయణపేట డిసెంబర్ 19: (స్కైన్యూస్)** ఉపాధ్యాయ అర్హత టెట్ పరీక్ష ను వాయిదా వేయాలని నారాయణపేట జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామా జీ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.టెట్ పరీక్ష రాయాల్సిన వారిలో ఉపాధ్యాయులు ఉన్నారని ఆయన అన్నారు.ఉపాధ్యాయులు గత 20 రోజులుగా పంచాయితీ ఎన్నికల విధుల్లో బిజీగా గడిపారని పేర్కొన్నారు.దీంతో ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయడానికి సన్నదం అయ్యే పరిస్థితీ లేకుండా పోయిందని అన్నారు.వారికి టెట్ పరీక్ష రాయడానికి సన్నద్ధం కావడానికి సమయం ఇవ్వాలని అందుకు టెట్ పరీక్ష వాయిదా వేయాలని కోరారు.






# ఔషధాల గని లవంగం

లవంగాలు కేవలం సుగంధ ద్రవ్యాలు మాత్రమే కావు, ఆరోగ్యానికి మేలు చేసే ఔషధ గుణాల గని. రాత్రి పడుకునే ముందు లవంగాలు తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తూ, జలుబు, దగ్గు, నోటి సమస్యల నుండి ఉపశమనం అందిస్తాయి. గుండె ఆరోగ్యానికి కూడా ఇవి తోడ్పడతాయి. అత్యంత ముఖ్యమైన సుగంధ ద్రవ్యాలలో ఒకటైన లవంగాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వైద్య నిపుణుల అభిప్రాయాల ఆధారంగా ఈ రోజు తెలుసుకుందాం. లవంగాలు ఆహారానికి రుచిని మాత్రమే కాకుండా, వాటిలోని ఔషధ గుణాలతో మన ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా రాత్రి పడుకునే ముందు లవంగాలు తీసుకోవడం లేదా లవంగం నీరు తాగడం వల్ల శరీరంలో అనేక సానుకూల మార్పులు చోటు చేసుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. పడుకునే ముందు లవంగాలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు సూపర్‌గా మెరుగుపడుతుంది. ఇది అజీర్ణం, ఉబ్బరం వంటి సాధారణ జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. లవంగాలలో ఉండే యాంటీ మైక్రోబయల్ లక్షణాలు శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా, ఇవి శ్వాసవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో, అలాగే నోటి ఆరోగ్యానికి కూడా దోహదపడతాయి. లవంగాలు ఫైబర్, మాంగనీస్, పొటాషియం, కాల్షియం, విటమిన్ కె వంటి ఖనిజాలు, విటమిన్లతో పాటు ఫ్లేవనాయిడ్స్, యూజినాల్ వంటి ముఖ్యమైన కర్బన సమ్మేళనాలను కలిగి ఉంటాయి. అందుకే ఆయుర్వేద నిపుణులు రాత్రి నిద్రపోయే ముందు లవంగాలను తీసుకోవాలని సూచిస్తున్నారు. లవంగాలు మెదడును ప్రశాంతపరిచే సహజ పదార్థాలను కలిగి ఉంటాయి. వీటిని తినడం వల్ల ఒత్తిడి తగ్గి, మంచి గాఢమైన నిద్రను పొందడానికి సహాయపడుతుంది. లవంగాలలోని ఔషధ గుణాలు శరీరం నుండి విషాన్ని సులభంగా తొలగించడంలో కూడా తోడ్పడతాయి. జలుబు, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారికి లవంగాలు ఉపశమనం కలిగిస్తాయి. వీటిలోని వెచ్చదనం, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు గొంతు నొప్పి, దగ్గు, జలుబు, కఫం వంటి సమస్యల నుండి త్వరగా విముక్తి కలిగిస్తాయని చెబుతారు. నోటి ఆరోగ్యం విషయానికి వస్తే, లవంగాలు నమలడం వల్ల దుర్వాసన తగ్గుతుంది. ఇది పంటి నొప్పి నుండి తక్షణ ఉపశమనాన్ని అందించి, ఆరోగ్యకరమైన నోటిని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి కూడా లవంగాలు మేలు చేస్తాయి. లవంగం నీరు శరీరంలో రక్త ప్రసరణ ప్రక్రియను మెరుగుపరచడంలో సహాయపడి, తద్వారా గుండె పనితీరును కూడా తోడ్పడుతుంది. లవంగాల నీటిని తయారుచేయడం చాలా సులభం. ముందుగా ఒక కప్పు నీటిలో మూడు లేదా నాలుగు లవంగాలను కలిపి ఉంచండి. నానబెట్టిన లవంగాలను మీడియం మంట మీద ఐదు నిమిషాలు మరిగించండి. ఆ తర్వాత నీటిని చల్లబరచండి. పడుకునే 30 నిమిషాల ముందు ఈ నీటిని పరిమిత పరిమాణంలో తాగాలి. అయితే లవంగాలు వేడి స్వభావాన్ని కలిగి ఉంటాయి కావున, వీటిని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిది. అలాగే, ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు లవంగాలను ఆహారంలో చేర్చుకునే ముందు వైద్యులను సంప్రదించడం ఇంకా ఉత్తమం.

# లిఫ్ట్‌కి బదులు మెట్లు వాడండి ఊహించని ఫిట్‌నెస్



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఫిట్‌గా ఉండటం ఒక పెద్ద సవాలుగా మారింది. ఊబకాయం సమస్య పెరుగుతున్న ఈ రోజుల్లో, చాలామంది జిమ్‌కు వేలకు వేలు ఖర్చు పెట్టలేక, కఠినమైన ఆహార నియమాలు పాటించలేక నిరాశకు గురవుతున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఫిట్‌గా ఉండటం ఒక పెద్ద సవాలుగా మారింది. ఊబకాయం సమస్య పెరుగుతున్న ఈ రోజుల్లో, చాలామంది జిమ్‌కు వేలకు వేలు ఖర్చు పెట్టలేక, కఠినమైన ఆహార నియమాలు పాటించలేక నిరాశకు గురవుతున్నారు. అయితే, ఖర్చు లేకుండా, ప్రత్యేకంగా సమయం కేటాయించకుండానే అత్యంత ప్రభావవంతమైన ఫలితాలను ఇచ్చే ఒక సులభమైన వ్యాయామం ఉంది, అదే మెట్లు ఎక్కడం. లిఫ్ట్‌లకు, ఎస్కలేటర్‌లకు అలవాటు పడిపోయిన మనం.. మెట్లు ఎక్కడం అనే చిన్న అలవాటును తిరిగి జీవితంలోకి తీసుకొస్తే, ఆరోగ్యంలో అద్భుతమైన మార్పులు కనిపిస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మెట్లు ఎక్కడం అనేది గుండె ఆరోగ్యానికి, కండరాల బలానికి అత్యంత శక్తివంతమైన వ్యాయామంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని అనేక ప్రధాన కండరాలు ఒకేసారి పనిచేసేలా చేస్తుంది. ముఖ్యంగా కాళ్ల కండరాలు బలంగా మారతాయి, ఇది శరీరానికి చురుకుదనం పెంచుతుంది. సాధారణ నడకతో పోలిస్తే, మెట్లు ఎక్కడం అనేది ఎక్కువ శక్తిని ఖర్చు చేసే ఇంటెన్స్ కార్డియో వ్యాయామం. ఇది మీ హృదయ స్పందన రేటును పెంచుతుంది, తద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవారికి మెట్లు ఎక్కడం ఒక అద్భుతమైన వ్యాయామంగా పనిచేస్తుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం, కేవలం ఆరు నిమిషాల పాటు నిరంతరాయంగా మెట్లు ఎక్కడం వల్ల కూడా శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని తేలింది.అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నవారు, రోజుకు కేవలం 30 నిమిషాలు మెట్లు ఎక్కే అలవాటు చేసుకుంటే, సుమారు 250 నుంచి 300 కేలరీల వరకు ఖర్చు చేయవచ్చు. క్రమం తప్పకుండా ఈ వ్యాయామం చేయడం ద్వారా శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వు క్రమంగా కరుగుతుంది. ప్రత్యేకంగా జిమ్‌లకు వెళ్లడానికి సమయం కేటాయించలేని బిజీ వ్యక్తులకు మెట్లు ఎక్కడం ఒక వరం లాంటిది. రోజువారీ పనుల్లో భాగంగానే మీరు ఈ వ్యాయామాన్ని అలవాటు చేసుకోవచ్చు. ఆఫీసులో లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఉపయోగించడం, అపార్ట్‌మెంట్లలో ఇంటికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు మెట్లు ఎక్కడం వంటి చిన్న మార్పులు దీర్ఘకాలంలో మీ ఆరోగ్యంపై పెద్ద సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. మెట్లు ఎక్కడం అనేది కేవలం కేలరీలు ఖర్చు చేయడమే కాదు, మీ రోజువారీ జీవితానికి చురుకుదనాన్ని జోడిస్తుంది. కాబట్టి, ఇకనుంచి మెట్లను ఉపయోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోండి!

# బొజ్జని అదుపు చేసే ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్



ఎవరికి మాత్రం అంత పొట్ట వేసుకుని ఉండాలని ఉంటుంది చెప్పండి. ఫిట్‌గా ఉండాలని అందరికీ ఆశగానే ఉంటుంది. కానీ అందుకోసం కష్టపడటమే ఎవరికీ నచ్చదు. ఫుడ్ తినడం ఏమాత్రం కంట్రోల్ చేసుకోలేరు.అలా అలా చిన్న బొజ్జ కాస్త, క్రమంగా పెరుగుతూ పోతుంది. స్పెషల్‌గా అందుకోసం ఫోకస్ పెట్టాల్సిన అవసరం లేకుండా దానికదే సైలెంట్‌గా పెరుగుతూ పోతుంది బెల్లీ ఫ్యాట్. కానీ దానిని కరిగించడానికి మాత్రం అష్టకష్టాలు పడాల్సిందే. 24 గంటలూ దానిపై ధ్యాస పెట్టాల్సిందే. తాగే టీ, కాఫీల దగ్గరి నుంచి ఏం తింటున్నాం, ఎంత తింటున్నాం, ఎప్పుడు తింటున్నాం, తిన్న తర్వాత ఏం చేస్తున్నాం.. ఇలా అన్ని ఆలోచిస్తూ ఉంటే కానీ ఆ బొజ్జ తగ్గడం మొదలవదు. బరువు పెరగడానికైనా, తగ్గడానికైనా, బొజ్జ తగ్గడానికైనా, పొట్ట తగ్గి సిక్స్ ప్యాక్ రావడానికైనా అందరూ చేసేది రెండే రెండు. ఒకటి వ్యాయామం, రెండోది డైట్. ఈ రెండింటిని సక్రమంగా చేయగలిగితే మన శరీరాన్ని ఎలా కావాలనుకుంటే అలా మలుచుకోవచ్చు. ఈ రెండింట్లో అత్యంత ముఖ్యమైనది డైట్. డైట్ ఒక్కటి కంట్రోల్ చేయగలిగితే మన శరీరంలో చాలా మార్పులు మన కళ్ల ముందే జరుగుతాయి.

ఈ డైట్‌ను కంట్రోల్ చేయడానికి ఇటీవలి కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చిందే ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ . క్రమబద్ధమైన ఉపవాస పద్ధతిని అనుసరించడం ద్వారా బరువు తగ్గడం, జీవక్రియను మెరుగుపరచడం, ముఖ్యంగా బెల్లీ ఫ్యాట్‌ను సమర్థవంతంగా తగ్గించడం సాధ్యం అవుతుందని గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ వైద్య నిపుణుడు, డాక్టర్ సౌరభ్ సేథి తెలిపారు. ముఖ్యంగా ఈ ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ ఎలా చేయాలి, పాటించాల్సిన 3 ముఖ్యమైన చిట్కాల గురించి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వివరించారు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది ఆహారం తినడానికి, ఉపవాసం ఉండటానికి ఒక కచ్చితమైన సమయాన్ని కేటాయించడాన్ని సూచిస్తుంది. కొత్తగా ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ ప్రారంభించేవారు 12 – 12 ఫార్ములా పాటించడం మంచిది. అంటే రోజులో 12 గంటలు ఆహారం తీసుకోకుండా ఉపవాసం ఉండాలి. మిగిలిన 12 గంటల విండోలో ఆహారం తీసుకోవాలి. రాత్రి 7 గంటలకు భోజనం చేస్తే.. మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు ఏమీ తినొద్దు. రాత్రంతా పడుకుంటాం కాబట్టి దీనిని పాటించడం చాలా సులభం. ఈ షెడ్యూల్ మీ జీర్ణవ్యవస్థకు విశ్రాంతిని ఇవ్వడమే కాకుండా, మీ శరీరం కొవ్వును శక్తిగా ఉపయోగించుకునే ప్రక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. శరీరం ఈ పద్ధతికి అలవాటు పడ్డాక, దానిని 14:10 లేదా 16:8 వంటి కాస్తంత కఠినమైన సమయాలకు మారవచ్చు. నీరు తాగాలి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి ఇది చాలా ముఖ్యం. అలాగే చక్కెర్, పాలు కలపకుండా తయారు చేసే బ్లాక్ కాఫీ, బ్లాక్ టీ, గ్రీన్ టీ తాగొచ్చు. ఇవి జీవక్రియను వేగవంతం చేయడంలో సహాయపడతాయి. అలాగే యాపిల్ సైడర్ వెనిగర్ లేదా నిమ్మరసం తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. సోంపు లేదా తులసి నీరు లేదా అల్లం టీ(కొద్దిమొత్తంలో) వంటివి కూడా తాగొచ్చు.

# ఆవాలతో ఆరోగ్య ప్రయోజనాలు



మన వంటకాల్లో, ముఖ్యంగా పోపు దినుసుల్లో ఆవాలకు ప్రత్యేక స్థానం ఉంది. సాధారణంగా ఆవాలు అంటే నల్లగా ఉండే చిన్న గింజలే మనకు గుర్తొస్తాయి. కానీ, మార్కెట్‌లో నలుపుతో పాటు తెల్ల ఆవాలు కూడా ఉంటాయని చాలామందికి తెలియదు. మన వంటకాల్లో, ముఖ్యంగా పోపు దినుసుల్లో ఆవాలకు ప్రత్యేక స్థానం ఉంది. సాధారణంగా ఆవాలు అంటే నల్లగా ఉండే చిన్న గింజలే మనకు గుర్తొస్తాయి. కానీ, మార్కెట్‌లో నలుపుతో పాటు తెల్ల ఆవాలు కూడా ఉంటాయని చాలామందికి తెలియదు. ఇవి పూర్తిగా తెల్లగా కాకుండా, కాస్త క్రీమ్ రంగులో ఉంటాయి. నల్ల ఆవాల మాదిరిగానే తెల్ల ఆవాలలో కూడా అనేక పోషకాలు నిండి ఉన్నాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే, కేవలం రుచిని పెంచడమే కాకుండా, అనేక రకాల వ్యాధులను నయం చేయడానికి కూడా సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. తెల్ల ఆవాలు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. తెల్ల ఆవాలను ఆహారంలో చేర్చుకుంటే, నోటిలో లాలాజలం, జీర్ణ రసాలు అధికంగా ఉత్పత్తి అవుతాయి. దీనివల్ల మనం తీసుకున్న ఆహారం, ముఖ్యంగా ప్రోటీన్లు, కొవ్వులు సులభంగా జీర్ణం అవుతాయి. ఆకలి లేనివారు వీటిని తింటే మంచి ఫలితం ఉంటుంది. జ్వరం లేదా ఏదైనా అనారోగ్యం నుంచి కోలుకున్న తర్వాత నోరు చేదుగా ఉండి ఆహారం తినాలనిపించకపోతే, తెల్ల ఆవాలు ఆ సమస్యను తగ్గిస్తాయి. అంతేకాక, వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. కాబట్టి, తెల్ల ఆవాలు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి, మలబద్ధకం సమస్యను దూరం చేస్తాయి.తెల్ల ఆవాలు షుగర్ మరియు రక్తపోటు ఉన్నవారికి చాలా మేలు చేస్తాయి. తెల్ల ఆవాలలో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. ఇది నాడీ మండలం పనితీరును మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా, నిద్రలో కాలి పిక్కలు పట్టేయడం వంటి సమస్యలను తగ్గిస్తుంది. మెగ్నీషియం రక్తంలోని షుగర్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే, వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరంలో రక్త సరఫరా మెరుగుపడుతుంది, తద్వారా అధిక రక్తపోటు సమస్య అదుపులో ఉంటుంది. ఈ తెల్ల ఆవాలలో క్యాల్షియం కూడా అధిక మొత్తంలో ఉంటుంది, ఇది ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాక, తెల్ల ఆవాలలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. వీటిని వాడటం వల్ల కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు మరియు వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఇది చాలా మంచిది. ఈ గింజల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి సహజసిద్ధమైన యాంటీబయాటిక్‌గా పనిచేసి, రోగ నిరోధక శక్తిని పెంచుతాయి, తద్వారా ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. తెల్ల ఆవాలను పొడి రూపంలో తయారుచేసి రోజువారీ ఆహారంలో కాస్త తీసుకుంటే, ఈ ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# బిజినెస్

## తొలిసారి రూ. 91 మార్కు తాకిన రూపాయి విలువ




గ్లోబల్ మార్కెట్ల ముందు భారత రూపాయి వెలవెలబోతోంది. ఇప్పటికే రికార్డు స్థాయి క్షీణతను చూసిన భారత కరెన్సీ రూపాయి, మంగళవారం మరింత పతనమైంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ప్రస్తుత పరిణామాలే దేశీయ కరెన్సీ విలువ పడిపోవడానికి కారణమని ప్రభుత్వం రాజ్యసభలో పేర్కొంది. మంగళవారం ఓ దశలో దేశీయ కరెన్సీ అమెరికా డాలర్‌తో పోలిస్తే 36 పైసలు బలహీనపడి రూ. 91.14 వద్ద అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. ఆ తర్వాత కొంత కోలుకున్నప్పటికీ, సాయంత్రం సమయానికి రూ. 90.94 వద్ద కొత్త కనిష్టానికి చేరింది. డాలర్ బలహీనత, అంతర్జాతీయ ముడి చమురు ధరలు భారీగా తగ్గడం కూడా దేశీయ కరెన్సీ పతనాన్ని ఆపలేకపోయాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. గత 10 ట్రేడింగ్ సెషన్లలో రూపాయి డాలర్‌కు రూ. 90 నుంచి రూ. 91కి పడిపోయింది. కేవలం గత ఐదు సెషన్లలోనే రూపాయి డాలర్‌తో పోలిస్తే 1 శాతం క్షీణించింది. మంగళవారం ఈ అంశం రాజ్యసభలో ప్రస్తావనకు రావడంతో, దీనిపై ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య లోటు పెరగడం, విదేశీ పెట్టుబడిదారుల నుంచి బలహీనమైన మద్దతు, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందంలో జరుగుతున్న పరిణామాలు రూపాయి విలువ క్షీణతను ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. కరెన్సీ విలువ క్షీణించడం ఎగుమతుల్లో పోటీని పెంచుతుంది. ఇది పరోక్షంగా ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతున్నట్టే. మరోవైపు, విలువ క్షీణత దిగుమతి చేసుకున్న వస్తువుల ధరలను పెంచవచ్చు. అయితే, మారకపు రేటు క్షీణత దేశీయ ధరలపై చూపే మొత్తం ప్రభావం, అంతర్జాతీయ వస్తువుల ధరలు దేశీయ మార్కెట్‌కు ఎంతమేరకు వస్తాయనే దానిపై ఆధారపడి ఉంటుందని ఆయన వివరించారు. 2015లో రూపాయి అమెరికా డాలర్‌తో పోలిస్తే 4.5 శాతం, 2016లో 2.6 శాతం క్షీణించింది. ఆ తర్వాత 2017లో 6.4 శాతం పెరిగిందని డేటా చెబుతోంది. 2017 నుంచి రూపాయి విలువలో నిరంతర పతనం కొనసాగుతోంది. 2018లో 8.5 శాతం, 2019లో 2.3 శాతం, 2020లో 2.3 శాతం, 2021లో 1.7 శాతం, 2022లో 10.2 శాతం, 2023లో 0.6 శాతం, 2024లో 2.8 శాతం మేర పడిపోయిందని కేంద్ర మంత్రి చెప్పారు. మరోవైపు, భారతీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మద్దతు లేకపోవడంతో పాటు బలహీన రూపాయి, విదేశీ ఇన్వెస్టర్ల నిధుల ఉపసంహరణ వంటి అంశాలు నష్టాలకు కారణం. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 533.30 పాయింట్లు కుదేలై 84,679 వద్ద, నిఫ్టీ 167.20 పాయింట్లు క్షీణించి 25,860 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, ఎంఅండ్‌ఎం, ఏషియన్ పెయింట్ షేర్లు లాభాలను దక్కించుకున్నాయి. యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఆల్ట్రా సిమెంట్ స్టాక్స్ అధిక నష్టాలను నమోదు చేశాయి.

### 600 బిలియన్ డాలర్ల తొలి సంపన్నుడిగా ఎలన్ మస్క్ రికార్డు



ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్ మస్క్ మరిన్ని కొత్త రికార్డులతో ఎవ్వరికీ అందనంత ఎత్తుకు వెళ్తున్నారు. తాజాగా ప్రపంచంలోనే 600 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ.54.54 లక్షల కోట్లు) సంపద ఉన్న మొదటివ్యక్తిగా నిలిచారు. మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్ స్టార్టప్ 800 బిలియన్ల డాలర్ల విలువతో ఐపీఓకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన సంపద భారీగా పుంజుకుంది. ఈ ఏడాది అక్టోబర్‌లోనే మొదటిసారిగా 500 బిలియన్ డాలర్ల మార్కును అధిగమించిన మస్క్, వచ్చే ఏడాది ఐపీఓకు వస్తున్న స్పేస్ఎక్స్‌లో 42 శాతం వాటాను కలిగి ఉన్నట్టు రాయిటర్స్ పేర్కొంది. ఫోర్బ్స్ ప్రకారం, స్పేస్ఎక్స్ వాల్యుయేషన్ కారణంగా మస్క్ సంపద 168 బిలియన్ డాలర్లు పెరిగి 677 బిలియన్ డాలర్లకు చేరింది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ టెస్లాలో మస్క్‌కు దాదాపు 12 శాతం వాటా ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు టెస్లా షేర్లు అమ్మకాలు తగ్గినప్పటికీ 13 శాతం పెరిగాయి. ఎలన్ మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లు పెరగడ్మతో ప్రపంచంలో ఏ ధనవంతుడు సాధించని స్థాయిలో సంపదను సంపాదించారు. ఫోర్బ్స్ వివరాల ప్రకారం, ఎలన్ మస్క్ తర్వాత ప్రపంచ సంపన్నుల్లో ఒరాకిల్ ఫౌండర్ ల్యారీ ఎలిసన్ 400 బిలియన్ డాలర్ల మార్కును తాకారు. ఆ తర్వాత ఆయన సంపద క్షీణించింది. ప్రస్తుతం ఆయన సంప్ద 265 బిలియన్ డాలర్ల వద్ద ఉంది.

### ఫ్లిప్‌కార్ట్‌లో గెలాక్సీ డేస్ సేల్‌ను ప్రకటించిన శాంసంగ్



ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ శాంసంగ్ మొదటిసారి గెలాక్సీ డేస్ సేల్‌ను తీసుకొచ్చింది. ఫ్లిప్‌కార్ట్‌లో ప్రారంభించిన ఈ సేల్‌లో భాగంగా కంపెనీ తన స్మార్ట్‌ఫోన్ కొనుగోళ్లపై భారీ రాయితీలు, ప్రయోజనాలు అందిస్తున్నట్టు తెలిపింది. ఈ సేల్ డిసెంబర్ 16-18 మధ్య మూడు రోజులు మాత్రమే ఉంటుందని, ఇది కేవలం ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ-కామర్స్ యాప్, వెబ్‌సైట్‌లో కస్టమర్లు అధిక ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, పెయిర్-అప్ డీల్స్, శాంసంగ్ కేర్ ప్లస్ ప్రయోజనాలు, రివార్డులను కూడా పొందవచ్చని ఫ్లిప్‌కార్ట్ వెల్లడించింది. రూ. 12,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్‌తో పాటు ఎంపిక చేసిన గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లపై అధిక ఎక్స్ఛేంజ్ వాల్యూ పొందవచ్చు. అదనంగా, శాంసంగ్ పెయిర్-అప్ డీల్స్ కూడా తీసుకొచ్చింది. ఇందులో భాగంగా కస్టమర్లు అర్హత కలిగిన గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లతో కొనుగోలు చేసినప్పుడు గెలాక్సీ వేరబుల్స్, యాక్సెసరీలపై రూ. 5000 వరకు ఆదా చేసుకోవచ్చు. ఎంపిక చేసిన శాంసంగ్ ఫోన్‌లు, వేరబుల్స్‌తో పాటు టాబ్లెట్‌లు, ల్యాప్‌టాప్‌లపైనా డిస్కౌంట్‌లను పొందవచ్చు. కస్తమర్లు శాంసంగ్ కేర్ ప్లస్ ప్లాన్‌ను కూడా యాడ్ చేసుకోవచ్చు. ఈ ప్లాన్ అర్హత ఉన్న గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లపై ప్రమాదవశాత్తు, మరో రకంగా నష్టాలకు దీర్ఘకాలిక మద్దతును అందిస్తుంది.

## వచ్చే ఏడాది భారత వృద్ధి 7.5 శాతం



వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థికవ్యవస్థ 7.5 శాతం వృద్ధి సాధిస్తుందని యాక్సిస్ క్యాపిటల్ నివేదిక తెలిపింది. ఇండియా మార్కెట్ ఔట్‌లుక్-2026 పేరుతో విడుదల చేసిన నివేదిక ప్రకారం, వడ్డీ రేట్లను తగ్గించడం మూలంగా క్రెడిట్ వృద్ధి మరింత మెరుగుపడుతుందని, పెట్టుబడి, వినియోగానికి బలమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రభుత్వం తన ఖర్చులను నియంత్రించడం కొనసాగిస్తున్నప్పటికీ, ఒత్తిడి మునుపటి కంటే తేలికగా ఉంటుంది. చౌకైన రుణాల వల్ల వ్యాపారాలు, వినియోగదారుల నుంచి రుణాలు తీసుకునే అవకాశాలు పెరుగుతాయి. తద్వారా ఖర్చు, పెట్టుబడులను పెంచుతుంది. అదే సమయంలో, సులభ వ్యాపార నిబంధనలు, లేబర్ కోడ్స్ మార్పులు, తక్కువ నియంత్రణ అడ్డంకులు వృద్ధికి తోడ్పడతాయని భావిస్తున్నారు. గత కొంత కాలంగా భారత్ 7 శాతం కంటే ఎక్కువగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో, దేశం దీర్ఘకాలిక వృద్ధి సామర్థ్యం ఇంకా ఎక్కువగా ఉందని నిపుణులు నమ్ముతున్నారు. వేగవంతమైన వృద్ధి ఉన్నప్పటికీ, ధరలు అదే స్థాయిలో పెరిగే అవకాశం లేదు. ఆర్థిక వ్యవస్థకు అనుకూలమైన ద్రవ్యోల్బణం 4 శాతానికి దగ్గరగా ఉంటుందని యాక్సిస్ బ్యాంక్ రీసెర్చ్ అంచనా వేసింది.

## ఐపీఎల్ వేలంలో రూ. 25 కోట్లు.. కట్ చేస్తే! అక్కడ డకౌట్



ఐపీఎల్-2026 మినీ వేలంలో ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను రూ. 25.20 కోట్ల భారీ ధరకు కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా రికార్డు సృష్టించిన గ్రీన్.. వేలం ముగిసిన కొన్ని గంటల వ్యవధిలోనే తన పేలవ ప్రదర్శనతో అందరిని నిరాశపరిచాడు. ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ప్రారంభమైన మూడో టెస్టులో గ్రీన్ డకౌటయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన గ్రీన్ తన పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. 2 బంతులు ఎదుర్కొని జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో బ్రైడన్ కార్స్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో నెటిజన్లు గ్రీన్‌పై సెటైర్లు వేస్తున్నారు. ఐపీఎల్‌లో కూడా ఇలానే ఆడుతావా? కేకేఆర్ భయపడుతోంది అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. గాయం కారణంగా గత ఐపీఎల్ సీజన్‌కు దూరంగా ఉన్న గ్రీన్.. ఈసారి కేకేఆర్ తరపున బరిలోకి దిగనున్నాడు. గతంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్‌కు ఆడాడు. దాదాపు ఆరు నెలల తర్వాత పోటీ క్రికెట్‌లో తిరిగొచ్చిన గ్రీన్.. టెస్టుల్లో మాత్రం రాణించలేకపోతున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాత్రం పర్వాలేదనిపిస్తున్నాడు. అయితే కామెరూన్ తనదైన రోజున ఒంటి చేత్తో జట్టును గెలిపించగలడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 8 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. ఆసీస్ బ్యాటర్లలో అలెక్స్ క్యారీ(106) సూపర్ సెంచరీతో చెలరేగగా.. ఉస్మాన్ ఖవాజా(126 బంతుల్లో 82), ఇంగ్లిష్(32) రాణించారు. ప్రస్తుతం క్రీజులో మిచెల్ స్టార్క్(33), లియోన్(0) ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ మూడు వికెట్లు పడగొట్టగా.. విల్ జాక్స్, బ్రైడన్ కార్స్ తలా రెండు వికెట్లు సాధించారు.

## ఆస్ట్రేలియాకు ఊహించని షాక్.. ఆఖరి నిమిషంలో!

ఆడిలైడ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న యాషెస్ మూడో టెస్టులో ఆస్ట్రేలియాకు ఊహించని షాక్ తగిలింది. ఈ మ్యాచ్ ఆరంభానికి ముందు స్టీవ్ స్మిత్ అనారోగ్యం బారిన పడ్డాడు. స్మిత్ 'వర్టిగో' (తల తిరగడం) వంటి లక్షణాలతో బాధపడుతుండటంతో ఆఖరి నిమిషంలో ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పుకొన్నాడు. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా ధ్రువీకరిచింది. స్మిత్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వికారం, తలతిరగడం వంటి లక్షణాలు అతడికి ఉన్నాయి. స్మిత్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నప్పటికీ, మ్యాచ్ సమయానికి పూర్తిస్థాయిలో కోలుకోలేకపోయారు. అతడిని ఆడించి రిస్క్ తీసుకుడదని మెనెజ్‌మెంట్ విశ్రాంతిని ఇచ్చింది. అతడు తిరిగి నాలుగో టెస్టు సమయానికి పూర్తిగా కోలుకునే ఛాన్స్ ఉంది అని క్రికెట్ ఆస్ట్రేలియా అధికారి ఒకరు మీడియాతో పేర్కొన్నాడు.

**అదరగొట్టిన ఉస్మాన్..**

ఇక స్మిత్ స్థానంలో వెటరన్ బ్యాటర్ ఉస్మాన్ ఖావాజాకు తుది జట్టులో చోటు దక్కింది. గత రెండు టెస్టుల్లో ఆడని ఖవాజా.. స్మిత్ స్థానంలో నాలుగో నంబర్ బ్యాటర్‌గా బరిలోకి దిగాడు. అయితే ఉస్మాన్ తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకున్నాడు.

మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఓపెనర్లు వెనుదిరగడంతో ఖవాజా జట్టు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను తన భుజాన వేసుకున్నాడు. 120 బంతుల్లో 82 పరుగులు చేసి కీలక నాక్ ఆడాడు. 48 ఓవర్లు ముగిసే సరికి 5 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. ?కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ తిరిగి జట్టులోకి రావడం ఆసీస్‌కు కాస్త ఊరటనిచ్చే అంశం.




**మూడో టెస్టుకు ఆసీస్ ప్లేయింగ్ ఎలెవన్**

జేక్ వెదరాల్డ్, ట్రావిస్ హెడ్, మార్నస్ లబుషేన్, ఉస్మాన్ ఖవాజా, కెమెరూన్ గ్రీన్, అలెక్స్ కేరీ, జోష్ ఇంగ్లిస్, పాట్ కమిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియోన్, స్కాట్ బోలాండ్.

# స్పోర్ట్స్

## సౌతాఫ్రికాతో నాలుగో టీ20.. భారత తుది జట్టు ఇదే! అతడికి మరో ఛాన్స్




లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా సౌతాఫ్రికాతో నాలుగో టీ20లో తలపడేందుకు టీమిండియా సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 3-1 తేడాతో సొంతం చేసుకోవాలని భారత్ పట్టుదలతో ఉంది. అయితే ఈ మ్యాచ్‌కు టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉంటాడా లేదా అన్నది ఇంకా క్లారిటీ లేదు. ధర్మశాల వేదికగా జరిగిన మూడో టీ20కు ముందు తన సన్నిహితుడొకరు ఆస్పత్రిపాలవడంతో వెంటనే అతడు ముంబైకి తిరిగి వెళ్లిపోయాడు. ఈ నాలుగో టీ20కు బుమ్రా అందుబాటులో ఉండవచ్చని దూబే ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెప్పినప్పటికి.. టీమ్ మెనెజ్‌మెంట్ మాత్రం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఒకవేళ బుమ్రా ఆడకపోతే హర్షిత్ రాణాను ప్లేయింగ్ ఎలెవన్‌లో కొనసాగించనున్నారు. గత మ్యాచ్‌లో బుమ్రా స్థానంలో వచ్చిన హర్షిత్ రాణా అద్భుతంగా రాణించాడు. క్వింటన్ డి కాక్, డెవాల్డ్ బ్రెవిస్ వంటి కీలక వికెట్లు తీసి సఫారీలను దెబ్బ తీశాడు. టీమిండియా ఎటువంటి ప్రయోగాలు చేయకుండా గత మ్యాచ్ ఆడినే జట్టునే లక్నోలోనూ కొనసాగించనుంది. లక్నో వంటి పరిస్థితుల్లో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి జోడీ మరోసారి కీలకంగా మారనున్నారు. బుమ్రా అందుబాటులోకి వస్తే రాణాపై వేటు పడే అవకాశముంది. మరోవైపు సంజూ శాంసన్ ఈ మ్యాచ్‌కూ బెంచ్‌కే పరిమితమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. సౌతాఫ్రికా జట్టులో మరోసారి మార్పులు చోటు చేసుకునే అవకాశముంది. డేవిడ్ మిల్లర్ తిరిగి జట్టులోకి రానున్నాడు.

తుది జట్లు

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్ ), డికాక్, రిజా హెండ్రిక్స్, బ్రెవిస్, మిల్లర్, ఫెరిరా, యాన్సెన్, బాష్, జార్జ్ లిండే/కేశవ్, ఎంగిడీ, బార్ట్‌మన్.

భారత్

సూర్యకుమార్ (కెప్టెన్ ), అభిషేక్, శుభ్‌మన్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి.



## కొందరు నాకు టికెట్ డబ్బులు కూడా పంపారు.. లెవన్ సినిమాపై నవీన్ చంద్ర

కన్నడ స్టార్ యాక్టర్ కిచ్చా సుదీప్ నటిస్తోన్న కన్నడ ప్రాజెక్ట్ మార్క్. విజయ్ కార్తికేయ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో నవీన్ చంద్ర కీలక పాత్రలో నటిస్తున్నాడు. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. ఓ ఇంటర్వ్యూలో లెవన్ సినిమా గురించి ఆసక్తికర విషయాన్ని షేర్ చేశాడు నవీన్ చంద్ర. లెవన్ అమెజాన్ ప్రైం వీడియోలోకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఊహించని విషయం జరిగిందన్నాడు. లెవన్ మూవీ ఓటీటీలో విడుదలైన తర్వాత జనాలు తనపై అమితమైన ప్రేమ చూపించారని అన్నాడు నవీన్ చంద్ర. ఈ ఇన్వెస్టిగేవ్ థ్రిల్లర్‌ను థియేటర్లలో చూడలేకపోయినందుకు కొందరు విచారం వ్యక్తం చేస్తూ తనకు టికెట్ డబ్బులు కూడా పంపారన్నాడు నవీన్ చంద్ర. లోకేశ్ అజిల్స్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో రెయా హరి, శశాంక్, అభిరామి, దిలీపన్, రిత్విక, రవి వర్మ, కిరీటి దామరాజు కీలక పాత్రల్లో నటించారు. వరుస హత్యలు చేస్తున్న హంతకుడిని పట్టుకునే నేపథ్యంలో సాగే స్టోరీలో హంతకుడిని పట్టుకునే పోలీసాఫీసర్ పాత్రలో నవీన్ చంద్ర కనిపిస్తాడు. ట్విస్టులు, సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో నడిచే లెవన్‌పై మీరూ ఓ లుక్కేయండి మరి.




## రజినీకాంత్ జైలర్ 2 క్రేజీ టాక్.. కావాలయ్యా మ్యాజిక్‌ను నోరా ఫతేహి రిపీట్ చేయనుందా..?

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న క్రేజీ సీక్వెల్ జైలర్ 2 కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ ఇచ్చాడని తెలిసిందే. జైలర్‌లో తమన్నాపై వచ్చే నువ్ కావాలయ్యా సాంగ్ నెట్టింటిని ఓ ఊపు ఊపేసింది. జైలర్ 2లో కూడా ఈ సాంగ్ లైన్స్‌లోనే మరో పాట కూడా ఉండబోతుంది. బాలీవుడ్ భామ నోరా ఫతేహి స్పెషల్ సాంగ్‌లో మెరువనుంది. జైలర్ 2 స్పెషల్ సాంగ్‌ను ప్రస్తుతం చెన్నైలో షూట్ చేస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. మరి కావాలయ్యా క్రేజ్, మ్యాజిక్‌ను సీక్వెల్‌లో తెరకెక్కిస్తున్న సాంగ్ రీక్రియేట్ చేస్తుందా..? అనేది ఆసక్తికరంగా మారింది. నోరా ఫతేహి డ్యాన్స్ అంటే ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ భామ సిల్వర్ స్క్రీన్‌పై ఎలా మెరువతుందో చూడాలి మరి. జైలర్ 2 ఇటీవలే గోవాలో షూటింగ్ జరుపుకోగా.. ఈ షెడ్యూల్‌లో విజయ్ సేతుపతిపై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించారని ఇన్‌సైడ్ టాక్. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ విజయ్ సేతుపతి కీలక పాత్రల్లో నటిస్తున్నారని సమాచారం. మేకర్స్ నుంచి అఫీషియల్ అప్‌డేట్ రావాల్సి ఉంది. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించగా సీక్వెల్‌లో వారి పాత్రలు కొనసాగింపు ఉంటుందా..బీ? అనేది సస్పెన్స్ నెలకొంది.

## క్రేజీ లైనప్.. మరో బాలీవుడ్ ప్రాజెక్టులో తమన్నా



తెలుగు, తమిళం, హిందీతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.





## లైన్‌లోకి టాప్ కంపెనీలు.. ఆదిసాయికుమార్ శంబాలపై పెరుగుతున్న హైప్

టాలీవుడ్ యాక్టర్ ఆదిసాయికుమార్ నటిస్తోన్న తాజా చిత్రం శంబాల ఈ చిత్రానికి ఏ యాడ్ ఇన్ఫినిటీ ఫేం యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నాడు. అర్చనా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట హైప్ క్రియేట్ చేస్తుంది. వివిధ ప్రాంతాల్లో ఈ చిత్రాన్ని టాప్ డిస్ట్రిబ్యూషన్ హౌస్‌లు పంపిణీ చేస్తున్నాయి. నైజాం ఏరియాలో ఈ చిత్రాన్ని మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్‌పీ విడుదల చేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్, సీడెడ్ ఏరియాల్లో ఉషా పిక్చర్స్, విదేశీ మార్కెట్, కర్ణాటకలో మూన్‌షైన్ సినిమాస్, కుమార్ బెంగళూరు ఫిలిమ్స్ ఓవర్సీస్‌లో విడుదల చేయనున్నాయి. శంబాల చిత్రాన్ని టాప్ కంపెనీలు విడుదల చేస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఈ చిత్రంలో లబ్బర్ పందు ఫేం స్వసిక, రవి వర్మ, మధునందన్, శివ కార్తీక్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా శంబాల ఓటీటీ పాపులర్ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహా దక్కించుకోగా.. తెలుగు శాటిలైట్ రైట్స్‌ను జీ దక్కించుకుంది. ఇప్పటికే ఆది సాయికుమార్ టీం షేర్ చేసిన శంబాల రషెస్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. సూపర్ న్యాచురల్ థ్రిల్స్, ఇలాంటి ప్రపంచాన్ని నిర్మించడం తొలిసారి.. స్టన్నింగ్ విజువల్స్, ఇంటెన్స్ స్టోరీ టెల్లింగ్, వీఎఫ్‌ఎక్స్ పార్ట్‌తో భారీగా స్థాయిలో రాబోతున్నాం.. అంటూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు మేకర్స్. ఈ మూవీని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్, అన్నభీమోజు, మహిధర్ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ రాబోతున్న ఈ మూవీలో ఆది జియో సైంటిస్ట్‌గా కనిపించనున్నాడని సమాచారం. ఈ మూవీకి శ్రీమ్ మద్దూరి సంగీతం అందిస్తున్నారు

## టెక్నాలజీతో దారుణమైన ఫొటోలు.. షాక్‌లో శ్రీలీల

ప్రస్తుతం ఏఐ టెక్నాలజీ పలు రకాలుగా వినియోగంలోకి వచ్చేసింది. మిగతా విషయాల్లో ఏమో గానీ సినిమా వాళ్లకు మాత్రం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే కీర్తి సురేశ్ లాంటి హీరోయిన్లు.. దీని బారిన పడగా ఇప్పుడు శ్రీలీల కూడా తనకెదురైన అనుభవాన్ని బయటపెట్టింది. కొన్నింటిని చూసి చాలా డిస్ట్రబ్ అయిపోయానని చెప్పింది. 'ఏఐ నాన్సెన్స్‌ని ఎవరూ సపోర్ట్ చేయొద్దని చేతులు జోడించి ప్రాధేయపడుతున్నా. టెక్నాలజీ వినియోగానికి ఓ పద్ధతి అంటూ ఉంది. ఇది మన జీవితాల్ని సులభతరం చేయడానికి. సంక్లిష్టం చేసుకోవడానికి కాదు. నా బిజీ షెడ్యూల్స్ వల్ల బయట జరిగే చాలా విషయాలు నాకు తెలియవు. అయితే ఓ విషయాన్ని నా దృష్టికి తీసుకొచ్చినందుకు థ్యాంక్స్. చాలావాటిని నేను లైట్ తీసుకుంటాను. కానీ ఇది మాత్రం నన్ను చాలా డిస్ట్రబ్ చేసింది. నా తోటీ నటీనటులు కూడా ఇలాంటి వాటిని అనుభవించారు. కాబట్టి మాకు అండగా నిలబడాలని మిమ్మల్ని కోరుకుంటున్నారు. ఇకపై సంబంధిత అధికారులు ఈ విషయాన్ని చూసుకుంటారు' అని శ్రీలీల చెప్పుకొచ్చింది. అయితే రీసెంట్ టైంలో శ్రీలీల ఫొటోలని కొన్నింటిని ఏఐ టెక్నాలజీతో రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. వీటిని చూసిన నెటిజన్లు.. ఇవి నిజమే అని భ్రమపడుతున్నారు. షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీలీల ఇప్పుడు స్పందించాల్సి వచ్చింది. ఈ హీరోయిన్ ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్, పరాశక్తి అనే సినిమాల్లో నటిస్తోంది.





## ఒక్క ఫొటోతో సోషల్ మీడియా షేక్.. నివేథా థామస్ అందానికి నెటిజన్లు ఫిదా!

టాలీవుడ్‌లో సహజమైన నటనకు పెట్టింది పేరు నివేథా థామస్. 'నాని జెంటిల్‌మన్', 'నిన్ను కోరి', 'వకీల్ సాబ్', '35' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఈ మలయాళ కుట్టి సోషల్ మీడియాలో అంత యాక్టివ్‌గా ఉండకపోయినా.. అప్పుడప్పుడు పెట్టే పోస్టులు మాత్రం ఓ రేంజ్‌లో వైరల్ అవుతుంటాయి. తాజాగా నివేథా తన సోషల్ మీడియా ఖాతాలో శారీలో ఒక సరికొత్త ఫొటోను షేర్ చేసింది. ఇందులో ఆమె లుక్ చాలా డిఫరెంట్‌గా, క్లాసీగా ఉంది. ఎప్పుడూ పద్ధతిగా కనిపించే నివేథా, ఈ ఫొటోలో కూడా ట్రెడిషనల్ లుక్‌లో అదరగొడుతుంది. ఈ ఫొటో చూసిన అభిమానులు "అందానికే అసూయ పుట్టేలా ఉంది", "నేచురల్ బ్యూటీ అంటే నీదే" అంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే వేల సంఖ్యలో లైకులు, షేర్లు రావడంతో ఈ ఫొటో ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది.

వార్తాతరంగాలు

శనివారం 20 డిసెంబర్ 2025

# వీబీ జీ రామ్‌జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. బిల్లుపై సుధీర్ఘంగా చర్చించారని చెప్పారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.



**లోక్‌సభలో గందరగోళం..**

కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు.

మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారాయన. వీ+బీ=జు+రూ అవినీతి సాధనం తప్ప మరొకటి కాదని, అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అనంతరం సభను వాయిదా వేశారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. వీ+బీ=జు+రూ పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు ప్రియాంక. కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించివేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. 'మీకు వ్యతిరేకించే హక్కు ఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తన సరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారు చేయడం, స్పీకర్‌పై విసరడం సరికాదు. దేశంలోనే అతిపురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ 'హే రామ్' అనే అన్నారు.' అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# రష్యా సైన్యంలో 202 మంది భారతీయులు... 26 మంది మృతి

రష్యా సైన్యంలో 2022 నుంచి ఇప్పటివరకు 202 మంది భారతీయులు చేరారని, వారిలో 26 మంది మరణించగా, మరో ఏడుగురు గల్లంతయ్యారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇవాళ రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే, కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ వివరాలు తెలిపారు. భారత్ చేపట్టిన దౌత్యపరమైన చర్యల ఫలితంగా ఇప్పటివరకు 119 మందిని రష్యా సైన్యం నుంచి విడిపించి వెనక్కి తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. మరో 50 మంది భారతీయులు ఇంకా విడుదల కోసం ఎదురుచూస్తున్నారని, వారి భద్రత, సంక్షేమం, వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తెలిపారు. యుద్ధంలో మరణించిన 26 మందిలో 10 మంది మృత దేహాలను భారత్‌కు తరలించినట్లు ప్రభుత్వం ధృవీకరించింది. మరో ఇద్దరి అంత్యక్రియలు భారత రాయబార కార్యాలయం సహాయంతో రష్యాలోనే స్థానికంగా పూర్తి చేసినట్లు పేర్కొంది. మరణించిన లేదా గల్లంతైన వారిలో కొందరిని గుర్తించేందుకు, 18 మంది భారతీయుల కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాలను రష్యా అధికారులతో పంచుకున్నట్లు మంత్రి తెలిపారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం, సైన్యం నుంచి విడుదలైన వారికి ప్రయాణ పత్రాలు, విమాన టిక్కెట్లు, ఇతర లాజిస్టికల్ మద్దతు అందిస్తోందని ప్రభుత్వం తెలిపింది. ఈ అంశాన్ని ఇరు దేశాల నేతలు, మంత్రులు,



ఉన్నతాధికారుల మధ్య జరిగిన పలు సమావేశాల్లో ప్రస్తావించినట్లు చెప్పింది. మిగిలిన భారతీయులందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే వరకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయని పార్లమెంటుకు హామీ ఇచ్చింది.

# శబరిమలకు రికార్డు స్థాయిలో ఆదాయం

శబరిమలలో అత్యధిక భక్తుల రద్దీ తర్వాత భారీ ఆదాయం వచ్చినట్లు దేవస్వం బోర్డు అధ్యక్షుడు కేకేక జయకుమార్ పేర్కొన్నారు. ఇందులో 106 కోట్ల రూపాయలను అమ్మకానికి కేటాయించారు. గతేడాది ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం గణనీయంగా పెరిగింది. అలాగే భక్తులకు ముందుగా చెల్లించిన డిపాజిట్ మొత్తాన్నితిరిగే చెల్లించలేదనే ఫిర్యాదుకు ప్రతిస్పందనగా..అందుకోసం ప్రత్యేక కౌంటర్ తెరవనున్నట్లు దేవస్వం బోర్డు అధ్యక్షుడు తెలిపారు.

వద్ద రద్దీ కారణంగా చాలామంది ప్రజకలు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. కౌంటర్ ఆఫీసు పనిచేస్తుందని,భక్తుల మొత్తాన్ని తిరిగి అప్పగించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతానికి 500 గదులు ఉన్నాయన్నారు. సాఫ్టవేర్ కూడా మారనుంది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో గది బుక్ చేసుకోవడానికి ముందస్తు



డిపాజిట్లు చెల్లించన మొత్తం తిరిగి ఇవ్వబడుతుందని అన్నారు.ఆన్‌లైన్‌లో బుక్‌చేసిన మొత్తం తిరిగి ఖాతాలో జమ చేయబడుతుందని అన్నారు.

**యథావిధిగా నియంత్రణ**

ఒక వ్యక్తికి 20 టిన్లు ఇవ్వాలనే నిర్ణయం కొనసాగుతుందని రాష్ట్రపతి అన్నారు. ప్రతి ఒక్కరికీ రిజర్వేషన్లు కల్పించడానికి ఇలాంటి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేదప్రజలకు అసౌకర్యం కలిగించదని అన్నారు. మండల పూజ తరువాత, ప్లాంట్ 27 న మూసివేసి అనంతరం మూడు రోజుల తర్వాత తెరుస్తానమని అన్నారు. ఈ ఏడాది దాదాపు 45 లక్షల అరవణ నిల్వల సేకరణతో తీర్థయాత్ర సీజన్ ప్రారంభమైంది. కానీ అవన్నీ అనూహ్యంగా అమ్ముడయ్యాయని అన్నారు. రోజుకు 3.5 లక్షల మేర టిన్లను విక్రయించాలని అనుకున్నా.. సగటున్న నాలుగున్నర లక్షలు పైనే అమ్ముడయ్యాయని అన్నారు. ప్రస్తుతం. ఒక మిలియన్ కంటే ఎక్కువ టిన్లు నిల్వలు ఉన్నట్లు తెలిపారు.

## ఆ గ్రామ జనాభా 1,500..

## 3 నెలల్లో 27,000కుపైగా జననాలు!

**ముంబై:** ఆ గ్రామ జనాభా కేవలం 1,500. అయితే మూడు నెలల్లో 27,000కు పైగా జననాలు అక్కడ నమోదయ్యాయి. ఈ విషయం తెలుసుకుని అధికారులు షాక్ అయ్యారు. అతిపెద్ద జనన ధృవీకరణ పత్రాల స్కామ్ జరిగినట్లు గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అర్ని తహసీల్‌లోని షెందురుసాని గ్రామ పంచాయతీ జనాభా కేవలం 1,500. అయితే ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి నవంబర్ మధ్య కేవలం మూడు నెలల్లోనే 27,397 జననాలు ఆ గ్రామంలో నమోదయ్యాయి. కాగా, ఈ విషయం తెలిసి జిల్లా ఆరోగ్య అధికారులు షాక్ అయ్యారు. ఆ గ్రామాన్ని సందర్శించారు. అసాధారణ రీతిలో నమోదైన జననాల ధృవీకరణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంతో అతిపెద్ద జనన ధృవీకరణ పత్రాల స్కామ్ బయటపడింది. జనన, మరణ నమోదు వ్యవస్థ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)ను



సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లు గుర్తించారు. గ్రామ పంచాయతీ సీఆర్ఎస్ లాగిన్ ఐడీ ముంబైకి మ్యాప్ అయ్యిందని తెలుసుకుని అధికారులు షాక్ అయ్యారు. మరోవైపు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కూడా పంచాయతీ శాఖ డిప్యూటీ సీఈవో ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. మూడు నెలల్లో నమోదైన 27,397 జననాలు, ఏడు మరణాలు గ్రామ పంచాయతీ పరిధికి వెలుపల ఉన్నట్లు ఆ కమిటీ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆరోగ్య అధికారి ఈ స్కామ్‌పై యావత్మల్ నగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐటీ చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీజేపీ సీనియర్ నేత కిరీట్ సోమయ్య బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ నమోదైన జననాల్లో 99 శాతం పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తులవేనని తెలిపారు.

## ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం. అంతకుముందు, ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (జజుూూ) కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'మైత్రీ పర్వ్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, ఇండియా-ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని, ఒమన్ వ్యాపారవేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

## బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం..

## భారత్‌కు పెనుముప్పు



బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద శిక్షణ శిబిరాలు వెలుస్తున్నాయని, అల్‌ఖైదాకు చెందిన వ్యక్తులు అక్కడ చురుగ్గా పనిచేస్తున్నారని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్ వాజేద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాలో ఇలాంటి ఉగ్రచర్యలు భారత్‌కు పెనుముప్పు అని ఆయన హెచ్చరించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం భారత్‌కు అత్యంత ప్రమాదకరం అని అన్నారు. ప్రజాస్వామ్యాలను అణగదొక్కేలా ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఇస్లామిక్ పార్టీలకు అధికారం కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఈ మార్పు భారత్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపనుందని తెలిపారు. లష్కరే తోయిబా కమాండర్లు బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడుతున్నారని వెల్లడించారు. ఇవన్నీ భారత్‌కు ముప్పేనని, ఇది వాస్తవమని వ్యాఖ్యానించారు. జమాతే ఇస్లామీ వంటి ఇతర ఇస్లామిక్ పార్టీలకు తాత్కాలిక ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ఆరోపించారు. అలాంటి శక్తుల ప్రభావంతో బంగ్లాదేశ్‌లో అస్థిరత నెలకొందని అన్నారు. దేశంలోని సగం మంది ఓటర్లను తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేస్తోందని ఆరోపించారు. గతంలో ఇస్లామిక్ సంస్థలపై అవామీ లీగ్ పాలనలో విధించిన ఆంక్షలను యూనస్ ప్రభుత్వం సడలించిందని ఆయన అన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉన్న పాక్ వంటి దేశాలతో బంగ్లాదేశ్ తాత్కాలిక సర్కారు అంటకాగుతోందని విమర్శించారు. అవామీలీగ్ అధికారంలో ఉన్నప్పుడు భారత తూర్పు సరిహద్దులను ఉగ్రవాదుల నుంచి సురక్షితంగా ఉంచామని గుర్తు చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం తిరిగి రావాలని, ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కష్టకాలం ముగిసింది..

## అతిపెద్ద తుఫాను నుంచి బయటపడ్డాం



ఇండిగోలో తలెత్తిన సంక్షోభంపై ఆ సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ స్పందించారు. ఈ మేరకు ఉద్యోగులకు ఓ వీడియో సందేశాన్ని పంపారు. కష్టకాలం ముగిసిందని తెలిపారు. సంక్షోభం సమయంలో తమకు అండగా నిలిచిన సిబ్బందికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అంతేకాదు.. ఎయిర్‌లైన్ రోజువారీ సర్వీసులు పునరుద్ధరించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు దాదాపు 2,200 విమానాలను నడుపుతున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమిష్టి కృషి, క్రమశిక్షణకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'కష్టకాలం ముగిసింది. అతిపెద్ద సవాలును అధిగమించాం. ఇండిగో ఉద్యోగులు, మేము ఒకరికొకరం మద్దతుగా నిలిచి ఈ తుఫాన్‌ను ఎదుర్కొన్నాం. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఓసీసీ, కస్టమర్ సర్వీస్ ఇలా మాకు మద్దతు ఇచ్చిన అన్ని విభాగాల ఉద్యోగులకు ధన్యవాదాలు' అని తెలిపారు. అంతేకాదు.. పలు కారణాలు ఒక్కసారిగా ముంచుకురావడంతో ఈ సమస్య తీవ్ర రూపం దాల్చినట్లు చెప్పారు. డిసెంబర్ 9నాటికి పరిస్థితులు చక్కబడతాయని ఉద్యోగులకు తెలియజేసినట్లు చెప్పారు. ఆ తర్వాత సంస్థ తన షెడ్యూల్‌ను పునర్నిర్మించుకుందని అన్నారు. సంస్థను మరింత దృఢంగా తీర్చిదిద్దడంతో పాటు సమస్యకు కారణాలు అన్వేషించడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. సమస్యకు మూల కారణాన్ని విశ్లేషించేందుకు విదేశీ నిపుణుడిని రంగంలోకి దింపిన విషయాన్ని కూడా సీఈఓ పీటర్ ఎల్బర్స్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి అంతరాయాలు ప్రపంచంలోని పెద్ద విమాన యాన సంస్థలను కూడా ప్రభావితం చేసినట్లు గుర్తు చేశారు. ఇలాంటి కొన్ని సంక్షోభ పరిస్థితులు మన వ్యవస్థలను బలోపేతం చేయడానికి కూడా సాయపడతాయని అభిప్రాయపడ్డారు. సంక్షోభానికి గల కారణాలను విశ్లేషించి సంస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇకపై ఉద్యోగులు ప్రశాంతంగా ఉండాలని, వారు బాధ్యతలపై దృష్టిపెట్టాలని సూచించారు. 'సంస్థలో ప్రస్తుతం 65 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. సంస్థ ఇప్పటివరకు 850 మిలియన్లకు పైగా కస్టమర్లకు సేవలందించింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137